Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 286 • శనివారం 27 జనవరి 2018 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 •

Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



ఘనతంత్ర వేడుకలు



రాజ్‌పథ్‌లో ఒంటెల దళం బలప్రదర్శన... గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోడీ

- ఆసియన్ దేశాల అధినేతల సాక్షిగా పతాకావిష్కరణ.. జెండావందనం
- భారతదేశ ఆయుధ బలప్రదర్శనకు సాక్షిగా రాజ్‌పథ్
- అబ్బురపడిన ఆత్మీయ అతిథులు
- అశోకచక్ర బహూకరణ సమయాన రాష్ట్రపతి భావోద్వేగం
- కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకున్న కోవింద్
- ఆరో వరుసలో రాహుల్‌కు సీటు





వివరాలు 11లో...

మోడీ స్వరం మారింది..?!

- ఇక్కడ మేకిన్ ఇండియా పిలుపు
- దావోస్‌లో 'విదేశీ'కి తలుపులు బార్లా
- అంతర్జాతీయ మార్కెట్‌పై పట్టు కోసమా?
- మరి స్వదేశీ సంగతేంటి..?
- ఇదమిద్దంగా తేల్చని ప్రధాని ప్రకటనలు
- విదేశాంగ విధానంలోనూ అదే తేడా!

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)



అంతర్జాతీయ ఆర్థిక సదస్సుకు హాజరైన ప్రధాని మోడీ ప్రసంగాల తీరు దేశ ప్రజల్లోనే కాదు.. అంతర్జాతీయంగా కూడా పలు సందేహాలకు తావిస్తోంది. మోడి అధికారంలోకి వచ్చిన వెంటనే మేకిన్ ఇండియా నినాదాన్ని తెరపైకి తెచ్చారు. విదేశీ పెట్టుబడులకంటే స్వదేశీ తయారీకే మొగ్గుచూపాలంటూ ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. అన్నిరంగాల్లోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగానే అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకు తగ్గ రీతిలో ప్రణాళికలు సిద్ధం చేసి అమల్లో పెట్టారు. అంతర్జాతీయ బహుళజాతి సంస్థల ఉత్పాదనలకు ధీటుగా స్వదేశీ ఉత్పత్తుల్ని ప్రోత్సహించారు. ఈ చర్యలతో దేశీయంగా ఉత్పత్తి రంగం వేళ్లూనుకుంటుందన్న విశ్వాసం ప్రజల్లో ఏర్పడింది. ప్రపంచంలోనే ఇప్పుడు భారత్ అతిపెద్ద వినిమయ మార్కెట్. ఈ దేశంలో ఉన్నంతమంది మధ్యతరగతి కుటుంబీకులు ప్రపంచంలో మరెక్కడా లేరు. పైగా గత దశాబ్దంలో సగటున ఏటా 6.1 శాతం చొప్పున ప్రజల కొనుగోలుశక్తి పెరగడం కూడా మరే దేశంలో లేదు. దీంతో ప్రపంచ దేశాలన్నీ తమ ఉత్పత్తుల విక్రయాలకు భారత్‌నే అతిపెద్ద వినిమయ మార్కెట్‌గా భావిస్తున్న దశలో మేకిన్ ఇండియా నినాదంతో తమ వ్యాపారాలకు గండిపడుతుందన్న భయానికి లోనయ్యాయి.

ఈ దశలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రధాని ప్రసంగం తిరిగి పెట్టుబడిదారి దేశాలకు ఉత్సాహాన్ని పెంచింది. ఈ ప్రసంగాన్ని చైనా ప్రశంసించింది. దావోస్ వేదికపై మోడి ప్రపంచీకరణను భారత్ ప్రోత్సహిస్తోందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచిల వ్యవహరిస్తోందంటూ చెప్పడాన్ని చైనా స్వాగతించింది. ముఖ్యంగా స్వదేశీకి మాత్రమే పరిమితం కాకుండా విదేశీకి తలుపులు బార్లా తెరవాలన్న మోడీ ఆలోచనా తీరును ప్రశంసలతో ముంచెత్తింది. చైనా కూడా సరిగ్గా ఇలాంటి ఆలోచనలకే పరిమితమైందంటూ ఆ దేశం పేర్కొంది. ఇరుదేశాల ఆలోచనా విధానాలు ఒకేలా ఉన్నాయంటూ మోడిని అభినందించింది. ఇక్కడ దేశంలో పతంజలి వంటి స్థానిక ఉత్పాదక సంస్థల్ని మోడీ ప్రభుత్వం విశేషంగా ప్రోత్సహిస్తోంది. ఓ విధంగా ఆ ఉత్పత్తులకు మోడి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఓ పక్క దావోస్‌లో ప్రపంచ దేశాలకు తలుపులు బార్లా తీసాం.. చొచ్చుకొచ్చి పెట్టుబడులు పెట్టండంటూ మోడి పిలుపునిచ్చి అలా 48గంటలు కాకముందే గణతంత్ర దినోత్సవ వేడుకల

➪ 3వ పేజీలో...

ఉపాధికి ఊపిరిగా... స్టార్టప్స్



మాతో భాగస్వాములు కండి

- తెలంగాణ అంతటా డిజిటల్ సేవలే
- దావోస్ సదస్సులో మంత్రి కేటీఆర్
- సీఐఏ సెంటర్‌లో రిపబ్లిక్ డే ఉత్సవాలు
- కేంద్ర మంత్రులతో పాటు తెలుగు రాష్ట్రాల ఐటీ మంత్రులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద కంపెనీల నుంచి కాకుండా స్టార్టప్స్ నుంచే వస్తాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఈ రంగానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. పరిశోధనల్లో ఆసక్తిగల కంపెనీలకు తమ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతుందని, టి-హబ్, టి-వర్క్స్, రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్)లతో భాగస్వాములు కావాల్సిందిగా ఆయన ప్రపంచ ఐటి దిగ్గజాలను కోరారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో 'డిజిటల్ టెక్నాలజీ ప్రయోజనాలను సమాజానికి అందించడం' అన్న అంశంపై మంత్రి శుక్రవారం ప్రసంగించారు. ఈ సమావేశంలోని ప్యానలిస్టులంతా ఆయా దేశాల కేంద్ర ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహించగా, మంత్రి కేటీఆర్ ఒక్కరికే ఒక రాష్ట్రమంత్రిగా ఇందులో పాల్గొనే అవకాశం దక్కడం గమనార్హం. మంత్రి తన ప్రసంగంలో తెలంగాణ ప్రభుత్వం మొదలుపెట్టిన డిజిటల్ తెలంగాణ కార్యక్రమం గురించి వివరించారు. ఇందులో భాగంగా మిషన్ భగీరథతో పాటు ప్రతి ఇంటికీ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సౌకర్యం ఫైబర్-గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా కల్పిస్తున్నామని, ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ మాధ్యమాల ద్వారా అందజేస్తున్నామని, అలాగే డిజిటల్ అక్షరాస్యతా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. బెల్జియం, బ్రెజిల్, డెన్మార్క్, పోర్చుగల్, మయన్మార్, ఇండోనేషియా, నైజీరియా, లెబనాన్, బంగ్లాదేశ్, ఖతార్, పాకిస్థాన్ దేశాల మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇన్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన భారత్‌లో ఆర్అండ్‌డి అన్న అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కేటీఆర్

➪ 10వ పేజీలో...

నీట్‌లో ఇక ఒకే సెట్ ప్రశ్నపత్రం

ఈ ఏడాది నుంచే అమలు • సుప్రీం కోర్టు సూచనకు సీబీఎస్ఈ అంగీకారం

10

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ దశమి ఉ. 7.10 వరకు, అనంతరం ఏకాదశి తె. 5.03 వరకు; నక్షత్రం: రోహిణి రా. 1.05 వరకు, అనంతరం మృగశిర; అమృతకాలం: రా. 10.00 నుండి 11.30 వరకు; వర్జ్యం: సా. 5.30 నుండి 7.00 వరకు; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

ఔరా..!





శుక్రవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రిపబ్లిక్ దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌.పి. సింగ్

కేసీఆర్ పట్టుదలతో ప్రగతి ఫలాలు

రిపబ్లిక్ డే వేడుకలో గవర్నర్ నరసింహన్

- అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ పరమావధి
- సరాసరిగా ఏటా రూ.40 వేల కోట్లతో సంక్షేమ పథకాల అమలు
- లక్ష్యాలను చేరుకోవడం సంతోషంగా ఉంది
- వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఫలితాలు భేష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తూ తమ ప్రభుత్వం సంక్షేమ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ తెలిపారు. పేద వర్గాల ఆర్థికాభ్యున్నతి సాధించడం ద్వారా తెలంగాణ పునర్ నిర్మాణం సాధించవచ్చునని గట్టిగా నమ్ముతూ నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణాలో సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రతియేటా దాదాపు రూ.40వేల కోట్లు

➪ 3వ పేజీలో...

హెచ్-1బి వీసాలపై మరో బిల్లు

- పరిమితి పెంచాలని ఒత్తిళ్లు
- ఆమోదించాలని దిగ్గజ కంపెనీలు
- ఇక లాటరీ వీసాలకు స్వస్తి



వాషింగ్టన్: అమెరికాలో ప్రస్తుతం హెచ్1బీ వీసాలో మార్పుల విషయమై దుమారం చెలరేగుతోంది. వీసాల జారీలో నిబంధనలు కఠినతరం చేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నది. ఈ తరుణంలో ఇద్దరు రిపబ్లికన్ సెనెట్‌లో ఓ కొత్త బిల్లును సభలో ప్రవేశపెట్టారు. హెచ్1బీ వీసా పరిమితిని పెంచాలని ఇద్దరు రిపబ్లికన్ సెనెట్ బిల్లులోని సారాంశం. ఆరిన్ హాచ్, జెఫ్ప్ ఫ్లాక్‌లు ది ఇమ్మిగ్రేషన్ ఇన్నోవేషన్ యాక్ట్ -2018 పేరుతో ఈ బిల్లును సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారని, హెచ్1బీ వీసాలో తీసుకొచ్చే మార్పుల కారణంగా అమెరికాలో అడుగు పెట్టలేకపోతున్నారని, దీనికితోడు పరిమితి కూడా ఓ కారణం అని ఇద్దరు

➪ 10వ పేజీలో...



10 లో

రబీ పంటకు సక్రమంగా సాగునీరు

కాల్వల వెంట క్షేత్రస్థాయిలో సీఈల పర్యవేక్షణ: మంత్రి హరీష్‌రావు



మేడారం జాతరలో అద్దె గుడారాలు

- ఆదివాసీ జాతరకు హైటెక్ హంగులు
- డ్రోన్ కెమెరాలు..
- హెలికాప్టర్ సేవలు

9 లో

కుషాయిగూడలో కాల్పుల కలకలం 5 లో కడుపులోనే కడతేరుస్తున్నారు

ప్రగతి భవన్‌లో కేసీఆర్ జెండా ఆవిష్కరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ప్రగతి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, కేసీఆర్ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో గవర్నర్‌తో కలిసి పాల్గొన్నారు.

సైనిక అమరవీరుల స్థూపం వద్ద గవర్నర్, సీఎం నివాళులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లోని సైనిక అమరవీరుల స్థూపంవద్ద గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావులు పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. దేశ రక్షణలో సైనికుల పాత్రను కొనియాడుతూ శ్రద్ధాంజలి ఘటించారు. అంతకు ముందు త్రివిధ దళాల ఉన్నతాధికారులు కూడా నివాళులర్పించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు కవాతు నిర్వహించాయి.



ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం.



బీజేపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి పార్టీ సీనియర్లు, మహిళా నాయకురాళ్లు.



తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద డిప్యూటీ సీఎం ముహమూద్ అలీ, మంత్రి నాయిని నరసింహారెడ్డి , కార్యకర్తలు తదితరులు

ప్రభుత్వ దుర్నీతిపై పోరాటమే

- ఎన్టీఆర్ భవన్‌లో టీటీడీపీ అధ్యక్షుడు రమణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ప్రభుత్వ వైఫ్యలాలపై పోరాటమే తమ లక్ష్యమని, పేదల పక్షాన ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని తెలుగు దేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ స్పష్టంచేశారు. ప్రభుత్వ దుర్నీతిపై ప్రజాక్షేత్రంలో పోరాటంచేస్తూ వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా ఉద్యమించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎన్‌టిఆర్ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్క రించారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించి తెదేపా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా లేదని, రాష్ట్ర అప్పులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ మంత్రిత్వాన్ని ఎదుర్కోవడం తమ పార్టీకే సాధ్యమని ఆయన అన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, తాను చెప్పిందే రాజ్యాం గమని కేసీఆర్ పాలన తీరు ఉందని దుయ్యబట్టారు. ఎన్‌టిఆర్ ఆశీస్సులు, చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సమైక్యంగా ముందుకు వెళదా మని అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, సమసమాజాన్ని స్థాపించేందుకు తెలుగుదేశం అనేక సంస్కరణలు తెచ్చిందని గుర్తుచేశారు.

కన్నుల పండువగా

మహా హారతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారతదేశానికి గొప్ప దనం త్యాగాలతోనే వచ్చిం దని శ్రీపీఠం అధిపతి, భారత్‌మాతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి పరిపూర్ణానంద స్వామి అన్నారు. మన దేశం కీర్తి ప్రతిష్టలు, శక్తిసామర్థ్యాలను భారత చివర అంచులను విడిచిపెట్టి వరం క్షణంలోనే తెలుసుకున్నారు. అందుకే స్వామి వివేకానందలాంటి వ్యక్తి విదేశాల్లో పర్యటించి భారతగడ్డపై కాలుమోపగానే ఒక్కసారి భూమాతకు సాష్టాంగ నమస్కరించారని గుర్తు చేశారు. అంతటి గొప్ప సంస్కృతి, మాధుర్యం ఉన్న దేశం....మన దేశమని అన్నారు. హైదరాబాద్, పీపుల్స్‌ప్లాజాలో భారత్ మాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా హారతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కన్నుల పండువుగా సాగింది. ఈ సందర్భంగా 25 అడగులు భారతమాత విగ్రహాన్ని నెలకొల్పారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థినులు భారత మాత వేశధారణతో తరలి వచ్చి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా ఆలపించిన దేశభక్తి గీతాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్శించాయి.

అనంతరం స్వామి పరిపూర్ణానందస్వామి ప్రసంగిస్తూ, దేశానికి 29 మంది స్వచ్ఛ వ్యక్తులు వస్తే మన దేశ [illegible] అవుతుందన్నారు. అలాంటి వారు త్వరలో భూమిపై అవతరించాలని ఆకాంక్షించారు. 70 ఏళ్ళ కిందట మన దేశం స్వేచ్ఛ కోసం పరితపించగా, 70 సంవత్సరాల తరువాత స్వచ్ఛ భారత్‌వైపు అడుగులు వేస్తోందన్నారు. చేసే పనిలోనూ, చెప్పే విధానంలోనూ ద్వంద్వ నీతి ఉండకూడదన్నారు. భారతమాత వల ఎంతో శక్తి సామర్థ్యాలు వెలుగుచూశాయని పరిపూర్ణానంద అన్నా రు. అందుకే భారతదేశంమంటే ప్రపంచలో ఒక విశిష్ట గుర్తింపు ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన మన శక్తిని, జనవరి 26వ తేదీన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. 300 సంవత్సరాల సుదీర్ఘపోరాటం, ముప్పై తరాల ప్రాణ తర్పణం చేసిన ఘనత మన భారతదేశానిదని అన్నారు. అందుకే మన సంస్కృతి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అంతకు ముందు మాడుగుల నాగభూషణం మాట్లాడుతూ, దేశభక్తిని పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.



పాలకుల రాజ్యాంగ ఉల్లంఘన

- ప్రజలకు రక్షణ కరువైంది
- జాతీయ జెండా ఆవిష్కరణలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పాలకుల నుంచి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. 69 గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఎల్పీ నేత జానారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, మండలిలో విపక్షనేత షబ్బీర్ అలీ, సీనియర్ నేతలు సర్వారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, సర్వే సత్యనారాయణ, వి. హనుమంతరావు, మధుయాష్కీగౌడ్, సేవాదళ్ చైర్మన్ కనుకుల జనార్ధన్‌రెడ్డి, దాసం నాగేందర్, అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రాష్ట్రంలోని పాలకులు అవమానిస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ పేరు మీద ఉన్న ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు ఉంటే.. ఈ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చిందని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు రైతులకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. మద్దతు ధర అడిగిన పాపానికి గిరిజన రైతులకు ఈ ప్రభుత్వం బేడీలు వేసిందన్నారు. ప్రజాస్వామ్య ఉద్యమకారులకు తావు లేదని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఉద్యమ కారులపై అక్రమ కేసులు పెట్టి సంకెళ్లు వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. ఈ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. 2019 ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్లతో పాటు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



పెరిగిన దక్షిణ మధ్య రైల్వే రాబడి

- జీఎం వినోద్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణ మధ్య రైల్వే 2017 డిసెంబర్ నాటికి రూ. 9472 కోట్ల స్థూల ఆదాయాన్ని ఆర్జించింది. గత సంవత్సరంతో పోల్చుకుంటే రూ. 700 కోట్లు అధికం. ప్రజా, సరకు రవాణాలో కూడా గణనీయమైన పురోగతిని సాధించింది. ఆపరేటింగ్ రేషియో 88.65 శాతంగా నమోదయింది. జోన్ ఈ సంవత్సరం రూ.3844.50 కోట్ల నిర్వహణ మిగులును సాధించింది. డిసెంబర్ వరకు 73,286 మిలియన్ టన్నుల సరుకులను, 286.98 మిలియన్ల ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చింది. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త రైల్వే మార్గాల నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు జోన్ పరిధిలో 113 కిలో మీటర్ల కొత్త రైలు మార్గాల నిర్మాణాలు, 17 కిలో మీటర్ల డబ్లింగ్ పనులు, 490 కిలో మీటర్ల మేరకు మార్గాలను విద్యుదీకరించడం జరిగిందని ప్రకటించారు. సంవత్సర కాలంలో ఇన్ని పనులు పూర్తి చేయడం ఒక రికార్డు అని వినోద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణ, భద్రత విషయంలో అనేక జాగ్రత్తలు పాటిస్తున్నామని, నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని తెలియచేశారు. జోన్‌లో కాపలాలేని 61 రైల్వే లేవల్ క్రాసింగ్‌లను తొలగించామన్నారు.

2500 మె.వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సింగరేణి సిద్ధం : సీఎండీ శ్రీధర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర, దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో భారీ విస్తరణకు సంసిద్ధమవుతోందని సింగరేణి సింఎడీ ఎన్ .శ్రీధర్ వెల్లడించారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో జరిగిన గణ తంత్రవేడుకల్లో పాల్గొన్న శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 నాటికి 850లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2500మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు అమలు జరపనున్నామని వెల్లడించారు. 2010-14మధ్య 52మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 నుంచి ఇప్పటివరకూ 25శాతం వృద్ధితో 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి స్థాయికి చేరుకోగలిగామన్నారు. అలాగే 2015లో 14వేలకోట్ల రూపాయలు ఉన్న అమ్మకాలు గత మూడేళ్లలో రూ.23500కోట్లకు పెరిగాయని వివరించారు. ఈ ఏడాది కంపెనీ లాభాలు రూ.1000కోట్లు దాటే అవకాశం ఉందన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి 8250కోట్ల రూపాయలతో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 1200మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పిందని , దీని ద్వారా ఏటా రూ.3500కోట్ల అమ్మకాలు జరుగుతున్నాయని, తద్వారా రూ.350కోట్లు లాభం సాధించామన్నారు. ఇదే ప్రాగంణంలో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటును సుమారు రూ.2500కోట్లతో నిర్మిస్తున్నామని వెల్ల డించారు. ఉత్తమ అధికారులుగా ఎంపికైన దండే వెంకటేషం, అకెల్ల భాస్కర్ , తెరవల్లి శేషగిరిరావు, ఎం.రవీందర్, ఏ.శ్రీరాములులను ఎంసీడీ శ్రీధర్ ఈసందర్భంగాసన్మానించారు.

సురక్షిత మంచినీరు ప్రజల హక్కు

- తాగునీటిపారుదల సంస్థ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత రాజ్యాంగం ప్రసాదించిన జీవించేహక్కును పరిరక్షించడంలో సురక్షిత మంచి నీరు ప్రధాన ప్రాత్ర పోషిస్తుందని రాష్ట్ర గ్రామీణ తాగునీటి సరఫరా సంస్థ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి అన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో ఈఎన్‌సీ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ రక్షిత మంచినీటిని అందించే మిషన్ భగీరథ సమానత్వానికి ప్రతీక అన్నారు. ఎందరో వీరుల బలిదానాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి విశిష్టమైన రాజ్యాంగంతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సార్ధకత చేకూర్చారన్నారు. కుల, మత ,వర్గ భేదాలు లేకుండా వసుధైక కుటుంబంగా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలన్నదే రాజ్యాంగ నిర్మాతల స్వప్నమన్నారు. ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే వారికోరిక అన్నారు. రాజ్యాంగ నిర్మాతల ఆశయ సాధనకోసం ప్రతిఒక్కరూ ప్రయత్నించాలన్నారు. తాగడానికి గుక్కెడు మంచినీళ్లు దొరకని మారుమూల ప్రాంతాలకు కూడా ఇవాళ భగీరధతో నీటిని అందిస్తున్నామన్నారు.



ఏపీ భవన్‌లో గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లోనూ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉదయం జరిగిన ఈ వేడుకల్లో భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అంబేద్కర్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్ర సాంస్కృతిక కేంద్ర, ఆదిలీల ఫౌండేషన్, తెలుగు వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్, సమైక్య తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏపీ భవన్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు, నృత్యాలతో నిర్వహించిన వందేమాతరం - భరతమాతకు వందనం కార్యక్రమం ఆద్యంతం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు ఢిల్లీ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు వారు తరలి వచ్చారు.



రాజ్యాంగ నిర్మాణానికి ఎందరో మహానుభావుల కృషి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైకోర్టు ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. 69వ రిపబ్లిక్ డే సందర్భంగా ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రమేశ్ రంగనాథన్ ప్రసంగిస్తూ ..జనవరి3, 1954న భారత న్యాయవ్యవస్థలో ప్రథమ పరీక్ష ఎదుర్కొందని తెలిపారు. అప్పుడు భారత ప్రధాన న్యాయమూర్తి(సీజె) గా ఉన్న జస్టిస్ పతంజలి శాస్త్రి జనవరి4 ,1954న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అప్పటి జవహర్ లాల్ నెహ్రూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిజోన్ కుమార్ ముఖర్జీని సీజె గా పదవి బాధ్యతలు చేపట్టాలని కోరారు. మరో న్యాయమూర్తి జస్టిస్ మెహర్ చంద్ మహాజన్ తన కంటే సీనియర్ అయినందువల్ల తాను సీజె బాధ్యతలు చేపట్టలేనని జస్టిస్ ముఖర్జీ వినమ్రంగా బదులిచ్చారు. నెహ్రూ ఒత్తిడి చేసినప్పటికీ ఆతను సీజె గా బాధ్యతలు చేపట్టేందుకు నిరాకరించారని ఏసీజె పేర్కొన్నారు. అంతగా ఒత్తిడి చేస్తే తన పదవికి రాజీనామా చేస్తాను కానీ సీజె పదవిని చేపట్టలేనని జస్టిస్ ముఖర్జీ స్పష్టం చేశారని తెలిపారు. సీజె గా జస్టిస్ మహాజన్ రిటైరైన తర్వాతనే జస్టిస్ ముఖర్జీ 4వ సీజె గా పదవీ బాధ్యతలు చేపట్టినట్లు ఏసీజె వెల్లడించారు. తనస్వీయ ప్రయోజనాల కన్నా న్యాయవ్యవస్థ ఎంతో గొప్పదని పూర్వపు సీజె జస్టిస్ ముఖర్జీ నిరూపించారన్నారు.

ఉన్నత విద్యాశాఖలో వేడుకలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: దేశ వ్యాప్తంగా 69వ ఘణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఘణతంత్ర దినోత్సవాల్లో భాగంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిఎస్‌పిఎస్సీ) కార్యాలయంలోనూ జాతీయ జెండాను ఎగుర వేశారు. కమిషన్ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి వాణిప్రసాద్ టిఎస్‌పిఎస్సీ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలోనూ 69వ ఘణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అడ్మిషన్లు, ఫీజురెగ్యులేటరీ కమిటీ(ఏఎఫ్‌ఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య వెంకటరణమ, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావుతోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం ముంబాపురంలో వరి నారుమడిలో దేశ చిత్రపటాన్ని తయారుచేసిన రైతులు రాములు, అంజిలయ్య, తలారి రాములు, కృష్ణ



మగ్దూం భవన్‌లో జెండా వందనం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తదితరులు

ఎస్పీడీసీఎల్‌కు టీఎస్ ఐపాస్ అవార్డు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న టీఎస్ ఐపాస్ పథకం అమలులో భాగంగా విద్యుత్ సంస్థల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఎస్పీడీసీఎల్ సీఎండి జి.రఘుమారెడ్డికి ఈ అవార్డును అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమ సంస్థ పరిధిలో విద్యుత్ కనెక్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకూ 1567 దఖాస్తులు రాగా అందులో 50శాతం దరఖాస్తులు పరిశీలించి అదేరోజు విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేసినట్టు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం నుంచి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించినందుకు గర్వంగా ఉందని ఈ అవార్డును పొందటం వెనుక ఎస్పీడీసీఎల్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి కృషి దాగివుందని సీఎండీ రఘుమారెడ్డి పేర్కొన్నారు.



మోడీ స్వరం మారింది..?!

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా పతంజలి సంస్థ అందుకు విరుద్ధమైన పిలుపునిచ్చింది. దేశంలో "స్వదేశీనే ప్రోత్సహిద్దాం.. విదేశీ ఉత్పత్తుల్ని తిప్పికొడదాం" అంటూ ఆ సంస్థ దేశవ్యాప్తంగా ఓ ఉద్యమానికి కార్యాచరణ సిద్ధం చేసింది. వాస్తవానికి మోడి, పతంజలి సంస్థ రెండూ ఒకే తానులోని వేర్వేరు ముక్కలు. రెండింటి నుంచి ఒకే విధమైన నినాదం రావడమే ఇందుకు తార్కాణం. కానీ అందుకు భిన్నవైఖరులు వ్యక్తమౌతు న్నాయి. దీంతో మోడి ప్రభుత్వం విధానాన్ని మార్చుకుందా లేదా సవరించిందా అన్నది మేధావులకు కూడా అంతు బట్టడంలేదు.

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులు ప్రతి ఏటా జరుగుతూనే ఉంటాయి. అయితే కొందరు ముఖ్యమంత్రులు, కొన్ని చిన్నచిన్న దేశాల అధిపతులు, ముఖ్యంగా వ్యాపార దేశాల పాలకులు పెద్దసంఖ్యలో అంతర్జాతీయ వర్తక ప్రతినిధులే ఈ సమావేశాలకు హాజరౌతుంటారు. ఎప్పుడో దేవగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో ఒకసారి ఈ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఆ తర్వాత ఇన్నాళ్ళకు తిరిగి ఓ భారత ప్రధాని ఈ సదస్సుకెళ్ళారు. అప్పటికీ ఇప్పటికీ ఈ రెండు దశాబ్దాల కాలంలో అంతర్జాతీయ పెట్టుబడులు, వాణిజ్య కార్యకలాపాలతో పాటు దావోస్ వేదికపై ప్రాధాన్యతాంశాల్లో కూడా అనేక మార్పులొచ్చాయి. ప్రపంచ ఆర్థిక మాంద్యం తర్వాత దావోస్ ప్రాధాన్యత తగ్గింది. కానీ 2015తర్వాత తిరిగి ప్రపంచ మార్కెట్ జోరందుకోవడంతో ఈ సదస్సుకు హాజరౌతున్నవారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అలాగే ఆర్థిక మాంద్యం తాకని దేశం ఒక్క భారతే. అనేక ఒడిదుడుకుల్లో కూడా వరుసగా కనీసం ఆరుశాతం దాటిన అభివృద్ధిని నమోదు చేస్తున్నది కూడా ఒక్క భారతే. ఈ కారణంగా ఆర్థిక మాంద్యం అనంతరం కోలుకుంటున్న దేశాలన్నీ పెట్టుబడులు పెట్టేందుకు భారతే సరైన గమ్యంగా భావిస్తున్నాయి. అలాగే భారత్ మార్కెట్‌పై పలు ఉత్పాదక దేశాలు కన్నేశాయి. అమెరికా, కెనడా, బ్రిటన్, ఇజ్రాయెల్‌తో పాటు యూరోపియన్ యూనియన్ కూడా భారత్‌తో మరిన్ని ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి చాలాకాలంగా కృషి చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఈ సదస్సుకు హాజరైన మోడి తన ప్రసంగంలో ఆర్థిక సరళీకరణ, ప్రాపంచీకరణలను భారత్ గట్టిగా విశ్వసిస్తోందంటూ స్పష్టం చేశారు. ప్రాపంచీకరణ కొత్త అధ్యాయంలో సరికొత్త ఆర్థిక ఒప్పందాలకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. భారత్‌తో కలిసి ప్రయాణించే ఆసక్తిగల వారికిదే మంచి సమయంగా పేర్కొన్నారు. ఉత్పాదకత సాధించే పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. భారత మార్కెట్‌లోకి వినిమయ వస్తువులకు స్వాగతం పలుకుతున్నామన్నారు. అంతేకాదు.. కేంద్రంతో పాటు దేశంలోని కొన్ని రాష్ట్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద షాపింగ్‌మాల్స్ నిర్వహణ సంస్థ ఆలీబాబా వంటివాటితో పెద్దసంఖ్యలో శాఖల ఏర్పాటుకు ఒప్పందాలు కూడా చేసుకుంటున్నాయి. చైనా వంటి అతిపెద్ద ఉత్పాదక సామ్రాజ్యానికి కావా ల్సిందిదే. తమ ఉత్పత్తుల్ని అమ్ముకనేందుకు భారతే తగిన వేదిక. కానీ భారత్ కొంతకాలంగా స్వదేశీ ఉత్పాదకతవైపే మొగ్గుచూపడం చైనాను కొంత ఆందోళనకు గురిచేసింది. చైనాతో పాటు జపాన్, దక్షిణకొరియా, తదితర దేశాల్లో కూడా గుబులు రేగింది. ఓ పక్క చైనా వృద్ధిరేటు మందగిస్తోంది. భారతీయ ఈక్విటీ మార్కెట్లు జోరందుకున్నాయి. ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ రూపుదిద్దుకుంటోందని శాంటమ్‌వెల్త్ మేనేజ్‌మెంట్ అనే అధ్యయన సంస్థ మూడ్రోజుల క్రితమే నివేదిక ప్రకటించింది. భారత్ ఈక్విటీ మార్కెట్లో ఆరు నుంచి ఎనిమిది శాతం అధికంగా రాబడులు సాధిస్తున్నాయని కూడా స్పష్టం చేసింది. ఈ దశలో భారత్‌లో పెట్టుబడులు ఏ దేశానికైనా లాభదాయకంగానే ఉంటాయి. మోడి ఉపన్యాసంతో ఈ దేశాలన్నీ ఒక్కసారిగా తేరుకున్నాయి. తిరిగి భారత్‌వైపు ఆశగా చూస్తున్నాయి.

మోడి కూడా విదేశీ విధానాన్ని సవరించుకుంటున్నట్లే కనిపిస్తోంది. తన ప్రమాణస్వీకారోత్సవానికి సార్క్ దేశాధినేతలందర్నీ ఆహ్వానించిన మోడి పరిసర దేశాలతో స్నేహం పెంచుకునే ప్రయత్నం చేశారు. అయితే అనంతరకాలంలో సరిహద్దు దేశాలన్నింటితో సంబంధాలు బెడిసికొట్టాయి. ఆహ్వానం లేకుండానే ప్రోటోకాల్ నిబంధనల్ని పక్కనపెట్టి లాహోర్‌కెళ్ళి నవాజ్ షరీఫ్ తల్లి ఆశీర్వాదం తీసుకున్నా పాక్‌తో సంబంధాలు మెరుగవలేదు. పైగా మరింత దిగజారిపోయాయి. ఇప్పుడు తిరిగి పరిసర దేశాలతో సాన్నిహిత్యం పెంపునకు మోడి ప్రయత్నాలు వేగవంతం చేశారు. ఈసారి గణతంత్ర దినోత్సవానికి ఏకంగా పదిమంది దేశాధినేతల్ని ఢిల్లీకి ఆహ్వానించారు. మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, లావోస్, కాంబోడియా, బ్రూనై, థాయ్‌లాండ్, మలేషియా, వియత్నాం, ఇండోనేషియా పాలకులతో కూడిన ఆసియాన్ బృందం ఈ గణతంత్ర వేడుకల్లో ముఖ్యఅతిధులుగా కొలువుదీరారు. మరోవైపు కేంద్రం జారీ చేసిన పద్మఅవార్డులను కూడా 14మంది విదేశీయులకు ప్రకటించారు. ముఖ్యంగా రష్యా, అమెరికా, జపాన్, ఇండోనేషియా, కాంబోడియా, లావోస్, సింగపూర్, తజకిస్థాన్, వియత్నాం, బ్రూనై, సౌదీఅరేబియా దేశాలకు చెందిన వారికి కూడా దేశ అత్యున్నత అవార్డులిచ్చి ఆయా దేశాలతో సత్సంబంధాల్ని మరింత మెరుగుపర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

దీంతో మోడి ప్రభుత్వం స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహానికే పరిమితమౌతుందా లేక అంతర్జాతీయ మార్కెట్‌ను ఒడిసిపట్టుకునే ప్రయత్నం చేస్తుందా.. భారత్‌లో పెరిగిన కొనుగోలు శక్తికనుగుణంగా ఇక్కడి మార్కెట్లపై పట్టుబిగించేందుకు తహతహలాడుతున్న విదేశీ వ్యాపార సంస్థలకు ఎర్రతివాచీ పరుస్తోందా అన్నది మాత్రం ఇతమిద్ధంగా తేలడంలేదు.



ఆరంభం, ముగింపు తెలుగులోనే...

- సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గవర్నర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవంలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించారు. వేదికపై నుంచి తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ నిర్మాణానికి కృషి చేసిన మహానుభావులను స్మరించుకుంటూ ఈ వేడుకలు జరుపుకుంటున్నామని, ఇందులో భాగంగా తెలంగాణ సాధించిన అభివృద్ధి ఫలాలను కూడా ప్రజలు తెలుసుకోవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం తన ప్రసంగం ముగింపు సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అవకాశాలను అనుకూలంగా మలుచుకుంటూ అభివృద్ధిపథంలో దూసుకువెళుతోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి ప్రజలంతా ప్రభుత్వంతో కలిసివచ్చి పునరంకితం కావాలని నరసింహన్ పిలుపునిచ్చారు. గత కొన్నేళ్ళుగా గవర్నర్ గణతంత్ర వేడుకల్లో జాతిని ఉద్దేశించి ఇస్తున్న సందేశాన్ని తెలుగులోనే మొదలుపెట్టడం, తెలుగులోనే ముగింపు పలకడం సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో తెలుగు తప్పనిసరి చేసే నేపథ్యంలో ఈ ఏడాది కూడా అదే విధానాన్ని అవలంబించారు.



రాజ్‌భవన్‌లో తేనేటి విందు

- సీఎం కేసీఆర్, ఇరు రాష్ట్రాల మంత్రులు, అధికారులు హాజరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ఇచ్చిన తేనేటి విందుకు ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, శాసన సభాధిపతి సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి చైర్మన్ వి.స్వామిగౌడ్, ఉపసభాపతి పద్మ, మాజీ గవర్నర్, ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మరో మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు, తెలంగాణ, ఏపీ ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, కేఈ కృష్ణమూర్తి, తెలుగు రాష్ట్రాల మంత్రులు హరీష్‌రావు, జగదీష్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, పత్తిపాటి పుల్లారావు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యులు డి.శ్రీనివాస్, రాపోలు ఆనంద భాస్కర్, మాజీ సిబిఐ డైరెక్టర్లు హనుమంతు జగన్నాయకుల దొర (హెచ్‌జె దొర), కె.విజయ రామారావు, లోక్‌సభ సభ్యులు వినోద్ కుమార్, బాల్క సుమన్, ప్రభుత్వ సలహాదారులు వినోద్, పాపారావు, ఏకే గోయల్, డీజీపీ మహేందర్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమీషనర్ మహేష్ భగవత్, మాజీ కేంద్రమంత్రి, సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ, మాజీ మంత్రి, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇతర పుర ప్రముఖులు ఈ విందుకు హాజరైన వారిలో ఉన్నారు.







కేసీఆర్ పట్టుదలతో ప్రగతి ఫలాలు





(మొదటిపేజీ తరువాయి)

ఖర్చు చేస్తున్నామన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మరింత పురోగతి సాధించే దిశగా చర్యలు తీసుకుంటూనే ఈ ఏడాది ఖరీఫ్ నుంచి కొత్తగా రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి రాయితీని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించినప్పటి నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి శరవేగంగా దూసుకెళు తోందన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, ఐటీ రంగాల్లో లక్ష్యాల సాధనకు సీఎం కేసీఆర్ గట్టి పట్టుదలతో పనిచేస్తున్నారని, ఈ క్రమంలో సాధిస్తున్న ప్రగతి ఫలాలు తనకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయని గవర్నర్ అన్నారు.

ఇదే విధానంతో ముందడుగు వేస్తూ త్వరలోనే బంగారు తెలంగాణాను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక కొత్తగా 6,574 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచి మొత్తం 14,845 మెగావాట్లతో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయడం గర్వకారణమని తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు, ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా మొత్తం 28వేల మెటావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యాలను సాధించి మిగులు విద్యుత్ గల రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగుతోందన్నారు.

రాష్ట్రం ఏర్పడ్డాక కేవలం ఆరు నెలల్లోనే విద్యుత్ కొరతను తీర్చడమే కాకుండా ఈ ఏడాది జనవరి నుంచి వ్యవసాయ రంగానికి ఉచితంగా, పరిశ్రమలు, గృహ నినియోగానికి నిరంతరం కరెంటును అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జనాభాలో అత్యధికులు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్న రాష్ట్రంలో అన్నదాతలకు ఆత్మస్థైర్యం కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి బాటలు వేస్తూ పెద్దఎత్తున యువజనులకు ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అలాగే కుల వృత్తులు, చేతి వృత్తులను ప్రోత్సహిస్తూ కులాలకు అతీతంగా పేద కుటుంబాల్లో ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గతంలో రూ.200 ఉన్న పెన్షన్ మొత్తాన్ని రూ.1500లకు పెంచి సామాజిక భద్రతను కల్పించామన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, గీత కార్మికులకు కలిపి భారీ సంఖ్యలో 38.87 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పరిమితి ఎత్తివేసి ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టను పెంచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు రూ. 75,116ల మొత్తాన్ని ప్రభుత్వం కానుకగా అందిస్తోందన్నారు. ధనిక, పేద వర్గాలు అన్న తేడా లేకుండా ఆరోగ్య లక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తమ ప్రభుత్వం సరికొత్తగా డబుల్ బెడ్‌రూమ్ గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా వచ్చే రెండేళ్ళలో 2.65 లక్షల ఇళ్ళ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు కొంత పురోగతి సాధించామన్నారు. అతితక్కువ వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, హోంగార్డులు, ఐకేపీ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతనాలను సవరించి ఆర్థిక వెసులుబాటు కల్పించామన్నారు. అత్యధికులు వ్యవసా రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నందున 2018-19 ఆర్థిక సంవత్సరం మొదలుకుని ఈ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించామగన్నారు.

ఇప్పటికే 35 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో బకాయపడి ఉన్న మొత్తం రూ.17వేల కోట్లు చెల్లించి రుణ విముక్తుల్ని చేశామన్నారు. ఆర్థిక సమస్యల్లో ఉన్న రైతులకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం కష్టమవుతుండడంతో పెట్టుబడి రాయితీ రూ పంలో కొంత మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించామన్నారు. తెలంగాణాలో ఉన్న గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత కల్పిస్తూ సాగునీటి రంగానికి ప్రతి యేటా బడ్జెట్‌లో రూ. 25 వేల కోట్లు చేటాయిస్తున్నా మన్నారు. దేవాదుల, బీమా, కల్వకుర్తి, నెట్టెం పాడు, కోయిలసాగర్, శ్రీరాం సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులకు రూ.1.5 లక్షల కోట్ల అంచనా ప్రతి పాదనలతో అభివృద్ధి లక్ష్యాలను ఎంచుకున్నట్లు గవర్నర్ నరసింహన్ వెల్లడించారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రంలో 46వేల చెరువులను పునరుద్ధరించి జల వనరుల పరిరక్షణతో పాటు పెద్దఎత్తున ఆయకట్టు విస్తీర్ణానికి సాగునీటిని అందిస్తున్నా మన్నారు. అలాగే 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు.



ఇటీవల పూర్తిచేసిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ద్వారా రైతులకు భూ యాజమాన్య హక్కులను పటిష్టం చేశామన్నారు. ప్రతి 5వేల ఎకరాలకు ఒకరి చొప్పున రాష్ట్రంలో మొత్తం 2,638 మంది వ్యవసాయ విస్తరణాధికారులను నియమించి సాంకేతిక సాగు విధానాలను క్షేత్రస్థాయికి పరిచయం చేస్తున్నామన్నారు. మార్కెటింగ్ వ్యవస్థను విస్తృత పరుస్తూ, 4లక్షల మెట్రిక్ టన్నుల అదనపు సామర్థ్యంతో గోదాముల నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో 22.5 లక్షల మెట్రిక్ సామర్థ్యంతో గోదాములు అందుబాటులోకి వచ్చాయన్నారు. అన్ని రకాల వ్యవసాయ దిగుబడులకు కనీస మద్దతు ధరలు అమలు చేసేందుకు క్రాప్ కాలనీల ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నా మన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రధానమైన గొర్రెల పెంప కానికి రూ.5వేల కోట్లతో 75 శాతం ప్రత్యేక సబ్సిడీపై ప్రోత్సాహ కాలను అంది స్తున్నా మన్నారు. ఈ పథ కంలో భాగంగా కోటి న్నర గొర్రె లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటికే 40 లక్షల గొర్రెలను ల బ్ధిదా రులకు అందజే శా మన్నారు. మత్స్యకారుల సంక్షేమా నికి ప్రాధాన్యత ఇస్తూ ఈ ఏడాది రూ.1000 కోట్ల తో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్ర మాన్ని పూర్తి చేశామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును నెలకొల్పావ న్నారు. నాయి బ్రాహ్మణులకు హైజెనిక్ సెలూన్లు, రజకులకు వాషింగ్ మిషన్లు అందించే కార్యక్రమం రాష్ట్రంలో కొనసాగు తోం దన్నారు. కల్లుగీత కార్మికులకు రూ.5లక్షల జీవిత బీమాతో పాటు ప్రతినెలా రూ.1000 పెన్షన్‌ను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు 543 రెసిడెన్సియల్ పాఠశాలలను నెలకొ ల్పి విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ప్రజా రోగ్య పరిరక్షణ కోసం రూ.265 కోట్లతో ప్రభు త్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరు గుపరిచామన్నారు. అలాగే 102, 104, 108, అత్యవసర వైద్య సర్వీసులను మరింతగా మెరుగుపరుస్తున్నట్లు గవర్న ర్ తన సందేశంలో పేర్కొన్నారు. మాతా శిశు సంరక్షణ కోసం కేసీఆర్ కిట్ల పథకాన్ని ప్రారంభించామని, బాలింతలకు రూ.12వేల చొప్పున చెల్లిస్తున్నామని వెల్లడించారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిచాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం అమలుకు రూ.42 వేల కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో అదనంగా 3,174 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారులను విస్తరింపజేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో 230 కోట్ల మొక్కలను నాటించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 80 కోట్ల మొక్కలు నాటడం పూర్తయిందన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం 21 కొత్త జిల్లాలు, 25 రెవెన్యూ డివిజన్లు, 125 మండలాలు, ఏడు పోలీసు కమిషనరేట్లు23 పోలీసు సబ్‌డివిజన్లు, 28 సర్కిళ్ళు, 94 పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కొత్తగా 6070 పరిశ్రమలకు అనుమతులు ఇవ్వగా, 2వేల పరిశ్రమలు నెలకొల్పబడ్డాయన్నారు. దీంతో రూ.లక్షా18వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, సుమారు 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు దొరికాయని గవర్నర్ నరసింహన్ వివరించారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నందున 2016-17 వార్షిక వృద్ధిరేటు 13.9శాతంగా నమోదైందన్నారు. ఐటీ రంగంలో వృద్ధిరేటు 12శాతానికి పెరిగిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ భేషుగ్గా ఉందని జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయని, ఆ ప్రతిష్టతమ ప్రభుత్వానికే దక్కుతుందని గవర్నర్ స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలతో పాటు మానవ విలువల పరిరక్షణ, తెలంగాణ భాష, సంస్కృతి, ప్రతిష్టను విస్తరించే చర్యలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.

కాంగ్రెస్‌లో 'తేనేటి విందు' లొల్లి

- పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా విందుకు హాజరైన దానం, రాపోలు
- పార్టీ నిర్ణయం తెలియదన్న నేతలు
- పార్టీ మారేందుకే దానం రాజ్‌భవన్ వెళ్ళారంటున్న సీనియర్లు
- రాజ్యసభ రెన్యూవల్ కోసమే విందుకు రాపోలు వెళ్ళివుండవచ్చని మండిపాటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఏర్పాటు చేసిన తేనేటి విందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇరువురు సీనియర్ నేతలు దానం నాగేందర్ రాపోలు ఆనంద్‌భాస్కర్ హాజరవ్వడంపట్ల ఆ పార్టీలో కలకలం రేగింది. ఈ విందును బహిష్కరించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవ తీర్మానం చేసినా ఈ నేతలు అందుకు విరుద్ధంగా విందుకు వెళ్ళడంపట్ల కాంగ్రెస్‌లో దుమారం రేగింది. ఈ ఇద్దరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పార్టీలో ఓ వర్గం డిమాండ్ చేస్తుండగా, మరో వర్గం మాత్రం దానం పార్టీని మారాలన్న క్రమంలోనే భాగంగానే ఈ విందుకు వెళ్ళారని ఆరోపిస్తోంది. జిల్లా పర్యటనలో ఉన్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి తిరిగి వచ్చాక ఈ ఇద్దరు నేతల నుంచి సంజాయిషీ కోరే అవకాశాలు ఉన్నాయని పార్టీలో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఇటీవల రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా గవర్నర్ వ్యవహరించిన తీరుతో భీతిల్లిపోయిన కాంగ్రెస్ నాయకులు నేరుగా గవర్నర్ నుద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తనను కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలతో మాట్లాడిన గవర్నర్ కేసీఆర్ ప్రభుత్వానికి సహకరించాలని సూచిం చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ మల్లురవిలను ఉద్దేశించి గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై అప్పట్లో తీవ్రస్థాయిలో చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ గవర్నర్ తీరు మారినపుడే తిరిగి రాజ్‌భవన్ మెట్లు తొక్కుతామని అప్పటిదాకా వచ్చే ప్రసక్తే లేదని నేతలు ప్రతిన బూనారు. రెండు రోజుల క్రితం పార్టీకి చెందిన కొందరు సీనియర్లు సమావేశమై గణతంత్ర దినోత్సవాన గవర్నర్ ఇచ్చే విందుకు వెళ్ళరాదని నిర్ణయించారు. శుక్రవారం ఉదయం గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో కూడా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే హఠాత్తుగా ఇరువురు నేతలు గవర్నర్ ఇచ్చిన విందుకు వెళ్ళడంపై కాంగ్రెస్‌లో అగ్గి రాజేసినట్లయింది. నిష్పక్షపాతంగా గవర్నర్ వ్యవహ రిం చడం లేదని ప్రభుత్వానికి దన్నుగా ఉంటున్నారని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో నేతలు ఆరోపించారు. గవర్నర్ తీరు మారితేనే రాజ్‌భవన్‌కు వెళ్ళాలని అప్పటిదాకా ఏ సమస్య వచ్చినా పోరాడి పరిష్కరించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు.





అయితే పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద్‌భాస్కర్, మాజీమంత్రి దానం నాగేందర్ హాజరజయ్యారు. పార్టీ నిర్ణయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ఇరువురు సీనియర్ నేతలు విందుకు వెళ్ళడంపట్ల పార్టీ సీనియర్లు గుర్రుమంటున్నారు. దానం నాగేందర్ పార్టీని వీడుతారని ఇప్పటికే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో విందుకు హాజరు కావడం మరింత బలాన్ని చేకూర్చే విధంగా ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. పార్టీని వీడనని వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నానని దానం పదేపదే చెబుతున్నా పార్టీలో నేతలు మాత్రం ఆ విషయాన్ని ఏమాత్రం విశ్వసించడం లేదని గతంలోనే ఆయన తెరాసకు చెందిన కొందరు నేతలతో పార్టీ మారే అంశానికి సంబంధించి సంప్రదింపులు జరిపారన్న ఆరోపణలు ఉన్నాయని పార్టీ నేతలు గుర్తుచేస్తున్నారు. పీసీసీ తీసుకున్న నిర్ణయం తనకు తెలియదని ఈ విష యం తెలిసి ఉంటే ఇక్కడికి వచ్చి ఉండేవాడిని కాదని దానం వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. రాపోలు ఆనంద్‌భాస్కర్ సైతం ఇటువంటి సమాధానాన్నే ఇచ్చారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో తేనేటి విందుకు పార్టీ దూరంగా ఉండాలన్న నిర్ణయం తీసుకున్న విషయం తనకు అసలు తెలియదని ఆయన పేర్కొన్నారు. అందుకే రాజ్‌భవన్‌కు వచ్చానని ఆయన మీడియాకు చెప్పారు. పార్టీ తీసుకున్న నిర్ణ యం ఉదయం నుంచి సామాజిక మాధ్యమాలు, ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృతంగా ప్రసారమవుతున్నా ఈ ఇరువురు సీనియర్లు తేనేటి విందుకు ఉద్దేశపూర్వకంగానే హాజర య్యారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా వ్యవహరించిన ఈ ఇద్దరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అవసరమైతే షోకాజ్ నోటీసులు జారీచేసి రాజ్‌భవన్‌కు ఎందుకు వెళ్ళవలసి వచ్చిందో లిఖితపూర్వక సమాధానం కోరాలని కొందరు పార్టీ నేతలు పీసీసీపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మరో రెండు మాసాల్లో రాజ్యసభ సభ్యత్వం ముగుస్తున్నందునే తదుపరి ప్రయత్నాలను ముమ్మరం చేసుకునేందుకు ఆనంద్‌భాస్కర్ రాజ్‌భవన్‌కు వెళ్ళారని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 27 జనవరి 2018

విభేదంలోనూ విజ్ఞత!

రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి పదవిని చేపట్టిన తర్వాత దేశ ప్రజలనుద్దేశించి తొలి గణతంత్ర దినోత్సవ సందేశంలో దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిలో పౌరుల బాధ్యతను గుర్తు చేశారు. ప్రజాస్వామిక వ్యవస్థలో అభిప్రాయ భేదాలు సహజం, వాటిని వ్యక్తం చేయడం రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కు. దానిని కాపాడుకునేందుకు ఇతరులను అవహేళన చేయడం, అవమానించడం ఎంత మాత్రం తగదని ప్రజలను హెచ్చరించి దేశ ప్రథమ పౌరునిగా ఆయన తన బాధ్యతను నిర్వర్తించారు. విభేదించినా విజ్ఞత మరువరాదన్నదే ఆయన సందేశం. గడిచిన మూడు సంవత్సరాల్లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా దేశంలో అసహన ధోరణుల గురించి ప్రస్తావించి, ప్రజాస్వామ్యంలో నిరసనకు చోటుండాలని ఉద్బోధించారు. అప్పట్లో దళితులపై గోరక్షకుల దాడులను దృష్టిలో ఉంచుకుని ఆయన ఆ ఉద్బోధ చేశారు. ప్రస్తుత రాష్ట్రపతి కూడా అసహన ధోరణుల గురించే ప్రస్తావించారు. పౌరుల మధ్య అభిప్రాయ భేదాలు సహజమైనా అవి హింసాత్మకంగా పరిణమించకూడదన్నదే కోవింద్ సందేశం. భిన్నత్వంలో ఏకత్వం ఉండాలన్నదే ఇద్దరి సందేశాల సారం. దశాబ్దాలుగా ఇదే సిద్ధాంతం ఇరుసుపై మనుగడ సాగిస్తున్న మన సమాజంలో ఇప్పుడు ఈ అసహన ధోరణులు తలెత్తడానికి కారణాలేమిటో ప్రజలకు తెలియంది కాదు. గణ తంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి హోదాలో ఉన్న వారు ఈ అంశాన్నే ప్రస్తావించడానికి కారణం ఆనవాయితీ అనుకోరాదు. గణతంత్ర దినం ప్రధానోద్దేశ్యాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇరవై తొమ్మిది రాష్ట్రా లను ఏకం చేస్తున్నది మన ఫెడరల్ వ్యవస్థ. దానిని కాపాడుకోవడానికి బద్ధులమై ఉన్నామని ప్రజల చేత ప్రమాణం చేయించేందుకే గణ తంత్ర దినాన్ని జరుపుకుంటున్నాం. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందనీ, వ్యక్తుల కన్నా వ్యవస్థ గొప్పదనీ, వ్యవస్థలను కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అన్న ఆయన సందేశం దేశంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలను గుర్తు చేస్తున్నది. చారిత్రకాంశాలపై విభేదాలనేవి ఈనాడు కొత్తగా పుట్టినవి కావు. వాటిని అడ్డుపెట్టుకుని దేశంలో కొన్ని శక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుంటే, ప్రభుత్వాలు మిన్నకుండటంఎంత మాత్రం తగదన్న హెచ్చరిక ఆయన సందేశంలో నిబిడీకృతమై ఉంది. పద్మావత్ హిందీ చిత్రంపై రగులుతున్న వివాదాన్ని దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ హెచ్చరిక చేశారు.పద్మావత్ చిత్ర నిర్మాత, కథానాయిక పాత్ర పోషించిన నటి తలలకు వెల గట్టి క్షత్రియ (కర్ణి) సేన పేరిట వెలువడుతున్న ప్రకటనలు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే రీతిలో ఉన్నాయి. తలలు కోసి తెస్తే లక్షలు,కోట్లు ఇస్తామంటూ ప్రకటనలు అనాగరికంగా ఉన్నాయి. ఈ చిత్రంపై ఆందోళనలూ,హింసాత్మక సంఘటనలూ ఎక్కువగా బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్,రాజస్థాన్,గుజరాత్ లలోనే చోటు చేసుకుంటున్నాయి. ఈ చిత్రం విడుదలపై అత్యున్నత స్థాయిలో జరిగిన న్యాయపోరాటానికి పరాకాష్టగా, ఈ చిత్రం విడుదలకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈ చిత్రంపై ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్రా లను ఆదేశించింది.అయినా,ఈ మూడు రాష్ట్రా ల్లో ప్రభుత్వాలు విఫలమయ్యాయి.దీనిపై కూడా సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగాధినేత అయిన రాష్ట్రపతి ఈ హెచ్చరిక చేశారు. ఈ మూడు రాష్ట్రా ల్లో ప్రభుత్వాలు విఫలం కావడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించాలి. కానీ, అటువంటి దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు.ప్రధానమంత్రి నరేంద్రమోడీ దావోస్ ఆర్థిక సంస్థలో భారత్‌కు పెట్టుబడులతో వస్తే ఎర్రతివాచీ పరుస్తామంటూ విదేశీ సంస్థలకు పిలుపు ఇచ్చిన తరుణంలోనే స్వదేశంలో హింస చెలరేగడం ఆయనకూ ఇబ్బంది కరమే. ఈ ఘటనలు పారిశ్రామిక సంస్థలకు నెలవు అయిన గూర్‌గావ్, అహ్మదాబాద్, తదితర నగరాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగే నగరాలు,ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలే కాదు, స్వదేశీ సంస్థలూ ముందుకు రావు. కనుక కనీసం ఈ కోణం నుంచైనా ఈ మూడు రాష్ట్రాల్లో పరిస్థితులు చక్కబడేట్టు చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. రాష్ట్రపతి ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించిన మరో అంశం బడుగుల హుందాతనాన్ని కాపాడాలన్నది. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ దళితులపై జరుగుతున్న దాడులు, దళితులకు జరుగుతున్న అవమానాలను దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ కూడా పలు సందర్భాల్లో తీవ్రమైన హెచ్చరికలు చేసినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రాష్ట్రపతి కూడా ప్రస్తావించారు.ఈ ఘటనలన్నీ బీజేపీ పాలిత ప్రాంతాల్లోనే ఎక్కువగా చోటు చేసుకోవడం గమనార్హం. ఇక మూడో అంశం పౌష్ఠికాహారానికి సంబంధించింది. పౌష్ఠికాహార కార్యక్రమాలను కేంద్రం,రాష్ట్రాలూ పెద్ద ఎత్తున అమలు జేస్తున్నా, బడికి దూరమవుతున్న బడుగువర్గాల పిల్లల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.మధ్యాహ్న భోజన పథకం అనేది ఒక ప్రహసనంగా తయారైంది. ఈ కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేట్టు చూడటానికి ప్రభుత్వం రకరకాల ఆలోచనలు చేస్తోంది.అందులోంచి పుట్టుకొచ్చిందే ఆధార్‌ని అనుసంధానం చేయాలన్న ప్రతిపాదన.అయినప్పటికీ మధ్యాహ్న భోజన పథకం నిధులను దళారులే ఆరగిస్తున్నారు.స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలు దాటినా, దారిద్ర్య రేఖకుదిగువన ఉన్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతోందే తప్ప తరగడం లేదు. తీవ్రవాదం, ఉగ్రవాదం దేశంలో శాంతి భద్రతలను సవాల్ చేస్తున్నట్టే, పేదరికం, ఆకలి ఆర్థికాభివృద్ధిని సవాల్ చేస్తున్నాయి.అభివృద్ధి ఫలాలు అందరికీ అందేట్టు చూడాలనీ, భిన్నాభిప్రాయాలకు చోటుండాలనీ, పరస్పరం గౌరవించుకోవాలన్నదే రాష్ట్రపతి సందేశం సారాంశం.

మంచి మాట



ఒక పురుషుడు తనకు చేసిన హానిని స్త్రీ మర్చిపోగలదు. కానీ, తన పేరు చెప్పి అతను చేసే త్యాగాల్ని మాత్రం మర్చిపోలేదు.

• సోమర్సెట్ మామ్

కేరళ మోజుతో మరో తప్పిదం



'శంక'రాజీయం

-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు


వచ్చే సాధారణ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయడంలో తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఈ ఏప్రిల్‌లో కీలకమైన పాత్ర పోషించనుంది. కాంగ్రెస్ పార్టీతో పొత్తు అంశమై ఏర్పడిన రెండు భిన్నాభిప్రాయాలలో ఒకదానిని ఆమోదించేందుకు సిపిఎం సభలు కసరత్తు చేస్తాయి. కోల్‌కతాలో నిర్వహించిన సిపిఎమ్ సెంట్రల్ కమిటీ సమావేశంలో డ్రాఫ్ట్ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించి నందున హైదరాబాద్ సమావేశంలో దీనిపై ఓటింగ్ అనివార్యంగా మారింది. కాంగ్రెస్‌తో ఎటువంటి ఎన్నికల పొత్తుకూ సిద్ధంగా లేమని కోల్‌కతా సమావేశం స్పష్టంచేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తును కోరుకుంటున్నారు. బీజేపీని ఎదుర్కోవాలంటే పొత్తు అనివార్యమనేది ఆయన అభిప్రాయం. ప్రకాశ్ కారత్ నాయకత్వంలోని వర్గం దీనిని నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. రెండు తీర్మానాలను ప్రవేశపెట్టినప్పుడే పొలిట్‌బ్యూరోలో విభేదాలు బయటపడ్డాయి. ఏచూరీ, కారత్‌లు చెరో తీర్మానాన్నీ ప్రవేశపెట్టారు. ఈ అంశంలో ఏకాభిప్రాయం లేకపోవడంతో తీర్మానాలను సెంట్రల్ కమిటీకి సమర్పించారు. ఆదివారం ఈ రెండు రాజకీయ తీర్మానాలపైనా ఓటింగు నిర్వహించారు. ఊహాతీతంగా సెంట్రల్ కమిటీ ఏచూరి తీర్మానాన్ని తోసిపుచ్చింది. పొలిట్‌బ్యూరోలో ఏచూరికి ఇది మొదటి పరాజయం కాదు రెండోది. 1975లో పుచ్చలపల్లి సుందరయ్య శైలిని ఉదాహరణగా తీసుకుని ఏచూరి తన పదవికి రాజీనామా చేసి ఉండాల్సింది. ఆనాటి తన రాజీనామా లేఖలో సుందరయ్య ఇలా రాశారు. పొలిట్‌బ్యూరోలోని ప్రధాన విభాగాలపై ఆధిపత్యం చెలాయించి, విశ్వాసాన్నీ, బాధ్యతను మోయగల నేత మాత్రమే నాకు ప్రత్యామ్నాయం. అత్యవసర పరిస్థితిపై పోరాడడానికి ఫాసిస్టు భావాలు గల జనసంఘ్‌తో చేతులు కలపాలని అప్పటి పొలిట్‌బ్యూరో తీసుకున్న నిర్ణయానికి నిరసనగా సుందరయ్య రాజీనామా ఇచ్చారు.

మద్దతు కూడగట్టుకోలేకపోవడమనే కారణమే ఇప్పుడు ఏచూరీకీ వర్తిస్తుంది. ఇక్కడ ఏచూరి రాజీనామా చేస్తానని ముందుకొచ్చారు. సుందరయ్య మాత్రం పదవిని పట్టుకుని వేలాడాలని భావించలేదు. ఇద్దరికీ మధ్య తేడా అది. జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించాలన్న తపన ఏచూరిలో ఉంది. అందుకే సెంట్రల్ కమిటీ, పొలిట్‌బ్యూరోల అభిప్రాయానికి తలొగ్గారు. ఎర్రదళం ఇంతవరకూ అనుసరిస్తూ వస్తున్న వైఖరికి ప్రస్తుత విధానం పూర్తిగా వ్యతిరేకం.

ఆనాడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటానికి సిపిఎం ఫాసిస్ట్ పార్టీతో చేతులు కలిపింది. అది పార్టీ నాయకత్వంపై ధిక్కారానికి 1975లో దారితీసింది. దురదృష్టవశాత్తూ ప్రస్తుతం ఫాసిస్ట్ పార్టీలకు వ్యతిరేకంగా ఇతర పార్టీలతో చేతులు కలుపుతోంది. కరత్, ఏచూరి మధ్య విభేదాలే ప్రస్తుత సంక్షోభానికి కారణం. 1975లో సుందరయ్య, రణదివెల మధ్య విభేదాలు తలెత్తాయి. బిటిఆర్, పొలిట్‌బ్యూరో సభ్యులు నాకు మధ్య అనేక అంశాలలో తీవ్రమైన ఘర్షణ నెలకొంది.

పరిస్థితిని చల్లబరిచేందుకు అవకాశాలు కానరాలేదు. ఇలాంటి స్థితిలో పార్టీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం కంటే నేను రాజీనామా చేయడమే మేలని నిర్ణయించుకున్నానంటూ ఆనాడు సుందరయ్య తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సుందరయ్య...ఏచూరీ ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారే. ఈ రాష్ట్రంలో పార్టీకి కనీస బలం లేదు. కేరళ, బెంగాల్ రాష్ట్రాలతో పోలిస్తే ఇది లెక్కలోకే రాదు. పార్టీపై తనకు ఆధిపత్యం లేకపోవడానికి కారణమిదేనని సుందరయ్య గ్రహించారు. ఇదే ఏచూరికి వర్తిస్తుంది.

ఏచూరి 2015లో పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను స్వీకరించారు. పొలిట్‌బ్యూరో లేదా సెంట్రల్ కమిటీలపై ఆధిపత్యం తెచ్చుకోవడంలో విఫలమయ్యారు. ఫలితంగా గడిచిన మూడేళ్ళుగా ఏచూరి అనేక అంశాలలో ఓటమిని చవిచూశారు.







1975లో పుచ్చలపల్లి సుందరయ్య శైలిని ఉదాహరణగా తీసుకుని ఏచూరి తన పదవికి రాజీనామా చేసి ఉండాల్సింది. ఆనాటి తన రాజీనామా లేఖలో సుందరయ్య ఇలా రాశారు. పొలిట్‌బ్యూరోలోని ప్రధాన విభాగాలపై ఆధిపత్యం చెలాయించి, విశ్వాసాన్నీ, బాధ్యతను మోయగల నేత మాత్రమే నాకు ప్రత్యామ్నాయం. అత్యవసర పరిస్థితిపై పోరాడడానికి ఫాసిస్టు భావాలు గల జనసంఘ్‌తో చేతులు కలపాలని అప్పటి పొలిట్‌బ్యూరో తీసుకున్న నిర్ణయానికి నిరసనగా సుందరయ్య రాజీనామా ఇచ్చారు. మద్దతు కూడగట్టుకోలేకపోవడమనే కారణమే ఇప్పుడు ఏచూరీకీ వర్తిస్తుంది. ఇక్కడ ఏచూరి రాజీనామా చేస్తానని ముందుకొచ్చారు.

అప్పట్లో సుందరయ్య రాజీనామా లేఖను పార్టీ నాయకత్వం రహస్యంగా ఉంచింది. సుందరయ్య మరణానంతరం మాత్రమే రాజీనామా లేఖ ప్రతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయన స్నేహితులు కొందరు బహిర్గతం చేశారు. సీతారం ఏచూరి మాత్రం కాంగ్రెస్‌తో పొత్తు అంశాన్ని సిపిఎమ్ కాంగ్రెస్ దృష్టికి తీసుకెళ్ళాలని దృఢంగా నిశ్చయించుకున్నారు. మార్చి 3న త్రిపుర రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆ రాష్ట్రంలో బీజేపీ గెలిచినా చెప్పుకోదగ్గ ఓట్లు సాధించినా ఏచూరి వాదన నిజమని తేలుతుంది. కాంగ్రెస్‌తో ఎన్నికల ఒప్పందం తప్పదని తేలుతుంది. ఏచూరి వాదనను తిరస్కరించడంలో సీపీఎం పార్టీ మరో ఘోర తప్పిదాన్ని చేస్తున్నట్లు అనిపిస్తోంది. బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఆధిపత్యాన్ని నిరోధించడా నికి పార్టీ తీసుకున్న వైఖరి తప్పని తేలుతుంది. పార్టీ కాంగ్రెస్‌లో కూడా ఏచూరి తీర్మానాన్ని కొట్టేస్తే అది మరొక పెద్ద తప్పిదమే అవుతుంది. 1997లో జ్యోతిబసుకు ప్రధాన మంత్రి పదవిని నిరాకరించడం పార్టీ చేసిన మొదటి తప్పు.

పార్టీ అత్యున్నత నిర్ణాయక సంస్థ పొలిట్‌బ్యూరోలో ఆధిపత్య పోరుకు ఇది పరాకాష్టగా మిగిలిపోతుంది. వ్యక్తిగత తగాదాలు పెచ్చుపెరుగుతున్నాయని ప్రస్తుత పరిణామాలు సూచిస్తున్నాయి. ప్రకాశ్ కరత్, సీతారం ఏచూరి మధ్య అహానికి సంబంధించిన పోరు సాగుతోందనడానికి ఇదే రుజువు. సిద్ధాంతానికి కట్టుబడి ఉండడం, తాననుకున్నదే నెరవేరాలనుకోవడం, పరస్పరం బలాలను తేల్చుకోవాలనుకునే వైఖరులకు కేరళ, బెంగాల్ విభాగాలు కట్టుబడిపోవడందీనికి కారణం. మరోవంక కేరళలో సిపిఎమ్ క్యాడర్ సమైక్యంగా ఉంది. బెంగాల్‌లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. అక్కడి పార్టీ నాయకులు అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. టిఎమ్సీ బెంగాల్‌లో తన పునాదులను పటిష్ట పరుచుకోవాలనే కృతనిశ్చయంతో ఉంది. ఎంతగా అంటే ఆఖరుకు కాంగ్రెస్ పార్టీతో కూడా చేతులు కలపడానికి సిద్ధమవుతోంది. కేరళలో మాదిరిగా బెంగాల్‌లో కాంగ్రెస్, సీపీఎం పార్టీలు శత్రువులు కాదు. కరత్ మద్దతు ఉన్న తీర్మానం కూడా పార్టీ గురుతర బాధ్యతలను విస్మరించడమే. ఏచూరి తీసుకున్న వైఖరిఎంతో పారదర్శకంగా, ఆచరణాత్మకంగా ఉంది. బీజేపీ నేతృత్వంలోని మతతత్వ శక్తులు విసురుతున్న సవాళ్ళ నేపథ్యంలో ఇది అనివార్యం. సిపిఎం కేరళ శాఖ అంతా కరత్ వెనుక ఉందన్న అభిప్రాయం కూడా తప్పే. అన్ని స్థాయిల్లోనూ నిరసన గళాలు వినిపించాయి. వాటిని ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ నేతృత్వంలోని పార్టీ నాయకత్వం అణచివేసింది. పార్టీ కేరళ శాఖ విజయన్ ఉక్కు పిడికిలిలో ఉంది. కేంద్ర కమిటీలో మాదిరిగా చర్చకు అనుమతి,అవకాశం లేదు ఇక్కడ. ఓటింగ్ అనే ప్రశ్నే లేదు.

మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మాత్రం నిరసన తెలియజేశారు. విజయన్‌ని వ్యతిరేకించినా ఆయనకు పోయేది ఏమీ లేదు. కేరళ ఆర్థిక మంత్రి టిఎం థామస్ కూడా ఓటింగ్‌కి గైర్హాజరై సూచన ప్రాయంగా తన నిరసన తెలిపారు. అవిధేయతకు ఆయన ఎలాంటి మూల్యం చెల్లించుకుంటారో వేచి చూడాలి.

కరత్‌ను విజయన్ అంతగా ఎందుకు సమర్థిస్తున్నారో కారణం తెలియదు. కరత్‌కు ఆయన రుణపడి ఉన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు కరత్ విజయన్‌ని ఆదుకున్నారు. విజయన్ ఎస్ఎన్‌సి-లావిలిన్ విద్యుత్ ప్రాజెక్టు కుంభకోణంలో చిక్కుకున్నప్పుడు ఆయనకు కరత్ అండగా నిలిచారు. రుణం తీర్చుకునే అవకాశం వచ్చినప్పుడు తన నాయకుడి వాదన కేంద్ర కమిటీసమావేశాల్లో నెగ్గేందుకే కాకుండా, హైదరాబాద్ మహాసభల్లో ఓటింగ్ జరిగితే అదే తరహాలో మద్దతు ఇవ్వడానికి రంగాన్ని సిద్ధం చేశారు.

మార్క్సిస్టు పార్టీలో ప్రస్తుత సంక్షోభం కేరళ విభాగానికే పరిమితం. పార్టీ కేరళ శాఖ పూర్తిగా విజయన్ చేతుల్లోఉంది. పార్టీ జాతీయ స్థాయిలో ఆయన తన ప్రభావం చూపుతున్నారు. ఉన్నదున్నట్టు చెప్పుకోవాలంటే, 2019 ఎన్నికల్లో లౌకిక పార్టీలన్నీ సమైక్యమైతే తప్ప బీజేపీని ఓడించడం సాధ్యం కాదు. మార్క్సిస్టు పార్టీ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉండాల్సింది. రాజకీయంగా అనువైన పంథాను తీసుకోవల్సింది. కరత్ నేతృత్వంలోని వర్గం స్థానికంగా బలంగా ఉన్న పార్టీలతో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్‌ని ఓడించాలని కోరుతోంది. అంత కఠిన వైఖరి వల్ల సత్ఫలితం ఉండదు. మార్క్సిస్టు పార్టీ తనంతట తానే పటిష్ఠం అవ్వాలి. మార్క్సిస్టు పార్టీ జాతీయ స్థాయిలో ఒంటరిగా వెళ్ళలేదు. స్థానికంగా తాను బలపడుతూ, స్థానిక పార్టీలు బలబడేందుకు దోహదం చేయాలి. సిపిఎంకు జాతీయ స్థాయిలో ఎటువంటి పునాది లేదు. ప్రబలమైన కేరళ వర్గం ప్రయోజనం కోసం కరత్ కఠిన వైఖరి తీసుకు నేట్టు ఆయనకు అండగా నిలిచింది. ఈ క్రమంలో ఆ పార్టీ జాతీయ ప్రయోజనం బాగా దెబ్బతింది. పార్టీ కేరళ శాఖ స్వీయ ప్రయోజనం కోసం ఇదంతా చేసినప్పటికీ, కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా పొత్తులు కుదుర్చుకుంటే, బాగా దెబ్బతింటుంది. మైనారిటీలు సిపిఎంకు దూరమవుతారు.

సిపిఎం కేంద్ర కమిటీ నిర్ణయంపై మొట్టమొదట కేరళలోని మాలంకర ఆర్థోడోక్స్ చర్చికి చెందిన బిషప్ జీవర్ఘీస్ మోర్కోలిస్ స్పందించారు. సిపిఎం కేంద్ర కమిటీ తీర్మానం చేయగానే, బిషప్ ఫేస్‌బుక్‌లో తన స్పందనను పోస్టు చేశారు. సిపిఎం ఏ యుగంలో ఉంటోందని ప్రశ్నించారు. ఈ నిర్ణయం వల్ల మతతత్వ శక్తులకు పెద్దఊరట కలుగుతుంది. అదే సందర్భంలో లౌకిక శక్తులు నిరుత్సాహానికి గురవుతాయి. లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాన్ని ఈ నిర్ణయం బలహీనపరుస్తుంది. కేరళలో మైనారిటీ వర్గాల అభిప్రాయాలనే బిషప్ వెల్లడించారు. 2019 లోక్ సభ ఎన్నికల్లో మైనారిటీ వర్గాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. కేరళలో తమ పార్టీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్సేనన్నది సిపిఎం రాష్ట్ర శాఖ వాదన. ఆ పార్టీతో ఎటువంటి పొత్తుపెట్టుకున్నా, 2020లో వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. 2016 ఎన్నికల్లో రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో సిపిఎం నెగ్గడానికి మైనారిటీల ఓట్లే కీలకమయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ఐక్య ప్రజాసంఘటన (యూడీఎఫ్)కా, ప్రధాని నరేంద్రమోడీకి ఎదురు నిలిచి పోరాడగల సత్తా తమ కూటమికే ఉందనీ, పినరయ్ విజయన్‌కి లేదని రుజువు చేసుకుంటే, ఆ పార్టీ పరిస్థితి ప్రమాదంలో పడుతుంది. ఈ మూడు జిల్లాల్లో బీజేపీ పన్నెండు స్థానాలపై కన్నేసింది. ముక్కోణపు పోటీలో యూడీఎఫ్‌కే ఎక్కువ లాభం. ఈ నేపథ్యంలో కేరళ ప్రయోజనాలను కాపాడుకోవాలా? లేక జాతీయ స్థాయి నిర్ణయం తీసుకోవాలా అనేది సిపిఎం కేంద్ర నాయకత్వం తేల్చుకోవాలి. అలా తేల్చుకోవడానికి పార్టీలో ఏచూరికి బలమూ లేదు, ఆయన గళమూ చాలదు.

తెలుగు రుచులు



సుత్తి మెత్తంగా...

కర్లపాలెం హనుమంతరావు
8142283676

అన్నం పరబ్రహ్మ స్వరూపమైనప్పుడు ఆ అన్నకర్త సాక్షాత్తు విష్ణావతారమే అవాలి గదా! భగవద్గీత పురుషోత్తమప్రాప్తి యోగంలో(15-14)సైతం ఆహార వ్యవహారాల్లో భగవంతుడి ప్రమేయం (అహం వైశ్వానరో భూత్వా..) తప్పదన్నట్లు ధ్రువపడుతుంది. అర్జునుడు యుద్ధ రంగం మధ్య విషాదయోగంలో పడి కొట్టు మిట్టాడే వేళా కర్తవ్యబోధ చేసేందుకు ఉద్యుక్తుడైన భగవంతుడు తిండిగోల మర్చిపోలేదు! వాల్మీకులవారి రామాయణంలో కూడా రావణాసురుడు అంతలావు క్రోధంలో సైతం 'ఇచ్చిన గడువులోగా శయ్యాస్వీకారం చెయ్యకపోతే వంటవాళ్లచేత వండించుకొని తింటాన'ని సీతమ్మ వారిని బెదిరించాడు! భోజనానికి ముందో శ్లోకం (బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః).. భోజనాల మధ్యలో శ్లోకం (త్వదీయం వస్తు గోవింద).. భోజనానంతరం శ్లోకం(అగస్త్యం వైనతేయం) మన ముందు తరాలకి! భజనతో సమానమైన భోజన వ్యవహారం ఓ భోగకళగా మారింది మన హయాంలో!

భూగోళంలో ఒక్క పాలు నేల. మనం భూచరాలుగానే బతుకుతున్నా తిండికోసం నీళ్లఅడుగునా, ఆకాశంలో కూడా దేవులాడటం మన తిండియావకు నిదర్శనం.


ఆకలి లేకుంటే జీవికి ఆరాటమే లేదు. ఆ మాటా నిజమేననుకోండి! ఆరాటం ఉండి.. అది తీరేందుకు చేసే పోరాటమే జీవితం. అందులోనే ఉంది జీవితసారమంతా!

'సమాజ స్వభావం సమ్యగ్దర్శనభాగ్యానికి నోచుకోవాలంటే, ఆచార వ్యవహారాదులతోపాటు ఆహారపద్ధతులూ తెలిసి ఉండాలి!' అని మల్లంపల్లివారు అభిప్రాయపడ్డారు! ఆ సామాజిక బాధ్యత గుర్తెరిగారు కాబట్టే మన ప్రాచీనకవులు సందర్భశుద్ధి ఉన్నా, లేకున్నా సందుచూసుకుని మరీ పసందైన విందు భోజనాలు రకరకాలుగా అందించారు. మన కడుపులు నింపారు.

ఆత్మకు ఇంపైన భోజనం సత్కృతులకందే ప్రేరణగా అల్లసాని పెద్దన భావించాడు. ముంగండ అగ్రహారీకుడు పండితరాయలు తెలుగువిస్తరి ఘుమఘుమల్ని ఢిల్లీదాకా విస్తరింపచేసాడు. ఆవరేవ (ఆవకాయ) నుంచి.. ఇంగువ హంగుల దాకా దేన్నీ ఓ పట్టు పట్టిందాకా వదిలిపెట్టని తిండిరంధి వేములవాడ భీమన్నకవిది. బమ్మెరవారి భాగవతంలోని 'బూర్ణోత్సాహముతో ధృతాన్న కబళోత్ఫుల్లాబ్జ హస్తంబుతో' పద్యం గోపబాలకులు లోకపాలకుడుతో భోజనోత్సవ పూర్ణోత్సాహాన్ని కళ్లకుకట్టించే కమ్మని నేతిబూరె! భోజనాది లౌకికాలను కూడా మన కవులు ఎంత అలౌకికంగా ఆరాధించారో!

వెల్లుల్లి, తిలపిష్టం అనడమే దోషంగా భావించే శుద్ధశాకాహారి కదా శ్రీనాథుడు! అయినా తిరువెంగనాచనే శివభక్తురాలు సిరియాలును తరిగి నానావిధ పాకాలుగా వండటం వైనవైనా లుగా వర్ణించాడు మహానుభావుడు! మిరియాలపొడి చల్లినవి, సైంధవలవణం కలిపి చేసినవి, ఆవపెట్టి వండినవి, ఇంగువతో ఘుమఘుమలాడేవి, చింతపండు.. నిమ్మరసం పిసికి చేసినవి, తాజానేతిలో ముంచి తేల్చినవి, లేతకొత్తిమీర మిళాయింపులతో పరిమళించేవి, కూరగా వండినా సౌష్ఠవం ఏ మాత్రం చెడనివి.. శివాలయంలో దొంగలా దూరి దాక్కున్న దుండగీడు గుణనిధి కంటబడ్డ భక్ష్యాలు, భోజ్యాలు, లేహ్యాలు, పానీయాలు ఇవన్నీ! ''కాశీఖండం'లోని ఈ చిన్ని జాబితా సైతం తిండిపుష్టి దిట్టంగాగల శ్రీనాథ కవిసార్వభౌముడి పాకశాల నుంచి తయారైన అనుపాకాలే!

'ఏ దేశమేగినా ఎందుకాలిడినా.. నిలపరా నీ జాతి



నిండు గౌరవము' అన్నాడు కదా మన మహాకవి గురజాడ కూడా! ఏ జాతికైనా దాని తిండి తిప్పల్ని మించిన నిండు గౌరవం మరేముంటుందిగనక! తెలుగువాడి ఆత్మగౌరవమైతే మరీ ముఖ్యంగా ఏ ఆవకాయ బద్దతోనో.. గోంగూర తొక్కుతోనో ముడి పడి ఉంటుంది. వేటూరివారికి మాగాయపూరుని 'మహత్తరి' అని పొగిడితేగానీ తనివి తీరలేదు మరి! జిహ్వాచాపల్యరంగంలో తెలుగునోటికి పోటీకొచ్చే జాతి భూమ్మీద ఎందెందు గాలించినా మీకు దొరకదు గాక దొరకదు సుమండీ! ఓ మహాపండితుడు హిమాలయాలను చూసి తన్మయత్వంతో 'అన్నపు రాశుల్లా' ఉన్నాయని నోరెళ్ళ పెట్టేసాడు. బహుశా అతగాడు మన తెలుగువాడే అయివుండనోపు!

కారంతో కారం కలిపి కొత్తరుచి సృష్టించగలడు. తెలుగువాడు. పులుపులో పులుపు కలిపి పులకరింతలు పుట్టించనూ గలడు. ఆరు రుచులతో ఆరొందల అరవైఆరు రుచులు సృష్టించి 'ఆహా! ఏమి రుచి?' అనిపించి నోరూరించగల మొనగాడు ఇంకెవడు? మన తెలుగువాడే!

'ఆంధ్ర' లోని అంధ పదం 'అన్నా'నికి పర్యాయ పదంట! (ఆప్టే సంస్కృత నిఘంటువు - పు129). జైన, బౌద్ధ సాహిత్యాలలో తెలుగువాళ్ళు అంధ శబ్దంతోనే వ్యవహృతులు. నైలునుండి కృష్ణ దాకా సాగిన ద్రావిడుల మహావ్యాప్తికి 'పెసలు' పద వ్యుత్పత్తి సాక్ష్యం పలుకుతోంది ద్రవిడియన్ ఎటిమలాజికల్ నిఘంటువు చెపుతోంది.

చైనా లాంటి తూర్పు దేశాలతో భారతీయ బౌద్ధులు సంబంధాలు పంచదారతో మరింత మధురమయ్యాయని చరిత్రకారుల పరిశీలన. చెరకు తోటల నీడల్లో చేరి వరిచేలకు పహారా కాస్తూ ఆంధ్రమహిళలు రఘుమహారాజు జీవితగాథని పాడుకున్నారు.. ఎక్కడో పక్కమహారాష్ట్రంలో ఉన్న కాళిదాసు రాసిన 'రఘువంశం'లో కూడా! తెలుగులు ఎక్కడ ఉంటే ఘుమఘుమలు అక్కడ ఉంటాయి కాబోలు!

'కూరదినుసుల విజేతే విశ్వవిజేత' అని యూరోపియన్ల మధ్యయుగాల్లో కనిపెట్టిన సత్యం మనం సాగు ఆరంభించిన తొలిదినాల్లోనే పసిగట్టేశాం. మనగడ్డమీద మిరియాలు, సుగంధ ద్రవ్యాలు చవక. మనదగ్గర కొనుక్కొని వేరే దేశాలకు అమ్ముకొని వ్యాపార సంస్కృతిని విస్తరించింది మాత్రం యూరోపియన్లే. కాయగూరల కోసం బుడతకీచులు ఓడల నిండా సరుకులతో మన కోస్తా తీరాలవెంట తెగ తిరుగుతుండేవాళ్ళు. మిరియాలకోసమే కొలంబస్ ఇండియా ప్రస్థానం ప్రారంభించిందంటారు! పచ్చగా, అమాయకంగా కన్పించే పచ్చిమిర్చి ఘాటుని పాండు రంగడి శక్తితో పోల్చేదశకు పురందరదాసంతటి వైదాంతి కులే వెళ్ళారు కదా! ఇహ మన ఆహార చరిత్రను 'మిరపకాయకు ముందు-తరువాత'గా విభజించిస్తే మాత్రం తప్పేముంది!

ఒక్క మిరపకాయనే కాదు పన్నెండో శతాబ్ది 'మానసోల్లాస' గ్రంథంలో మన లడ్డూల ప్రస్తావనా ప్రశస్తంగా వినిపిస్తుంది. రామాయణ, భారతాలు, ఆయుర్వేద గ్రంథాల్లోని మోదకాలు మన లడ్డూలే! తెలుగు శాతవాహన చక్రవర్తి కథలో 'మోదక' శబ్దంసృష్టించిన కలకలం అంతా ఇంతా కాదుగదా! బుడతకీచు లతో పెంచుకొన్న వాణిజ్యబంధాలవల్లే బొప్పాయినుంచి క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బంగాళాదుంపలదాకా తెలుగు నాలుకలకి కొత్తరుచులు వంటబట్టాయి. మిరియాన్ని ఏమరచి మిర్చిని మరిగి ఆ కారాలకి తగ్గట్టుగా ఉప్పులు, పులుపులు, తీపుల కలగలుపులతో కొత్తతరహా వంటలకు తెరలేపిన ఘనుడు మన తెలుగువాడేనని మనం సగర్వంగా చెప్పుకోవచ్చు! పగిలిన కుండపెంకు మీదైనా సరే కమ్మని అట్టు పోసేయగల దిట్టతనమండీ మన తెలుగు చేతిది!

'మేలింపు చవి గుల్కు తాలింపు వంకాయ యూర్పులు గొనియాడ నేర్పు గలదే..' అంటూ 'రాజవాహన విజయం' కావ్యంలో కాకుమాని మూర్తికవి నోరూరించాడు! 'శుకసప్తతి' కావ్యంలో కదిరీపతి ''ఒపు దనరార జేపల యూర్పుగూర యుడిన..'అంటూ చేపలవూర్పు గురించి బులిపించాడు! దమయంతీ స్వయంవరానికని విచ్చేసిన అతిథులకోసం వడ్డించిన డెబ్బై రకాల వంటకాలనూ విపులంగా వర్ణించాడు.. శిష్యసమేతంగా విచ్చేసిన వ్యాసమహర్షుల వారికి కాశీవిశాలాక్షి చేతులమీదుగా శబ్దరత్నాకరానికైనా అర్థంకాని పలు పదార్థాలు తినిపించాడు శ్రీనాథుడు! శ్రీనాథుడి భోజన రాసిక్యతను గూర్చి బోలెడన్ని చాటువులు! రామకృష్ణకవి 'పాండురంగ మాహాత్మ్యం'లో కపట బ్రహ్మచారిగా వచ్చిన పరంధాముడికి పతివ్రతా శిరోమణి సుశీల ఇచ్చిన ఆతిథ్యంలోని ఖాద్యవిశేషాలతో అయితే ఏకంగా ఓ పరిశోధనా గ్రంథమే వెలువరించేసెయ్యవచ్చు. అయ్యలరాజు నారాయణామాత్యుడు తననాటి ప్రజల జీవనస్థితిగతుల వివరాలతో రాసిన 'హంసవింశతి'- వ్యాపారి విష్ణుదాసుడి విదేశీ పర్యటనలో వెంటతీసుకువెళ్ళిన పూరీలు, కూడుపరిగెలు, తెలుపరిగెల్లాంటి డెబ్బయిరకాల పిండివంటల జాబితాను ఏకరువు పెడుతుంది.

త్యాగరాజస్వామివారికి పుస్తికాయల ఒరుగుపులుసు 'వర్తకొలంబు' మహాప్రాణం. వస్త్రం మీద పుస్తికాయలు ఎండబెట్టు కొనేవేళ మనసులో కృతులు మహా పసందుగా అల్లు కుంటాయిట! ఎందరో మహానుభావులు! అందరికీ వందనాలు! అచ్చతెలుగు అప్పచ్చులరుచి అచ్చంగా అనుభవంలో మిగిలిపో వాలంటే అన్నమయ్య కీర్తనలొక పుడిసెడు పుక్కిలి పడితే సరిపోదా! 'మధుర తిరుమలేంద్రుడు- మంచి బహుమాన మొసగి/యె దుట కూర్చుండ మని - ఎన్నికలిమ్మనెనే/యిదిగో రెండువేల పదములు - ఇపుడెంచుకొమ్మనగా?/చదురు మీదనేయున్న సామికి -సంతోషమింతింత గాదె?' అని మన మొవ్వా వరదయ్య (క్షేత్రయ్య) గారి జావళీలు! జిలేబీల రుచిని తలపించే మధురరసాలు నోట ఊరటం లేదూ!

'శనగపిండి వంటకం ప్రియురాలి సరసమైతే అల్పాహారం ఇడ్లీ ఇంటావిడ అనురాగం' అంటారు డాక్టర్ సినారె. 'జ్ఞానపీఠ' గ్రహీతయితే మాత్రం తిండిరంధి ఉండకూడదా ఏంది! శతావధానులు తిరుపతి వేంకటకవులయితే.. పకోడీ చేసే విధానాన్ని శతవిధాల వండి చూపెట్టారు పలు అవధాన ప్రదర్శన పద్యాల్లో. తెలుగింటి విందులో వడ్డించిన విస్తరి మంగళగౌరీ గళసీమ నలంకరించిన నవరత్న ఖచితహారంలా రంగులీనుతుం టుందని ఓ సౌందర్యతుంటరి అభివర్ణన!

అరవై నాలుగు రకాల వరిధాన్యాలు తెలుగు రైతు పండించగలడు. అన్నింటినీ వండుకుతిని హాయిగా హరాయించుకోనూ గలడు! తెలుగు రుచుల్లోని వైవిధ్యం తెలియాలంటే తెలుగు సాహిత్యమూ రవ్వంత వంటబట్టాలన్నారు పెద్దలు మరి! పెద్దలమాట చద్దిమూట!

'ఇప్పుడీ తిండిగోలంతా ఎదుకండీ?' అని కదూ మీ సందేహం.

ఈ ఫిబ్రవరి ఒకటికి కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టబోతోంది కదండీ! ఆర్థిక శాఖామాత్యులు అప్పుడే 'హల్వా' వండటం మొదలెట్టేసినట్లు వార్త. బడ్జెట్లో ఎన్ని తీపి.. చేదు కబుర్లుంటాయో? మన తెలుగు తిండి మాత్రం నూటికి నూరు పాళ్లు షడ్రసోపేతంగా ఉండి గ్యారంటీగా నోరూరిస్తుంటుందండోయ్! తమరు కడుపారా తిని తృప్తిగా త్రేన్చేస్తే వండినందుకు మాకు అదే ఓ పెద్ద 'తుత్తి'.

నేతల్లో సమన్వయ లోపం



- అధికార టీఆర్ఎస్‌పై రేవంత్ ఒంటరి పోరాటం
- కాంగ్రెస్ సీనియర్ల నుంచి లభించని మద్దతు
- ప్రభుత్వ వైఫల్యాలను అందిపుచ్చుకోవడంలో వైఫల్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని ముఖ్యనేతల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అధికార టీఆర్ఎస్ వైఫల్యాలను అందిపుచ్చుకోవడంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలనే టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా, టీఆర్ఎస్ టార్గెట్‌గా పలు అంశాలను వెలికి తీస్తున్నారు. అయితే టీ కాంగ్రెస్ నేతలు మాత్రం తమకేమి పట్టనట్లుగానే ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకవైపు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని అంటున్నప్పటికి.. ప్రభుత్వానికి దీటుగా సమస్యలను ప్రజల్లోకి తీసుకుపోవడం లేదని సొంత పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ చేరినప్పటి నుంచి ప్రధానంగా నాలుగు అంశాలను ప్రభుత్వానికి ఇరకాటంలో పెట్టే విధంగా ప్రస్తావించారు. అయితే రేవంత్‌రెడ్డికి మాత్రం కాంగ్రెస్ నుంచి సీనియర్ల మద్దతు కరువైందని.. రేవంత్‌రెడ్డి లేవనెత్తిన అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లితే కాంగ్రెస్‌కు కాస్తో, కూస్తో లాభం జరిగేదని అంటున్నారు. పార్టీ నుంచి తగినంత మద్దతు లభించకపోవడంపై రేవంత్ రెడ్డి కూడా ఒక సీనియర్ నేత వద్ద తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గాంధీభవన్‌కు వచ్చిన మొదటి రోజే మంత్రి కేటీఆర్ మామ తప్పుడు కుల ధృవీకరణ ప్రతంతో ప్రభుత్వ ఉద్యోగం పొందారని, ఇప్పుడు పదవీ విరమణ పొందాక కూడా ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ పొందుతున్నారని సంచలనమైన ఆరోపణలు చేశారు. తాను చేసిన ఆరోపణలు నిరూపించకపోతే ప్రభుత్వం ఏ శిక్ష వేసినా సిద్ధమేనని రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కాగా ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాలేదు. ఈ విషయంలో కాంగ్రెస్ నేతల నుంచి రేవంత్‌రెడ్డికి మద్దతు కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేయడమే కాకుండా పార్టీకి చెందిన ఎస్టీసెల్‌కు ఈ విషయాన్ని అప్పగించారు. అయితే టీపీసీసీ స్థాయి నేతలు మాత్రం పెద్దగా స్పందించడం లేదని అంటున్నారు.

ఇకపోతే రెండో అస్త్రం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి డాక్టర్ సర్టిఫికెట్ నకిలీదని రేవంత్‌రెడ్డి జడ్చర్లలో సభలో ప్రస్తావించి కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. ఇరు వర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జరిగాయి. చివరకు మంత్రి లక్ష్మారెడ్డి కాస్త వెనక్కి తగ్గినట్లుగానే ప్రచారం జరిగింది. ఈ వివాదంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ వర్గాలమధ్య దుమ్మురేగినా..రేవంత్‌కు మద్దతుగా సీనియర్ నేతలెవ్వరూ మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికార టీఆర్ఎస్ నేతలు రేవంత్‌పై తిట్ల దండకం ఎత్తుకున్నా పీసీసీ అధినేత సైతం స్పందించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక తాజాగా విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి అక్రమాలు జరిగాయని రేవంత్‌రెడ్డి మరో బాంబు విసిరడంతో టీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య చిచ్చు రాజేసింది. రేవంత్ వ్యాఖ్యలపై అధికార పార్టీ నేతల స్పందించిన తీరుపై సీఎం కేసీఆర్ సైతం అగ్రహం వ్యక్తం చేసినట్లుగా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే రేవంత్‌కు మాత్రం సొంత పార్టీ నుంచి మాత్రం అనుకున్న మద్దతు లభించలేదని అంటున్నారు. కరెంట్ కొనుగోలులో జరిగిన అవినీతి అక్రమాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం కూర్చుకున్నారు. అధికార టీఆర్ఎస్ కూడా బహిరంగ చర్చకు సిద్ధమేనని ముందుగా ప్రకటించి.. రేవంత్‌రెడ్డి కాకుండా ఉత్తమ్, జానారెడ్డి వంటి సీనియర్లు రావాలని చిన్న ట్విస్ట్‌పెట్టి తప్పించుకున్నారు. కాగా అమరవీరుల స్థూపం వద్దకు రేవంత్‌తో వచ్చిన వారు తప్పా.. సీనియర్లు ఎవరు కూడా రాకపోవడంపై పార్టీ కేడర్ విస్మయం వ్యక్తం చేసింది.

కాగా రేవంత్ లేవనెత్తి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టినప్పటికి.. సీనియర్లు మద్దతు ఇవ్వకపోవడంలో మతలబు ఉందని కాంగ్రెస్‌లో చర్చ సాగుతోంది. రేవంత్ చేసే ఆరోపణలు బాసటగా నిలిస్తే.. ప్రజల్లో ఆయనకు పలుకుబడి పెరుగుతుందనే ఆలోచనతోనే సీనియర్లు పెద్దగా స్పందించడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యే!

- సూత్రధారి నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం
- ప్రాణభయం ఉందన్నా పట్టించుకోని ప్రభుత్వం: పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్గొండ, ప్రభ న్యూస్ బ్యూరో : శ్రీనివాస్ హత్య వాస్తవాలు వింటుంటే నిర్ఘాంతపోయాం. రాజకీయ కక్షతోనే మున్సిపాలిటీ చైర్ పర్సన్ భర్తను హత్య చేశారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హత్యకు సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలన్నారు. వెనుకబడిన నాయకుల ఎదుగుదలను ఓర్వలేకనే టీఆర్ఎస్ ప్రభుత్వం హత్యా రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. హత్యకు సూత్రధారి నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అని ఆరోపించారు. హత్యకు గురైన కాంగ్రెస్ నేత, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన చైర్‌పర్సన్ లక్ష్మీ నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి అండదండలు చూసుకొని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం బెదిరింపులకు పాల్పడుతూ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. నేరచరిత ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే అయినా తన పద్ధతి మారలేదన్నారు. హతుడు శ్రీనివాస్‌ను టీఆర్ఎస్‌లో చేరాలని ఒత్తిడి చేసినా చేరకపోవడంతోనే ప్రభుత్వం హత్య చేసిందని అన్నారు. ఆరు నెలల నుంచి బెదిరింపులు రావడంతో ముఖ్యమంత్రి నుంచి కలెక్టర్, ఎస్పిలను కలిసి రక్షణ కల్పించాలని అడిగినా పట్టించుకోలేదని చెప్పారు. పోలీసుల ప్రవర్తన చూస్తుంటే విచారణ సక్రమంగా జరుగుతున్నట్లు కనిపించడం లేదని అన్నారు. శ్రీనివాస్ హత్యలో ప్రధాన నిందితుడుగా ఉన్న మల్లేష్, రాంబాబులు వీరేశంతో ఫోటోలు దిగిన తీరు చూస్తుంటే హత్య చేయించి ఉంటారన్నది స్పష్టమవుతుందని తెలిపారు. కేసును సీబీఐకి అప్పగించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సీఎం బాధ్యత వహించాలి: జానారెడ్డి

శ్రీనివాస్ హత్యకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని కాంగ్రెస్ శాసన సభాపక్షనేత జానారెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంతో నిరంకుశ హింసాత్మక ఘటనలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ బలంగా ఉన్న నల్గొండలో అణచివేసే ప్రయత్నంలో భాగంగానే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుడు శ్రీనివాస్‌ను హత్య చేశారన్నారు. ప్రభుత్వం ఆగడాలను నిలువరించకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శ్రీనివాస్‌ది రాజకీయ హత్యేనని మండలి ప్రతిపక్షనేత షబ్బీర్ అలీ అన్నారు. డీఎస్పి సుధాకర్ అధికారపార్టీకి తొత్తుగా మారారని ఆరోపించారు. పోలీసులు డ్యూటీ మరచి నాయకులకు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. శాసన మండలి ఎన్నికల దగ్గర నుంచి హతుడు శ్రీనివాస్‌ను టీఆర్ఎస్ నేతలు భయపెడుతూనే ఉన్నారని, ఆయన లొంగకపోవడంతోనే హత్య చేశారని వి.హన్మంతరావు అన్నారు. శ్రీనివాస్ హత్య కేసును వదిలిపెట్టమని డీజీపీని కలిసి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు.

అరాచకాలు చేస్తే ఎవరూ మిగలరు: కోమటిరెడ్డి

చంపడం మనుషులు చేసే పనికాదు.. అరాచకాలు చేస్తే ఎవరూ మిగలరు.. హత్యలే అనుకుంటే టీఆర్ఎస్‌లో ఎవరూ ఉండరు.. కానీ మేము అటువంటి అరాచకాలకు పాల్పడమని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హత్యకు ప్లాన్ చేసింది డీఎస్పి అని, హంతకులు ఊట్కూరులో ఉన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. విలేకరుల సమావేశంలో చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులున్నారు.

కడుపులోనే కడతేరుస్తున్నారు

- ఐదుగురు ఆర్ఎంపీ డాక్టర్లు, మహిళ అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: లింగనిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం. అయినా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ కడుపులోనే ఆడశిశువులను కడతేరుస్తున్నారు. యాచారంలో లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న ఐదుగురు ఆర్ఎంపీ డాక్టర్లతో పాటు ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీవెంకటేశ్వర క్లీనిక్ అండ్ సరితా స్కాన్ సెంటర్ పేరుతో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఐదుగురు ఆర్ఎంపీ డాక్టర్లు, మరో మహిళ ఉంది. స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. అరెస్టయిన నిందితుల పేర్లు నారోజు కుమారస్వామి(37)(ఆర్ఎంపీ)(ఎ1), నారోజు సరిత(25)(ఎ4), కంబాలపల్లి మల్లేష్(38)(ఆర్ఎంపీ)(ఎ5), తౌట్ వెంకటేషం (40)(ఎ6), గండ్లపల్లి శ్రీనివాస్(40)(ఎ7), ఎ.రవి(40)(ఆర్ఎంపీ)(ఎ8). గంగారపు ఉదయ్ రాజు(ఎ2), జె.రాఘవరెడ్డి (ఎ3)లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎ5 నుంచి ఎ8 నిందితులు లోకల్ ఆర్ఎంపిలు ఎ1 నుంచి ఎ4లకు సహకరిస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని ఎ1 నంచి ఎ4లు నిర్వహిస్తున్న సరితాస్కానింగ్ సెంటర్‌కు పంపుతూ వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. నారోజు కుమారస్వామి గత 17 సంవత్సరాలుగా ఆర్ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. దీంతో ఆయనకు పరిసర ప్రాంతాల్లోని ఆర్ఎంపీలతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఎ3 అధికార సోనాలజిస్ట్‌గా వ్యవహరిస్తున్న ఎ3 జె.రాఘవరెడ్డి వద్దకు పేషేంట్లను రిఫర్ చేసేవాడు. నారోజు కుమారస్వామి తన భార్య సరితను కన్విన్స్ చేసి ఎ3 రాఘవరెడ్డిని కలిశారు. ఈ ముగ్గురు కలిసి మూడు నెలల టెంపరరీ రిజిస్ట్రేషన్‌పై శ్రీవెంకటేశ్వర క్లీనిక్ అండ్ సరితా స్కాన్‌సెంటర్‌ను స్థాపించి లింగ నిర్ధారణ పరీక్షలకు తెరదీశారు. తమకు సహకరించిన ఎ5 నుంచి ఎ8 నిందితులకు పెద్ద మొత్తంలో కమిషన్ ముట్టజెప్పేవారు. ఆగస్టు 2017లో పీఎస్ జనగావ్‌లో ఎ3 రాఘవరెడ్డిపై క్రైం.నెంబర్ 318/2017 కింద కేసు నమోదు కావడంతో అప్పట్నించీ పరారీలో ఉన్నారు. మరోవైపు రెన్యువల్ చేయకుండా ఈ దంపతులు ఇద్దరు క్లీనింగ్, స్కానింగ్ సెంటర్‌ని నిర్వహిస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు గుంజేస్తున్నారు. రాఘవరెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఎ2 ఉదయరాజుతో కలిసి వీరు తామే నిజమైన అధికార సోనాల్జిస్ట్‌గా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ దందాపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు.

కుషాయిగూడలో కాల్పుల కలకలం

కుషాయిగూడ పరిధి ఈసీనగర్‌లో తుపాకీ కాల్పుల కలకలం చెలరేగింది. కూరగాయల మార్కెట్ స్థలం వ్యవహారంలో బీహార్‌కు చెందిన వర్గం స్థానిక వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో బీహార్‌కు చెందిన వ్యక్తి తుపాకీతో కాల్పులు జరిపాడు. కాల్పుల్లో మౌలాలికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాల్పుల ఘటనతో సంతలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న హీరో నాని కారు

టాలీవుడ్ హీరో నానికి చెందిన కారుకు ప్రమాదం జరిగింది. నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో శుక్రవారం తెల్లవారుజామున ఈ రోడ్డు ప్రమాదం సంభవించింది. అదుపు తప్పిన ఇన్నోవా కారు డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు బెలూన్లు తెరుచు కోవడంతో నానికి, అతని డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే నాని పెదవికి స్వల్ప గాయమైనట్లు తెలుస్తోంది. నాని షూటింగ్ ముగించుకుని గచ్చిబౌలి వెళ్తుండగా ఈ ఘటన జరగింది. వెంటనే వేరే కారును తెప్పించుకుని నాని అక్కడ్నించి వెళ్లిపోయారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తాను మద్యం సేవించలేదని, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని డ్రైవర్ శ్రీనివాస్ పోలీసులకు తెలిపారు. కారు ప్రమాదంపై హీరో నాని ట్విట్టర్లో స్పందిస్తూ తనకు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు.

ఎంపీ కనిమొళిపై కేసు నమోదు

తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ ఎంపీ కనిమొళిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఎంపి కనిమొళి ఇటీవల ఓ సమావేశంలో తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని కించపరిచేలా ప్రసంగించారు. దానిపై హైదరాబాద్‌లోని సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని న్యాయవాది కపిలశెట్టి కరుణాసాగర్ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐపీసీ-295-ఏ, 298, 504 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కోరారు. గురువారం ఈ పిటిషన్‌ను కోర్టు విచారించింది. కోర్టు ఆదేశాల మేరకు కనిమొళిపై సైదాబాదు పోలీసులు విచారణ చేపట్టారు. ఇటీవల తిరుమల శ్రీవారి ఆలయం గురించి కనిమొళి మాట్లాడుతూ.. దేవుడు ముందు అందరూ సమానమే అని చెబుతారు.. అదంతా పచ్చి అబద్ధం.. ఎక్కువ డబ్బు చెల్లించి టికెట్లు కొంటే భగవంతుడు త్వరగా ప్రత్యేక దర్శనం ఇస్తాడు.. లేని పక్షంలో 10 గంటలు, 20 గంటలు లేక రోజుల తరబడి శ్రీవారి దర్శనం కోసం క్యూలో నిల్చోవాలి. ఆ దేవుడు అంటే అంతే. శ్రీవారి హుండీ వద్ద సెక్యూరిటీ కాపలా ఎందుకు కాస్తున్నారు. నిజంగా అక్కడ దేవుడు ఉంటే ఆ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఏముందని తిరుమల శ్రీవారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే.

క్షమాభిక్షల ఆలస్యంపై ఖైదీల నిరసన

- అధికారులకు వినతి పత్రాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీవితకాల ఖైదీల క్షమాభిక్ష విషయంలో ప్రభుత్వ నిర్ణయం వెలువడక పోవడం పట్ల రాష్ట్రంలోని కేంద్ర కారాగారాలలోని ఖైదీలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఉదయం అల్పాహారాన్ని బహిష్కరించిన ఖైదీలు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. చంచల్‌గూడ, చర్లపల్లి, వరంగల్ కేంద్ర కారాగారాలలో ఖైదీలు దాదాపు 200 మంది క్షమాభిక్ష ప్రకటనపై ఇంతకాలం వేచి ఉన్నారు. చివరి నిమిషంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వాయిదా వేయడంతో వీరంతా తమ నిరసనను తెలిపారు. జీవిత ఖైదీలకు సంఘీభావంగా మిగతా ఖైదీలు కూడా సంఘీభావం తెలిపారు. చంచల్‌గూడ, చర్లపల్లి, వరంగల్, నిజామాబాద్ జైళ్ళలో ఖైదీలు తమకు క్షమాభిక్షను వెంటనే ప్రసాదించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామని, మార్చి మాసంలో క్షమాభిక్షపై ప్రభుత్వం నుంచి ఒక ప్రకటన వెలువడేలా ప్రయత్నిస్తామని అధికారులు నిరసన ఖైదీలకు హామీ ఇచ్చారు. ఉదయం అల్పాహారం బహిష్కరించారన్న విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు కొంత కంగారుకు గురైనా ఆ తర్వాత భోజన సమయానికి పరిస్థితి సద్దుమణగడంతో తేరుకున్నారు.

జైలులో పతాకావిష్కరణ చేసిన డిజి వికె సింగ్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జైళ్ళ శాఖ డిజి వికె సింగ్ శుక్రవారం ఉదయం చంచల్‌గూడ జైలు ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిజి మూడు లక్ష్యాలను ముందుంచుకుని జైళ్ళ శాఖ పని చేస్తోందని, క్షణికావేశంలో నేరాలు చేసి జైలు శిక్షకు గురైన వారికి ఉపాధికి అవసరమైన శిక్షణను ఇప్పించడం, విడుదలైన ఖైదీలకు జైళ్ళ శాఖ నిర్వహిస్తోన్న పెట్రోలియం అవుట్‌లెట్‌లు, ఆయుర్వేద విలేజ్‌లలో ఉపాధి కల్పించడం, నేరాలు తగ్గేలా ఖైదీలలో పరివర్తన తేవడం లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి పతకాలకు ఎంపికైన ఐజి నర్సింహా, హెడ్ వార్డర్ మోహన్, జయరాజ్, చీఫ్ హెడ్ వార్డర్ రాములును అభినందించారు.

విద్యుదాఘాతంతో బస్సు దగ్ధం



కొల్చారం, ప్రభన్యూస్ : ఆర్టీసీ బస్సులో విద్యుదాఘాతం వల్ల మంటలు చెలరేగి దగ్ధమైంది. దీంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మెదక్ జిల్లా, మండల కేంద్రమైన కొల్చారం బస్టాండ్ వద్ద మెదక్-నర్సాపూర్ ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా, బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్తుంది. కొల్చారం వద్దకు రాగానే బస్సులో నుంచి విద్యుదాఘాతం వల్ల పొగలు రావడంతో డ్రైవర్ బస్సును నిలిపివేసి ప్రయాణికులను దింపివేశారు. ప్రయాణికులు భయాందోళనకు గురై కొందరు కిటికీల గుండా, బస్సు వెనుకభాగం నుంచి దిగిపోయారు. ఇది గమనించిన కొల్చారం గ్రామస్తులు మంటలను చల్లార్చారు. బస్సులో 48 మంది ప్రయాణికులు ఉన్నట్లు డ్రైవర్ భూమేశ్ తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

- బీసీ విద్యార్థి సంఘం క్యాలెండర్ విడుదల చేసిన కృష్ణయ్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ ఇతర వృత్తి విద్య కోర్సులు చదువుతున్న బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. బకాయి ఉన్న రూ. 1600 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ భవన్‌లో జరిగిన బీసీ విద్యార్థి సంఘం తీర్మానం చేసింది. బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ కొప్పుల జగన్ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశం అనంతరం బీసీ విద్యార్థి సంఘం రూపొందించిన 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

28న బీసీ ఉపాధ్యాయుల రాష్ట్ర మహాసభ

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 28న బీసీ ఉపాధ్యాయుల రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ బీసీ ఉపాధ్యాయుల సంఘం తెలిపింది. రాష్ట్రంలోని బీసీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా చర్చించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె కృష్ణుడు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు లేకపోవడంతో ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో బీసీలకు ప్రాతినిధ్యం లేకుండా పోయిందని ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడంలో రాజ్యాంగపరమైన, చట్టపరమైన అవరోధాలు లేవని ఆయన గుర్తు చేశారు. మండల్ కమిషన్ 1980లోనే సిఫారసు చేసిందని, 2004లో నాచియప్పన్ కమిటీ కూడా సిఫారసు చేసిందని గుర్తు చేశారు.


'అసభ్య పదజాల పరిచయకర్త కేసీఆర్'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజకీయాల్లో పరుష పదజాలం, బూతుల సంస్కృతి, వ్యక్తిగత దూషణలు, కించపరచడం వంటివి ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రవేశపెట్టారని తెలుగుదేశంపార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి ఆరోపించారు. ఇలాంటి అసభ్య పదజాలాన్ని రాజకీయాలకు పరిచయం చేసిన కేసీఆర్ ఇప్పుడు తన బండారం బహిర్గతం చేస్తున్నందుకే సోషల్ మీడియాపై ఆంక్షలు విధిస్తున్నారని దుయ్యబట్టారు. సామాజిక మాధ్యమాలలో పోస్టింగ్‌లపై కేసులు నమోదు చేయడానికి చట్ట సవరణ చేస్తున్న కేసీఆర్ గతంలో ఇలాంటి చట్టాలను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం మరిచిపోయారా అని నర్సిరెడ్డి ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించాలనే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే తన గుప్పిట మీడియాను బంధించిన కేసీఆర్ తనకు వ్యతిరేకంగా మీడియాలో ఎలాంటి కథనాలు రాకుండా చూసుకుంటున్నారని ఆరోపించారు.

త్వరలో ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : త్వరలోనే విద్యుత్‌తో నడిచే వాహనాలకు సంబంధించిన విధానం విడుదల చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల సీఎండీ డి.ప్రభాకర్ రావు వెల్లడించారు. శుక్రవారం విద్యుత్‌సౌధలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎండీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధిని సాధించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలోని 23లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు 24గంటల విద్యుత్‌ను అందచేస్తున్నామన్నారు. సమిష్టి కృషితోనే ఇది సాధ్యపడిందన్నారు. టీఎస్ జన్కో మొత్తం 5880 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులను చేపట్టిందన్నారు. ఇందుకోసం రూ.37938కోట్లు వెచ్చిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను పలు విధాలుగా పటిష్టం చేశామన్నారు. విద్యుత్ పీక్ డిమాండ్ 9500మెగావాట్లకు చేరిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను 11 వేల మెగావాట్ల సామర్థ్యానికి తగ్గట్టుగా పటిష్టం చేశామన్నారు. తెలంగాణ సోలార్ విద్యుత్ పాలసీ-2015 దేశంలోనే అత్యుత్తమమైనదిగా ప్రసంశలు పొందిందన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 30 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే ఉన్న సోలార్ విద్యుత్ ప్రస్తుతం 3090 మెగావాట్లకు పెరిగిందన్నారు. వినియోగదారుడి సంతృప్తే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెఎండీ సి.శ్రీనివాస్ రావు, డైరెక్టర్స్ జి.నర్సింగరావు, టి.జగత్ రెడ్డి, జె.సూర్యప్రకాష్, సి.రాధాకృష్ణ, ఎం.సచ్చిదానందం, సీహెచ్ వెంకటరాజం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల్ని ఆదుకుంటాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆపదలో ఉన్న ప్రతి ఆర్టీసీ కార్మికున్ని, వారి కుటుంబాలను తమ కుటుంబ సభ్లల్లా అన్ని విధాలుగా ఆదుకుంటామని రవాణా శాఖ మంత్రి పి. మహేందర్ రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీనివాస్ (28) కుటుంబాన్ని దామర్‌చేడ్‌లో మంత్రి శుక్రవారం పరామర్శించారు. శ్రీనివాస్ తల్లిదండ్రులు, భార్యను ఓదార్చి వారికి సంస్థాపరంగా రావలసిన అన్ని సదుపాయాలను అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాస్ భార్యకు ఆర్టీసీలో ఉద్యోగం ఇప్పిస్తామని మంత్రి తెలిపారు. ఆర్టీసీలో 50,600ల మంది ఉద్యోగుల్లో సుమారు 40 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులుగా సేవలందిస్తున్నారని మంత్రి వివరించారు.

న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వీలైనంత ఎక్కువ సహాయం చేయాలని నిర్ణయించామని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దివ్యాంగుల న్యాయవాదుల సంఘం ఆవిర్భావ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఇప్పటికే కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందన్నారు. దివ్యాంగుల న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శాసనమండలి సభ్యుడు ఎన్. రాంచందర్‌రావు మాట్లాడుతూ, సంఘం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, సంఘానికి కావాల్సిన తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. సంఘం సలహాదారు జెఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ, సమాజంలో అందరిలాగానే సమాన అవకాశాలు, సదుపాయాలు కల్పిస్తే దివ్యాంగులు కూడా అందరిలాగే మంచి జీవితం గడపగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మహ్మద్ ఫరీదుద్దీన్ తదితరులు మాట్లాడారు.

ఈఎన్‌సీల మధ్య కోల్డ్‌వార్

- సీనియార్టీపై తెగని పంచాయితీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఒకే ప్రభుత్వ శాఖలోని ఇద్దరు ఉన్నతాధికారుల మధ్యన గత కొంత కాలంగా కోల్డ్ వార్ నడుస్తోంది. ఉద్యోగుల సీనియారిటీతో పాటు ఇతర సర్వీస్ మేటర్స్ తదితర అంశాలపై నడుస్తున ఈ వార్ భారత గణతంత్ర దినోత్సవం సాక్షిగా బహిర్గతమైంది. తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఇందుకు వేదికగా మారింది.2008 వరకూ పంచాయతీరాజ్ శాఖలో గ్రామీణ నీటిసరఫరా కూడా ఒక భాగంగా నడిచేది. అయితే నిర్వహణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 2008 ఏప్రిల్ ఒకటిన అప్పటి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీంతో అప్పటివరకూ ఒకే ఈఎన్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీర్లు రెండుగా వేరుపడి పోయారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి ప్రత్యేకంగా ఈఎన్‌సీతోపాటు సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, తదితర యంత్రాగం అంతా ఏర్పాటయింది. అయితే ఉద్యోగుల సీనియారిటీని నిర్ణయించి నివేదిక అందచేసే అధికారాన్ని మాత్రం ప్రభుత్వం పంచాయతీరాజ్ ఈఎన్‌సీకే అప్పగించింది. ఇక అప్పటి నుంచి ఉద్యోగుల సీనియారిటీ ఎడతెగని ప్రహసనంగా కొనసాగుతూ వస్తోంది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఇది ఒక్కసారిగా బుసలు కొట్టింది. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ కార్యాయలంలో జాతీయ జెండా ఎరుగవేసిన ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సత్యనారాయణ రెడ్డి పై అసహనం విమర్శల దాడికి దిగారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఉద్యోగులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నప్పటికీ ఈఎన్‌సీ సత్యనారాయణ రెడ్డి నుంచి ఆశించినంత సహకారం లభించటం లేదన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ల సీనియారిటీని ఖరారు చేయటంలో పంచాయతీరాజ్ విభాగం ఇంకా మీనమేషాలు లెక్కపెడుతుందని విమర్శించారు. ఒక్కసారి సీనియారిటీ ఖరారైతే ప్రస్తుతం పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు రెగ్యులరైజ్ అవుతారని గుర్తు చేశారు. ఈ చిన్న పనికోసం తమ ఇంజనీర్లు పంచాయతీరాజ్ ఈఎన్‌సీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, ఆయన దగ్గరనుంచి ఇంకా సానుకూల స్పందన రాకపోవటం శోచనీయం అని ఆరోపించారు.

సీనియారిటీ ఖరారు విషయంలో నిర్లక్ష్యంపై సీఈ రాములు నాయక్ కోర్టులో కేసు వేశారని తెలిపారు. దీంతో పీఆర్ ఇంజనీర్ల సీనియారిటీ మాత్రమే ఖరారు చేసి రెగ్యులరైజ్ చేశారని, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లకు మొండిచేయి చూపారని ఆరోపించారు. బాధ ఒకరిది.. ఆనందం ఒకరిది అన్నట్టుగా తాము కష్టపడి పనిచేస్తుంటే పంచాయతీరాజ్ విభాగంలోని ఉన్నత హోదాకలిగిన అధికారులు అప్పనంగా ప్రయోజనం పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవం రోజైనా పీఆర్ ఈఎన్‌సీతో మాట్లాదామనుకుంటే ఆయన ఆందుబాటులో లేరని అసంతృప్తిని వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగంలోని మహిళా ఉద్యోగుల పిల్లల కోసం చైల్డ్‌కేర్ సెంటర్‌ను కార్యాలయ ప్రాంగణంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సంవత్సరం కిందట తీసుకున్న ఈ నిర్ణయం ఇంకా అమలు కాలేదన్నారు. పిల్లలకు అవసరమైన వసతిని పీఆర్ విభాగం ఇంకా కల్పించకపోవటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎవరికీ తీసిపోకుండా కష్టపడుతున్న మహిళా ఉద్యోగులు అడిగిన ఈ చిన్న పనికూడా చేయకపోవటం సిగ్గుచేటు అని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డిపై నిప్పులు చెరిగారు.

ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా: సత్యనారాయణరెడ్డి

గత 18ఏళ్లుగా నానుతున్న సీనియారిటీ జాబితాపై తాము ఎంతో కష్టపడి ఒక కొలిక్కి తెచ్చామని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి తనపై చేసిన విమర్శలకు సత్యనారాయణరెడ్డి ముక్తసరిగా స్పందించారు. తనపై సురేందర్ రెడ్డి చేసిన విమర్శలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్టు సత్యనారాయణరెడ్డి ఆంధ్రప్రభ ప్రతినిధితో పేర్కొన్నారు.

విజయవాడకు ఏపీ సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: దావోస్‌లో నాలుగు రోజుల పాటు పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం విజయవాడ చేరుకున్నారు. అయితే షెడ్యూల్ ప్రకారం ఉదయం 7 గంటలకు రావల్సి ఉన్నప్పటికి ఆబుదాబీలో వాతావరణం అనుకూలించకపోవడంతో ఆయన రావల్సిన విమానం సాయంత్రం 6గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. అమరావతి చేరుకున్న వెంటనే ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమానికి సంబందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని అమరావతి చేరుకున్న చంద్రబాబుకు మంత్రులు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. గజమాలతో ముఖ్యమంత్రిని సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో మంత్రులు దేవినేని ఉమా మహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలు ఉన్నారు.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

లగ్జరీ కార్లు,ఎస్‌యూవీలపై... జీఎస్‌టీ తగ్గించండి :జెఎల్ఆర్

ముంబై: టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జెఎల్ఆర్) ప్రీమి యంసెడాన్; ఎస్‌యూవీలపై జీఎస్టి తగ్గించాలని కోరుతున్నాయి. దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు పెరగడానికి ఇది దోహదం చేస్తుందని పేర్కొంది. దీర్ఘకాలాన్ని దృష్టిలో ఉంచుకొని లగ్జరీకార్లపై పన్ను తగిస్తే.. ప్రీమియం సెగ్మెంట్ పుంజుకుంటుందని,, దీంతొ పాటు దేశంలో ఉద్యోగావకాశాలు పెరు గుతాయని తెలిపింది. సంస్క రణలో భాగంగా జీఎస్టిని అమ ల్లోకి తేవడాన్ని ప్రశంసిస్తూనే.. మార్కెట్లో తాము ని లదొక్కుకోవాలంటే పన్నులు హేతు బద్ధంగా ఉండాలని జెఎల్ఆర్ ఇండి యా ప్రెసిడెంట్, ఎండీ రోహిత్ సూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం లగ్జరీ సెడాన్‌లపై 48 శాతం, ఎస్‌యూవీపై 50 శాతం పన్ను విధిస్తున్నారు. ఈ పన్ను రేట్లు చాలా చాలా ఎక్కువని ఆయన వివరించారు. ఆటోరంగాన్ని విస్తరించాలంటే ఉద్యోగాలు కల్పిం చాలంటే ప్రభుత్వం తక్షణమే పన్నులు తగ్గించాలని, దీంతో పాటు రోడ్‌టాక్స్ కూడా తగ్గించాలని ఆయన కోరారు. భారత్ జాగ్వార్ ఫోర్టుపోలియోలో ఎక్సఈ, ఎక్సఎఫ్, ఎఫ్-పేస్; ఎక్సజె, ల్యాండ్ రోవర్‌రేంజి, ది డిస్కవరీ,స్పోర్ట్ రేంజి రోవర్ ఈవోకలున్నాయి.



బడ్జెట్‌లో అంచనాలు బోలెడు!

చౌక ఇళ్లకు అండదండలు
జీఎస్టీ సిఫార్సుతో అందరిలో ఆశలు

న్యూఢిల్లీ : ప్రభుత్వం చౌకరకం గృహాలపై దృష్టి పెట్టింది. ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి జనవరి 18వ తేదీన జరిగిన జీఎస్టి మండలి సమావేశంలో ప్రధానమంత్రి అవాస్ యోజన (పీఎంఏవై) కింద పన్ను రేటు 8 శాతానికి తగ్గించాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలపై 18 శాతం పన్ను విధిస్తున్నారు. అయితే మొత్తం భూమి విలువలో గృహ విలువ మూడోవంతు ధర తగ్గించే ప్రొవిజన్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఖచ్చితంగా పన్ను రేటు 12 శాతానికి దిగివస్తుంది. ఈ పన్నురేటు ప్రస్తుతం 400 బేసిస్ పాయింట్లు తగ్గి ఎనిమిది శాతానికి దిగివస్తుంది. జీఎస్టి మండలి ఇచ్చిన అత్యంత కీలకమైన సిఫార సులో చౌకరకం గృహాలపై రాయితీరేటు 12 శాతంగా సిఫా రసు చేసింది.. మొత్తం గృహం కానీ, ఫ్లాట్‌పై కానీ దాని విలువలో మూడోవంతు తీసేస్తే 8 శాతానికి దిగివస్తుంది. నిర్మాణంలో ఉన్న గృహం కానీ... లేదా భూమి కోనుగోలు చేసి నిర్మాణం చేపట్టే గృహాలకు క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం అమల్లోకి వస్తుందని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ఒక ప్రక టనలో పే ర్కొంది. ఇది లా ఉండగా పీఎ ం ఏవైను ప్రభుత్వం జూన్ 2015లో ప్రారం భించింది. ఆర్థికంగా బలహీ నవర్గాల వారికి (ఈడబ్ల్యు ఎస్)తో పాటు అల్పాదాయ వర్గాల వారికి రూ.6 లక్షల వరకు 6.5 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది ఇది 2022 వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 31,2016న కేంద్ర ప్రభుత్వం మధ్య ఆదాయం వర్గాల వారికి (ఎం ఐజీ) పీఎంఏవై కింద వారికి గృహ రుణా లు రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వస్తుంది. దీనిపై వడ్డీ రాయితీ నాలుగు శాతం, మూడు శాతం వరకు ఇస్తా మని ప్రకటించింది. కాగా ఎంఐజీ స్కీం ప్రారంభంలో 12 నెలల పాటు ఉంటుందని ప్రక టించింది. తర్వాత అదనంగా 15 నెలల పాటు పొడిగించి మార్చి 2019 వరకు కొనసా గుతుందని తెలిపింది. చౌకరకం గృహాలు కొనుగోలు చేయాలనే వారికి వడ్డీ రాయితీ లభిస్తుంది కాబట్టి వారికి అతి తక్కు వ వడ్డీరేటు జీఎస్టిలో 8 శాతంవరకు అందు బాటులోకి వస్తుందని అనరాక్ ప్రాపర్టీ కన్సెల్టెంట్స్ చైర్మన్ అనుజుపూరీ చెప్పారు.సీఎల్ఎస్ఎస్ కింది నిర్మించే గృహాలు 30 చదరపు మీటర్లు, ఈడబ్ల్యుఎస్, 60 చదరపుమీటర్లు ఎల్ఐజీ, 120 చదరపు మీటర్లు ఎంఐజీ1, 150 చదరపు మీటర్లు ఎంఐజీ2కు వరిస్తాయి. ఏడాదికి రూ.18 లక్షల ఆదాయం గల వారు మాత్రమే దీనికి అర్హులవుతారు. ప్రభు త్వం జీఎ స్టిలో పన్ను రేటును తగ్గిస్తే కొత్తగా గృహాలు కొనుగోలు చేసేవారికి పెద్ద ఊరట లభిస్తుందని రామ్ వాలాసే వీబీహెచ్‌సీ వ్యాల్యూహోం ప్రమోటర్ మాజీ సిటి బ్యాంకర్ జెర్రీ అభిప్రాయపడ్డారు.




2018-19 బడ్జెట్‌కు సమయం దగ్గరపడుతోంది. ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటు బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ రంగాలకు చెందిన వారు తమ తమ కోరికల చిట్టాను ఆర్థిక మంత్రి ముందుపెట్టారు. ప్రధానమంత్రి 2022 నాటికి దేశంలోని ప్రజలందరికి సొంత గృహం ఉండా లని ప్రకటించిన విషయం తెలిసిందే. వచ్చే బడ్జెట్‌లో కొత్తగా గృహాలు కొనుగోలు చేసే వారికి వడ్డీ రాయితీలు ఇస్తామని ప్రకటించింది. జీఎస్టిలో ప్రస్తుతం గృహాలపై ఉన్న 12 శాతం పన్ను 8 శాతానికి తగ్గించే అవకాశాలు కనిపిస్తు న్నాయి.అలాగే ఎఫ్‌ఎంసీజీ రంగం కూడా తమ కోరికల చిట్టాను ప్రభుత్వం ముందుంచింది. ఈ రంగం ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాలని సూచించింది. మౌలికరంగం అభివృద్ధిపై దృష్టి పెట్టా లని, శీతల గిడ్డంగులతో పాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచాలని కోరుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెడితే వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుందని, రైతుల ఆదాయం పెరుగుతుంది. ఈ రం గంలో ఉద్యోగాలు పెరుగుతాయని, రైతుల ఆదాయంరెట్టింపు అవుతుందని పేర్కొంది. ఆదాయపు పన్ను శ్లాబ్‌ను పెంచాలని కోరింది. దీంతో ప్రజల చేతిలో డబ్బు ఆడుతుందని.. ఈ డబ్బు ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి వీలవుతుందని అంటోంది.

ఆహారానికి ఆలంబన!
ఫుడ్ ప్రాసెసింగ్‌పై పెక్కు డిమాండ్లు

న్యూఢిల్లీ : వచ్చే బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ప్రధానంగా మౌలికరంగం అభి వృద్ధితో పా టు చిన్న వ్యాపా రా లు, చౌకర కం గృ హాల తో పాటు గి డ్డం గులు, కోల్ట్ స్టోరే జిల నిర్మిం చే వారికి ప్రోత్సా హకాలు కల్పిం చాలని ఎఫ్‌ఎంసీజీ కంపె నీలు కోరుతు న్నాయి. అలాగే ఫుడ్‌ప్రా సెసింగ్ రం గంతో పాటు వ్యవసాయ ఉత్ప త్తులకు ధర పెంచే విధం గా.. గ్రామీణ ప్రాం తా ల్లోని రైతు కార్మి కులకు వేతనాలు పెం చాలని,, ఉద్యోగులకు పన్ను రాయి తీలు కల్పించి వినియో గదారుల చేతుల్లో పెద్దమొత్తంలో డబ్బు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ రంగానికి చెందిన వారు బడ్జెట్ కోరికల చిట్టాలో పేర్కొన్నారు. అలాగే ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దెత్తున అనుమతించాలని కోరారు.

వ్యవ సాయ ఉత్పత్తులకు విలువ పెంచడానికి ప్రభుత్వం ప్రధా నంగా ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంపై దృష్టిపెట్టాలని, దీంతో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని ఐటీసీ అధికార ప్రతి నిధి చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ప్రధానంగా వ్యవసా యరంగంపై ఆధారపడి ఉంటుంది. ఫుడ్‌ప్రాసెసింగ్ రంగం పుంజుకుంటే వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి పెంచుకోవచ్చు. రైతులకు ఆదాయంతో పాటు ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ... వ్యవసాయ రంగంలో అనవసరపు వృధాను అడ్డుకట్టవేయవ చ్చునని ఆయన అన్నారు.ఇమామి గ్రూపు జాయింట్ చైర్మన్ ఆర్ఎస్ అగర్వాల్ మాట్లాడుతూ వచ్చే బడ్జెట్ ప్రభు త్వ వ్యవ సాయంతో పాటు గ్రామీణాభివృద్ధి, మౌలికరంగం అభివృ ద్ధితోపాటు చిన్న వ్యాపారాలు, చౌకరకం గృహాలపై దృష్టి పెట్టాలన్నారు. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రాడక్ట్స మేనేజింగ్ డైరె క్టర్, సీఈవో వివేక్ గంభీర్ మాట్లాడుతూ.. మధ్యతరగతి వారు ఆదాయపుపన్ను శ్లాబ్‌ను పెంచాలని దీంతో ఉద్యోగు లతో చేతిలో డబ్బు ఆడుతుందని, ఆ డబ్బుతో తిరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి వీలవుతుందన్నారు. మొత్తానికి ఈఎఫ్‌ఎంసీజీ కంపెనీలు మాత్రం వినియోగదారుల్లో విశ్వాసం కల్పించాలని.. గ్రామీణ మార్కెట్లపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. వ్యవసాయుత్పత్తులను పెంచి రైతుల చేతిలో పెద్దమొత్తంలో డబ్బు ఉండేలా చూడాలని వీరు ముక్తకంఠంతో కోరుతున్నారు.



ప్రదర్శనకు 17 ప్రొడక్టులు

• కొత్తగా రెండుమోడల్స్ కూడా..

ఆటోఎక్స్‌పో-2018



న్యూఢిల్లీ : వచ్చే నెల ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా మొత్తం 17 ప్రొడక్టులను ప్రదర్శనకు ఉంచబోతోంది. ప్రతి ఏడాది మాదిరాగానే ఈ ఏడాది కూడా రెండు ప్రొడక్టులను ప్రదర్శనకు ఉంచుతామని ప్రకటించింది. అయితే కొత్త మోడల్స్ వివరాలు మాత్రం గోప్యంగా ఉంచింది. ఆటో రంగానికి చెందిన విశ్లేషకుల అంచనా ప్రకారం సుజుకి వీ- స్ట్రోమ్ 650 అడ్వెంచర్ ఫోరర్‌తో పాటు కొత్త స్కూటర్‌ను ఆటోఎక్స్‌పో ప్రదర్శిస్తుందని భావిస్తున్నారు. వీటితో పాటు ఫ్యూయెల్ ఇంజెక్టడ్ వెర్షన్ ఇంట్రూడెర్ 155 క్రూయిసర్‌ను ప్రదర్శనకు ఉంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈఏడాది ప్రత్యేక ఆకర్షణగా సుజుకీ ఎక్‌స్టార్ జీఎస్ఎక్స్-ఆర్‌పీ మోటోజీపీ బైక్, జిక్సర్‌కప్ రేజ్ బైక్, 2018 సుజుకి ఆర్ఎం జెడ్ 450, 2018 సుజుకి ఆర్ఎం జెడ్ 250, 2018 సుజుకి డీఆర్‌జెడ్70తో పాటు దేశీయంగా తయారుచేసే యాక్సెస్, లెట్స్ స్యూటర్స్, సుజుకి జిక్సర్ 155, ఇంట్రూడర్ క్రూయిసర్‌లను ప్రదర్శనకు ఉంచుతాయమని సుజుకి మోటార్ సైకిల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సాటోషి ఉచిడా చెప్పారు. భారత్ మార్కెట్లో మంచి విజయం సాధించామని, దీంతో పాటు కొత్త ప్రొడక్టును పరిచయం చేసి 2020 నాటికి మిలియన్ యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా ముందుకు కదులుతున్నామన్నారు.

జోరుగా హోండా గ్రేజియా అమ్మకాలు

•75 రోజుల్లో 50యూనిట్ల విక్రయాలు



ముంబై : హోండా తాజాగా మార్కెట్లో విడు దల చేసిన గ్రాజి యా విడు దల చేసిన 75 రోజుల్లోనే 50వేల యూని ట్లు విక్ర యించింది. ఈ అర్బన్ స్కూటర్ దేశ వ్యాప్తంగా అందుబాటు లోకి వచ్చిన తర్వాత ఈ నెల నుంచి అమ్మకాలు జోందు కుంటాయని తెలి పింది. ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీల్లో హోండా రెండవ స్థానంలో ఉంది. ఈ ఏడాది 60 లక్షల యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా పెట్టు కుంది. హోండా స్కూటర్స్ అండ్ మోటార్‌సైకిల్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసి డెంట్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైఎస్ గులేరియా మాట్లాడుతూ.. కేవలం రెం డున్ననెలలో 50వేల యూనిట్లు విక్రయించి రికార్డుసృష్టించిందన్నారు. హెచ్ ఎంఎస్ఐ 2001లో యాక్టివ్‌ను మార్కెట్లో విడుదల చేసింది అటు తర్వాత నుంచి మే 2016 వరకు ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో దేశంలో అత్యధికంగా అమ్ముడవుతోంది.

విదేశీమారకద్రవ్యం నిల్వాలు 14,47,800 కోట్ల డాలర్లు

ముంబై : రిజర్వుబ్యాంకు వద్ద విదేశీ మారకద్రవ్యం నిల్వాలు వరుసగా నాలుగో వారం భారీ పెరిగాయి. జనవరి 19తో ముగిసిన వారాంతానికి 414.784 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. గత వారం 959.1 మిలియన్ డాలర్ల పెరిగాయని తెలిపింది. అంతకు ముందువారం ఆర్‌బీఐ వద్ద నిల్వాలు రెండు బిలియన్ డాలర్లు పెరిగి 413.825 బిలియన్ డాలర్లకు చేరాయని తెలిపింది. చివరగా 8,2017న మొట్టమొదటిసారి 400 బిలియన్ డాలర్ల మార్కును దాటింది. అయితే గత నాలుగు వారాల నుంచి క్రమంగా నిల్వాలు పెరుగుకుంటూపోతున్నాయి. జనవరి 19తో ముగిసిన వారాంతానికి విదేశీమారకద్రవ్యం నిల్వాల మొత్తం విలువ 934.6 మిలియన్ డాలర్లు పెరిగి 390.768 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్‌బీఐ వద్ద వివిధ దేశాలకు చెందిన కరెన్సీ ఉంటుది. వీటి విలువ పెరగనూవచ్చు... తరగనూ వచ్చు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద డ్రాయింగ్ రైట్స్ 10.4 మిలియన్ డాలర్లు పెరిగి 1.531 బిలియన్ డాలర్లు ఎగబాకాయి.

పన్నులు తగ్గించి... రాయితీలివ్వండి

• బడ్జెట్‌లో గృహోపకరణాల స్థానం ఎక్కడ?



న్యూఢిల్లీ : కన్స్యూమర్ డ్యూరబుల్స్, హోం అప్లియెన్సెస్ తయారీ కంపెనీలు ఉదాహరణకు గోద్రెజ్ అప్లియెన్సెస్, పానాసొనోక్, ఫిలిప్స్ లైటింగ్, ఇంటెక్స్ లాంటి కంపెనీలు వచ్చే బడ్జెట్‌లో పన్నులు తగ్గించాలని, స్థానికంగా తయారు చేసిన ఉత్పత్తులపై రాయితీలు ఇవ్వాలని దిగుమతులపై కస్టమ్స్ సుంకం పెంచాలని కోరుతున్నారు.దీంతో పాటు ఏసీఈ (అప్లియెన్సెస్ అండ్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్) పరిశ్రమకు ఇంధనం పొదుపుచేసే సంస్థలకు ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని విన్నవించుకున్నాయి. కన్స్యమర్ అప్లియెన్సెస్ విషయానికి వస్తే రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌మిషిన్లు, ఏసీలు ప్రస్తుతం విలాసవంతమైన వస్తువులు కాదని, వీటిని ధరలను వినియోగదారుడికి అందుబాటులో ఉంచడానికి పన్ను రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించాలని గోద్రెజ్ అప్లియెన్సెస్ బిజినెస్ హెడ్, ఈవీపీ కమల్‌నంది కోరారు. ఇంధనం పొదుపు చేసే 5స్టార్, 4 స్టాక్ ప్రొడక్టులపై పన్ను తగ్గిస్తాయని భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం కూడా మెకిన్ ఇండియాను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు నేపథ్యంలో ఇంధన పొదుపు చేసే ప్రొడక్టులపై ఫోకస్ పెట్టాలని నంది పేర్కొన్నారు.పానాసొనిక్ మాత్రం ఏసీఈ ప్రొడక్టులపై దిగుమతి సుంకం పెంచి స్థానిక తయారీ కంపెనీలను ప్రోత్సహించాలని కోరుతోంది.

గతంలో ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, మైక్రోవోవెన్‌లు, ఎల్‌ఈడీ ల్యాంప్‌లపై సుంకం పెంచినట్లు, ప్రభుత్వం వాషింగ్‌మిషన్లు, రిఫ్రిజిరేటర్లపై సుంకాలను పెంచి స్థానిక తయారీ కంపెనీలను ప్రోత్సహించాలని పానాసొనిక్ ఇండియా దక్షిణాసియా ప్రెసిడెంట్; సీఈవో మనీష్ శర్మ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇవే అభిప్రాయాలను ఫిలిప్స్ లైటింగ్ ఇండియా వ్యక్తం చేసింది. దిగుమతి ఎల్‌ఈబీ బల్స్‌పై సుంకం పెంచినట్లు అన్నీ ఫినిష్డ్ లైటింగ్ ప్రొడక్టులపై కస్టమ్స్ సుంకాన్ని పెంచాలని కోరుతోంది. ఇటీవల ఫినిష్డ్ ఎల్‌ఈడీ బల్బులపై 10 శాతం నుంచి 20 శాతానికి కస్టమ్స్ సుంకం పెంచడాన్ని ఆహ్వానిస్తున్నామని ఫిలిప్స్ లైటింగ్ ఇండియా సీఎండీ సుమితి జోషి పేర్కొన్నారు. ఇంటెక్స్ మాత్రం బ్యాటరీ దాని విడిభాగాలపై జీఎస్టి రేట్లను తగ్గించాలని కోరుతోంది. మొబైల్‌ఫోన్ తయారీకంపెనీల ప్రయోజనాలను కాపాడ్డానికి ప్రస్తుతం జీఎస్టిని 28 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని ఇంటెక్స్ సీఎఫ్ఓ రాజీవ్ జైన్ పేర్కొన్నారు. దీంతో పాటు పవర్ బ్యాంక్స్; టెలివిజన్ ట్యూనర్ కార్డ్స్, వెబ్‌క్యామ్‌లపై జీఎస్టిని 18 శాతానికి పరిమితం చేయాలని కోరారు.

ఎఫ్‌డీఐకి కేరాఫ్ ఇండియా

ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్

IACC
INDO-AMERICAN CHAMBER OF COMMERCE

హైదరాబాద్ : ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏసీసీ) ఏపీ, టీఎస్ చాప్టర్‌లు సంయుక్తంగా ఫెమాపై అవగాహన సదస్సును ఇటీవల నిర్వహించింది. దేశంలోకి వచ్చే పెట్టుబడులు.. దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు.. మారుతున్న పరిణామాల గురించి సదస్సులో పీఎన్‌పీ కన్సెల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో పీవీఆర్ రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చూస్తే భారత్ ఆకర్షణీయంగా ఉందన్నారు. ఫారిన్ ఎక్స్ఛేంజీ మేనేజ్‌మెంట్ యాక్ట్ 1999 (ఫెమా) దేశంలోని పెట్టుబడులకు అత్యంత కీలకమని అన్నారు. దేశంలోని పెద్దమొత్తంలో వస్తున్న విదేశీ పెట్టుబడులపై నిపుణులు నిబంధనలు దీనిపై అవగాహన తప్పకుండా పెంచుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందని పీవీఆర్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి సుమారు 100 ఐఏసీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం కంపెనీలునడిపే వారికి నిపుణులకు, ఇన్వెస్టర్లకు, బ్యాంకర్లకు భారత్‌లో వ్యాపార సంబంధాలు నిర్వహించాలనుకునే వారికి అవగాహన కల్పించడమని ఐఏసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. శ్రీకాంత్ బాడిగ, చైర్మన్ ఐఏసీసీ ఏపీ, టీఎస్ ఆహుతులకు స్వాగతం పలికారు.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్
రెండు స్కీంలు క్లోజ్

• ఇన్వెస్టర్ల డబ్బు వాపస్

న్యూఢిల్లీ: దేశంలోని అతి పెద్ద ఫండ్ హౌజ్ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎసీ త్వరలోనే రెండు స్మాల్‌క్యాప్ స్కీంలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. నాణ్యమైన కొన్ని షేర్లపై పెద్దమొత్తంలో డబ్బు పెట్టి షేర్లు కొనుగోలు చేస్తున్నారని ప్రకటించింది. ఈ స్కీంలలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లకు వారి డబ్బు వారికి తిరిగి ఇచ్చేస్తామని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. నీమేష్ షా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఒక ప్రకటనలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ పీఎంఎస్ స్కీం పీఐపీఈ, స్మాల్‌క్యాప్ ఫోర్టుపోలియో సీరీస్ 1, మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లు షేర్ల ధరలు చుక్కలనంటుతున్నాయని ఇన్వెస్టర్లు ఈ షేర్లపై పెద్దమొత్తంలో డబ్బులు పెట్టి షేర్లను కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన స్మాల్‌ఖ్యాప్ కంపెనీల షేర్లకు కూడా పెద్దమత్తంలో డబ్బులు పెట్టి షేర్లు కొనుగోలు చేస్తున్నారని ప్రకటనలో వివరించింది. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ పీఎంఎస్ ఇన్వెస్టర్ల సొమ్ము రూ.4,000కోట్ల వరకు నిర్వహిస్తోంది. కాగా మొత్తం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ చేతిలో అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ రూ.2.39 లక్షల కోట్ల వరకు ఉంటుంది. క్లయింట్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వారి మొత్తం డబ్బును వారికి చెల్లిస్తున్నామని ఆయన వివరించారు. కస్టమర్లు తమ పెట్టుబడులను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వెల్‌నెస్ పీఎంఎస్‌కు తరలించవచ్చునని ... హెల్త్‌కేర్‌తో పాటు దాని అనుబంధ సంసల్లో పెట్టుబడులు పెట్టుకోవచ్చునని సలహా ఇచ్చింది. దీంతోపాటు ఫ్లెక్సీ క్యాప్ అనే మరో ఆప్షన్ ఉందని తెలిపింది. తమ కంపెనీ సిద్ధాంతం ప్రకారం ఇన్వెస్టర్లు డబ్బుపై కొంత ఆదాయం కలిపి ఇవ్వాలనేది తమ సిద్ధాంతం అని ఆయన తెలిపారు. ఇలా స్కీంలను మూసివేయడం ఇదే మొదటిసారి కాదని గతంలో కూడా ఇలా మూసివేసినట్లు ఆయన వివరించారు.


• క్రిసిల్ రేటింగ్ అంచనా

బ్యాంకుల రీ క్యాపిటలజైషన్‌తో రేటింగ్
నెగెటివ్ నుంచి స్టేబుల్‌కు

CRISIL
బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India Relationships beyond banking
Canara Bank
Indian Bank

ముంబై : రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ 18 ప్రభుత్వ రం గానికి చెందిన బ్యాంకుల రేటింగ్‌ను నెగెటివ్ నుంచి స్టేబుల్‌కు సవరించింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకులకు రూ.88,139 కోట్ల మూలధనం సమకూర్చింది. బ్యాంకులకు ప్రభు త్వం మూలధనం సమకూర్చడంతో బ్యాలెన్స్ షీట్లు బలోపేతం అవుతాయని, దీంతో పాటు బ్యాంకు రుణాలకు డిమాండ్ కూడా పెరగుతుందని పేర్కొం ది. ఈ వారం ప్రారంభంలో ప్రభుత్వం 20 ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు మూలధనం సమ కూర్చింది. అవి అలహాబాద్ బ్యాం కు, ఆంధ్రా బ్యాం కు, బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంకు ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంకు, దేనా బ్యాంకు, ఐడిబీఐ బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, ఒరియం టల్ బ్యాం కు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాం కు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, యూకో బ్యాంకు, యూనైటెడ్ బ్యాంకు, యూని యన్ బ్యాం కులు రేటింగ్ ప్రస్తుతం నెగెటి వ్‌నుంచి మరిం త పైకి పోతుం దని క్రిసిట్ అంచనా వేసింది. కాగా ప్రభుత్వం ఈ ఏడాది ఎస్‌బీఐకి రూ.8,800 కోట్ల మూలధనం సమ కూర్చింది. అయితే క్రిసిల్ నివేది కలో దీనిపై మౌనం పాటించింది. రేటింగ్‌ను సవరిం చడానికి గల కారణాలు క్రిసిల్ వివరిస్తూ.. ప్రధా నంగా బ్యాం కులకు మూలధనం సమకూర్చడంతో బ్యాంకులు ఆర్థికంగా బలోపేతం కావడానికి వీలవుతుంది. దీంతో పాటు పీఎస్‌యు బ్యాంకు బాసిల్-3 నిబం ధనలు పాటిం చినట్లవుతుంది. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో బాసిల్ -3 నిబంధనలను పాటిస్తున్నారు. మొండిబకాయిలకు కేటాయింపులు పెంచుకోవచ్చునని క్రిసిల్ శుక్రవారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. తొమ్మది బ్యాంకుల బాసిల్-3 టైర్ 1 బాండ్స్ రేటింగ్ నెగెటివ్‌గా ప్రకటించింది. అవి ఆంధ్రాబ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ మహా రాష్ట్ర, ఐడిబిఐలతో పాటు మరికొన్ని బ్యాంకు లున్నాయి. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం వచ్చే ఆర్థిక సంవత్సరానికి పీఎస్ యు బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనం సమకూ రుస్తామని ప్రకటించింది. వాటిలో మొదటి విడతగా రూ.88,139కోట్ల మూలధనం బ్యాం కులకు సమకూర్చింది. ఆర్థికమంత్రిత్వశాఖ రూ.80,000 కోట్ల రీక్యాపిటలైజేషన్ బాండ్‌ల ధర నిధులు సేకరిస్తుంది. దీంతో పాటు బడ్జెట్‌లో రూ.8,139 కోట్లు బ్యాంకులకు కేటాయిస్తుంది. ప్రభు త్వం పెద్దమొత్తంలో మూలధనం సమకూర్చడంతో బ్యాంకులకు బాసిల్ -3 నిబంధనల ప్రకారం సరిప డేంత మూలధనం అందుబాటులోకి వస్తుంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తట్టుకొని నిలబడే స్థాయికిచేరుతాయని పేర్కొంది. ఈ బ్యాంకులకు మూలధనం కూడా ఆయా బ్యాంకుల పనితీరును బట్టి కేటాయింపులు జరుగుతాయి. ఇక నుంచి బ్యాం కుల కూడా బాధ్యత యుతంగా వ్యహరించి పూర్తి నైపు ణ్యంతో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తే ఇన్వెస్టర్లకు బ్యాంకింగ్ రంగపై భరోసా కలుగు తుందని క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ కృష్ణన్ సీతారామన్ అన్నారు.

అసంఘటిత కార్మికులకు
భద్రతా కార్డులు



న్యూఢిల్లీ : దేశంలో 47 కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మి కులను ఏప్రిల్ నుంచి రిజిష్టర్ చేసే పనిలో కార్మికమంత్రిత్వశాఖ పడింది. వారికి ప్రభుత్వం ఆన్‌ఆర్గనైజ్డ్ వర్కర్ ఇండెక్స్ నెంబర్ లేదా యుడబ్ల్యుఐన్ కార్డును అందజేస్తుంది. దీంతో ఈ రంగంలో పని చేస్తున్నా కార్మికులకు సామాజిక భద్రత కల్పించినట్లవుతుదని అధికారవర్గాల వారు తెలియజేశారు. ఈ కసరత్తు అంతా వచ్చే ఆర్థిక సంవత్సరానికి లేదా 2019 ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియ ముగు స్తుంది. ఆర్థికమంత్రిత్వశాఖ ప్రతిపాదించిన విధంగా అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భదత్ర పరిధిలోకి వస్తారు. కార్మికమంత్రిత్వశాఖ అసంఘటితరంగంలో పని చేస్తున్న కార్మికుల రిజిస్ట్రేషన్‌ను వచ్చే ఆర్థికసం వత్సరం అంటే ఏప్రిల్ - మార్చి 2018-19లో జరుగుతుంది. ఈ కార్మికులకు సామాజికభద్రత విషయానికి వస్తే రిటైర్మెంట్ ఫండ్ బాడీ ఈపీ ఎఫ్‌ఓతో పాటు రాష్ట్రస్థాయిలో ఆరోగ్య బీమా సంస్థ ఈఎస్ఐసీలు వీరికి లబ్ది కలుగుతాయని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసే యుడబ్ల్యుఐఎన్ కార్డుకు ఉన్న నెంబర్‌ను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేస్తారు. దీంతో కార్మికులకు ఒకేచోట అన్నీ రకాల సామాజిక భద్రత లబ్ది అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు. యూడబ్ల్యుఐఎన్ కార్డులపై పైలెట్ ప్రాజెక్టు కూడా పూర్తియింది. ఫలితాలు కూడా సంతృప్తికరంగా ఉన్నాయి. ఇక అసలు విషయానికి వస్తే అసంఘటితరంగంలో పనిచేసే కార్మికులు ఈపీ ఎఫ్ఓ కింద డబ్బు ఎవరు చెల్లిస్తారనేది అసలు సమస్యగా మారింది. సాధారంగా ఈస్కీంలకు ఉద్యోగులతో పాటు యాజమాన్యాలుకొంత మొత్తం సామాజికభద్రత స్కీం కింద కొంత డబ్బు చెల్లి స్తుంటాయి. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మి కులు యజమాని అంటూ ఎవరూ ఉండరు కాబట్టి దీనికి ఏదో ఒక పరిష్కారమార్గాన్ని ప్రభుత్వం కను గొంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

'పద్మ' అవార్డుల ఎంపికలో

తెలంగాణకు అన్యాయం

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ ఎంపీ వినోద్ లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పద్మ అవార్డుల ఎంపికలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని టీఆర్ఎస్ ఎంపీ బి. వినోద్‌కుమార్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అవార్డుల ఎంపికలో కొన్ని రాష్ట్రాలకే పెద్ద పీట వేయడం సరికాదని ఆయన తెలిపారు. పద్మ అవార్డుల ఎంపికపై తెలంగాణకు అన్యాయం జరిగిన విషయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడికి ఎంపీ వినోద్ శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణాలో చాల మంది ప్రతిభగల కవులు, కళాకారులు చాల మంది ఉన్నారని , వారికి ప్రతిష్టాత్మకమైన పద్మ అవార్డులు రాకపోవడం భాద కలిగించిందని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించి.. మిగతా రాష్ట్రాలను పట్టించుకోకపోవడం సంప్రదాయం కాదన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు పంపిన విషయాన్ని ప్రధాన మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్‌లో అన్ని రాష్ట్రాలకు సమతుల్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హైదరాబాద్‌లో

సెల్ బయోలజీ-2018 సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. ఈనెల 27 నుంచి 31 వరకు జీవకణ శాస్త్రం - 18 సదస్సు హైదరాబాద్‌లో జరుగుతుంది. మొదటిసారిగా ఈ సదస్సుకు భారత్ ఆతిథ్యమిస్తుంది. శామీర్‌పేటలోని లియోనియో రిసార్ట్‌లో ఐదు రోజులపాటు ఈ సదస్సు జరుగుతుంది. ఇండియన్ సొసైటీ ఆఫ్ సెల్ బయాలజీ, ఇంటర్నేషనల్ ఫెడ రేషన్ ఫర్ సెల్ బయాలజీ, ఏసియన్ పసిఫిక్ ఆర్గనైజేషన్ ఫర్ సెల్ బయాలజీలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించనున్నాయి. నోబెల్ పురస్కార గ్రహీత మార్టిన్ చాల్ఫీ 27న ఈ సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తారు. 30 దేశాల నుంచి 300 సంస్థల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, దాదాపు 1200 మంది విద్యార్థులు కూడా ఈ సదస్సులో పాల్గొంటారు. కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి సుజనా చౌదరి, రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు హాజరవుతారు.

సగటూరులో జగన్ జెండా వందనం



ఓజిలి, ప్రభన్యూస్: నెల్లూరు జిల్లా ,ఓజిలి మండలం సగుటూరు గ్రామంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండాను ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ఎగురవేశారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఓజిలి మండలం సగుటూరులో వైఎస్ జగన్ గురువారం రాత్రి బస చేశారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఒక్కరోజు తన పాదయాత్రకు విరామం ప్రకటించారు. నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సూళ్లూరుపేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య, జెడ్పీ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, గూడూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మేరిగ మురళి, సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాయుడుపేట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు 786 రఫీ, మహిళా నాయకురాలు రాజసులోచనమ్మ, ఓజిలి మండల అధ్యక్షులు తిరుగుమల్లి బాబురెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గుంట మడుగు రవీంద్రరాజు, షేక్ జానీ, తిరుపాలయ్య, కొండూరు ప్రభాకర్‌రాజు తదితరులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సగుటూరు శిబిరం వద్దకు వైఎస్ విజయమ్మ, భారతి

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఓజిలి మండలం సగుటూరు వద్ద ఏర్పాటు చేసిన శిభిరంలో రెండు రోజులుగా బస చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాదయాత్రకు విరామం ప్రకటించిన వైఎస్ జగన్ సగుటూరు శిబిరం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి వైఎస్ భారతి, తల్లి విజయమ్మలు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గన జగన్ ఉంటున్న సగుటూరు శిబిరం వద్దకు చేరుకున్నారు.

'పశ్చిమ' రహదారి రక్తసిక్తం

బస్సు, లారీ ఢీ- ఐదుగురు మృతి



తాడేపల్లిగూడెం, ప్రభన్యూస్ ప్రతినిధి: పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం కొవ్వూరు నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును నల్లజర్ల మండలం అచ్యుతాపురం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఒక లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఈ ప్రమాదంలో మృతిచెందారు. కండక్టర్‌తో సహా ఆరుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. మృతుల్లో ముగ్గురు తూర్పుగోదావరిజిల్లాకు చెందిన వారు. కాగా నిడదవోలులో ప్రస్తుతం నివాసముంటున్న గేలం లక్ష్మి (50), కాపుశెట్టి జ్యోతి (33), అఖిల సత్యసంతోషి (13), శివసాయి (11)లు, దూబచర్ల గ్రామానికి చెందిన పళ్లా సావిత్రిమ్మ (60)గా గుర్తించారు. క్షతగాత్రుల్ని తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ప్రైవేటు ఆసుపత్రులకు పంపించారు. లారీ టైరు పంక్చర్‌కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. కాగా గేలం లక్ష్మి కుమార్తె జ్యోతి, ఆమె పిల్లలు సంతోషి, శివసాయిలు వీరంతా ద్వారకాతిరుమల వెళ్ళి స్వామివారి దర్శనం చేసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

జోరుమీదున్న కల్యాణ పథకాలు

• తగ్గిన బాల్య వివాహాలు • స్కూళ్లలో పెరిగిన బాలికల ఎన్‌రోల్‌మెంట్ • సానుకూల ఫలితాలను ఇస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ • 1.08 లక్షల మందికి రూ.1807 కోట్ల పంపిణీ • నగదు సహాయం రూ.లక్షకు పెంచే యోచన




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయి. ఈ పథకాలు అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బాల్య వివాహాలు తగ్గాయి. మధ్యలో బడి మానేసే బాలికల సంఖ్య తగ్గింది. ఆర్ధిక స్థోమత లేని వర్గాలు కూడా 18 సంవత్సరాలు నిండేంత వరకు బలికలకు వివాహాలు చేసేందుకు ముందుకు రావడం లేదు. గురుకుల బాలికా పాఠశాలలు ఏర్పాటు కావడంతో బాలికలను బడికి పంపించడానికి పేద వర్గాలు మొగ్గు చూపుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల కోసం కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలను 2014లో ప్రవేశపెట్టింది. బడి మానేసే బాలికల సంఖ్యను కుదించడం, 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు జరగకుంగా చూడటం అనే ఉద్దేశంతో పథకం అమలు జరుపుతున్నారు. ఈ పథకం కింద 18 ఏళ్లు నిండిన బాలిక వివాహానికి ప్రభుత్వం ఇచ్చే ఆర్ధిక సహాయం రూ. 50 వేల నుండి రూ. 75 వేలకు పెంచింది. వచ్చే ఆర్ధిక సంవత్సరం నుండి లక్ష రూపాయలకు పెంచాలని ప్రతిపాదించింది. బడ్జెట్ సమావేశాల్లో ఈ మేరకు అధికారిక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. పథకం ప్రారంభించిన 2014 -15 ఆర్ధిక సంవత్సరంలో లబ్దిదారుల సంఖ్య 13,727 కాగా ప్రస్తుత ఆర్ధిక సంవత్సరం డిసెంబర్ నాటికి లబ్దిదారుల సంఖ్య 1,08,966కు చేరింది. కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకం అమలుకు ఇప్పటి వరకు రూ. 1807 కోట్లు ఖర్చు చేశారు. ఈ పథకాల అమలుపైన సంబంధిత అధికారులు నిర్వహించిన సర్వేలో ఆశించిన ఫలితాలు వస్తున్నట్లు గుర్తించారు. పథకం అమలులోకి వచ్చిన తర్వాత 15 నుండి 17 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలు 76 శాతం మంది బడికి వెళుతున్నారని అధికారులు గుర్తించారు.

బాల్య వివాహాలు 2014 -15లో 316 కాగా 2017 -18 నాటికి 316కు తగ్గాయి. బడికి వెళ్లే బాలికల సంఖ్య 23 శాతం పెరిగింది. అదే విధంగా బాలుర సంఖ్య 46కు పెరిగింది. ప్రభుత్వం ఆదుకుంటుందనే భరోసా, పిల్లల చదువు భారం కాదనే నమ్మకంతోనే పేద వర్గాలు తమ పిల్లలను బడికి పంపించడానికి ముందుకొస్తున్నారు. మధ్యలో బడి మానేపించాలనే ఆలోచన చేయలేక పోతున్నారు. గ్రామీణ పేదల ఆర్ధిక పరిస్థితులు మెరుగుపడటానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, పేద పిల్లల చదువులు, వివాహాల బాధ్యతలను ప్రభుత్వాలు స్వీకరించడం లాంటి కారణాల వల్ల బడి మానేసే వారి సంఖ్య తగ్గుతుందని, బాల్య వివాహాల సంఖ్య కూడా తగ్గిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీ విద్యార్ధుల కోసం పెద్ద సంఖ్యలో గురుకుల పాఠశాలలను తెరిచింది. నాణ్యమైన విద్యను అందిస్తుంది.

ఇటీవలి కాలంలో పేదల గూడాల్లో చదువుకుంటున్న బాలబాలికల సంఖ్య పెరిగిపోతుంది. మంచి ప్రయోజకులు అవుతున్న వారి సంఖ్య పెరగడంతో పేదల ఆలోచనల్లో మార్పులు చూస్తున్నాం అని అధికారులు పేర్కొంటున్నారు. షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు తమ పిల్లల చదువుల కోసం పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదనే సంకేతాలు నిరుపేదలకు చేరువు కావడంతో పిల్లల మంచి భవిష్యత్ గురించి పేదలు ఆలోచిస్తున్నారని వెల్లడించారు. రాబోవు కాలంలో బడి మానేసే పేద విద్యార్థులు ఉండరాదనే ఆలోచనతో మరిన్ని పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. పేద కుటుంబాల ఆర్ధిక పరిస్థితులు మెరు గుపర్చడం. బడీడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా చూడటం, వారికి పౌష్టికాహారం, దుస్తులు, పుస్తకాలు అందించడం లాంటి కార్యక్రమాలు విస్త రిం చబో తున్నారు. గ్రామీణ పేద కుటుంబాల వివరాలను సేకరించి వారి పిల్లలకు నాణ్య మైన విద్యను అందించేందుకు దోహదపడే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్ల డించారు.

జనసేనాని ఏపీ టూర్‌కు విస్తృత ఏర్పాట్లు

• 27, 28, 29 తేదీల్లో అనంతపురం జిల్లాలో పర్యటన • ఆహ్వానం ఉంటేనే ప్రజావేదికలోకి అనుమతి • నేడు అనంతపురంలో పార్టీ కార్యాలయానికి భూమిపూజ • 28న కదిరి, 29న పుట్టపర్తిలో పర్యటన • భారీగా పోలీసు బందోబస్తు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అనంతపురం జిల్లాలో కరవుపై అధ్యయనం, అవగాహన కోసం వివిధ కార్యక్రమంలో పాల్గొంటారు. 27వ తేదీ ఉదయం అనంతపురం నగరానికి చేరుకుంటారు. 11,20 నిమిషాల తర్వాత జనసేన పార్టీ అనంతపురం జిల్లా కార్యాలయానికి భూమిపూజ చేస్తారు. అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఈ కార్యాలయం ఏర్పాటు కాబోతోంది. ఈ కార్యక్రమానికి వచ్చిన వారితో ముచ్చటిస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగే జనసేన ప్రజా వేదికలో సీమ కరవుకు పరిష్కార మార్గాలు అనే అంశంపై రైతులు, వ్యవసాయ, నీటిపారుదల నిపుణులు పాల్గొనే గోష్టిలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కేవలం ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు. అనంతరం స్థానిక పార్టీ ముఖ్య లు, కార్యకర్తలతో మాట్లాడతారు. 28వ తేదీ కదిరి వెళతారు. 11 గంటలకు కదిరి చేరుకుంటారు. నరసింహస్వామిని దర్శించుక న్న అనంతరం కరవు పరిస్థితులపై స్థానికులతో మాట్లాడతారు. అక్కడ ప్రజా సమూహాన్ని ఉద్దేశించి మాట్లాడతారు. అక్కడ్నించీ పుట్టపర్తికి ప్రయాణమవుతారు. మధ్యాహ్నం 2.30 కు హనుమాన్ జంక్షన్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 4.30కి పుట్టపర్తి చేరుకుని సత్యసాయి మందిరం, మంచినీటి పథకం, ఆసుపత్రిని సందర్శిస్తారు. రాత్రికి పుట్టపర్తిలో బస చేస్తారు. 28వ తేదీ ఉదయం పుట్టపర్తి నుంచి ఉదయం 8 గంటలకు ధర్మవరానికి ప్రయాణమవుతారు. 10 గంటలకు ధర్మవరం చేరుకుంటారు. చేనేత సహకారులతో మాట్లాడతారు. అక్కడి నుంచి హిందూపురం వెళతారు. మధ్యాహ్నం 2 గంటలకు జనసేన కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా వున్న జనసేన కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరవుతారు. 3.30 గంటలకు బీకల్యాపూర్‌కు ప్రయాణమవుతారు. సాయంత్రం 5 గంటలకు సి.వి.వి.ఇన్స్టిట్యూట్‌కు వెళతారు. అక్కడ్నించీ హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

ఏపీలో గణతంత్ర వేడుకలు



అమరావతి, ఆంధ్రప్రభ: సంక్షోభాలను సావకాశాలుగా మలుచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్రతిహతంగా ముందుకు సాగుతోందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అనేక సమస్యలు ఎదురైనప్పటికి సమర్ధవంతమైన నాయకత్వం ఫలితంగా సవాళ్ళను అధిగమిస్తోందని పేర్కొన్నారు. దేశంలోనే వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ ముందుందని ఉద్ఘాటించారు. భారత 69వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నరసింహం ప్రసంగిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. విభజన కష్టాలను ఇంకా ఏపీ ఎదుర్కొంటునే ఉన్నదని వ్యాఖ్యనించారు. ఎందరో మహానీయుల త్యాగఫలితంగానే స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల శ్రేయస్సు కోసం అమలు చేస్తోందని వినూత్నమైన కార్యక్రమాలను శ్రీకారం చుట్టి నూతన పంథాలో పయనిస్తోందని పేర్కొన్నారు.

సంచార జాతులకు సంక్షేమం దూరం

• ఇప్పటికీ గుర్తింపులేని జాతులు 22 • 1.80 లక్షల మందికి ఎటువంటి సర్టిఫికెట్ లేదు • నాణ్యమైన విద్యకు దూరమైన సంచార జాతులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో సుమారు 30 శాతం నిధులు అన్ని రకాల, అన్ని వర్గాల వారి సంక్షేమ కోసం ఖర్చు చేస్తున్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీ, వృద్ధులు, కళాకారులు, దివ్యాంగులు కోట్ల మంది ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అనుభవిస్తున్నారు. కానీ సంచార జాతులుగా ఉన్న వారు మాత్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు. సంచార జాతుల వారికి ఎటువంటి గుర్తింపు కార్డు లేకపోవడంతో వారు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదు. వారికి ఓటరు గుర్తింపు కార్డు లేదు, ఆధార్ లేదు, రేషన్‌కార్డు లేదు. ఇలా ఏ గుర్తింపుకార్డు లేకపోవడంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ 22 సంచార కులాల వారు ఏ జాబితాలోనూ లేరు. ఇటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన ఏ జాబితాలోనూ లేరు. ఏ జాబితాలో లేకుండా వారు ఓసీ జాబితాలో కొనసాగుతున్నారు.

గుర్తింపులేని 22 సంచార జాతులు

రాష్ట్రంలో 22 సంచార జాతులకు గుర్తింపులేదు. అన్ని జిల్లాల్లో కలిపి సుమారు 1.80 లక్షల మంది జనాభా ఉంటారు. వారికి ఎటువంటి గుర్తింపు కార్డులు లేవు. వీరికి గుర్తింపు కార్డులను ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందని సంచార జాతుల నేతలు కోరుతున్నారు. అలా గుర్తింపును ఇచ్చి వారి పిల్లలకు చదువులు, వారు ఆర్ధికంగా ఎదగడానికి రుణసాయం చేయాలంటున్నారు. గురుకులాల్లో ప్రత్యేకంగా వీరి పిల్లలకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండానే అడ్మిషన్లు ఇవ్వాలని కోరుతున్నారు. యూనివర్సిటీ స్థాయిలో వీరికి ప్రత్యేకంగా కోటాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సంచార జాతుల ఊసులేని బీసీ కమిటీ నివేదిక

కొద్ది రోజుల క్రితం బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు రాష్ట్రంలోని బీసీ ప్రజాప్రతినిధులు అందరూ కలిసి చర్చించి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికను రూపొందించాలని సూచించారు. అన్ని పార్టీల తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో అసెంబ్లీ హాల్‌లో సమావేశం అయి మూడు రోజులపాటు చర్చించారు. చర్చించిన అంశాలపై మంత్రులు జోగు రామన్న, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు కలిసి నివే దికను రూపొందించారు. త్వర లోనే కమిటీ నివేదికను ముఖ్య మంత్రికిసమర్పించనున్నారు. కమిటీ నివేదికను ప్రాథ మికంగా సీఎం దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో మరికొన్ని మార్పులు చేర్పులు చేయాలని సూచించగా తుది నివేదికను జనవరి నెలాఖరులోగానీ, ఫిబ్రవరి మొదటి వారంలో గానీ సీఎంకు సమర్పించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఈ కమిటీ నివేదికలో సంచార జాతులకు సంబంధించి ఒక్క అంశం కూడా లేదు. రాష్ట్రంలో ఉన్న సంచార జాతుల్లో సుమారు 22 కులాల వారకి కుల సర్టిఫికెట్లను కూడా ఇవ్వడం లేదు. కారణం వారి కులం బీసీ జాబి తాలో లేదు, ఎస్సీ, ఎస్టీ జాబితాలో లేదు. అసలు వారికి ప్రభుత్వం నుంచి ఎటు వంటి గుర్తింపు కార్డు లేదు. దీంతో వారిని జనాభా లెక్కల్లో కూడా గుర్తించడం లేదు. సంచార జాతులకు ప్రత్యేకకార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అసెంబ్లీలో ప్రకటించినప్పటికీ దాని గురించి కమిటీ నివేదికలో ప్రస్తావించలేదు.

అలాగే బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నివేదికలో చేర్చారు. కానీ అందులో సంచార జాతుల విషయాన్ని ప్రస్తావించలేదు. బీసీలకు ఇప్పటికే 119 గురుకులాలను ఏర్పాటు చేశామని, మరో 119 గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గురుకులాల్లో సంచార జాతుల పిల్లలు చేరడానికి ప్రత్యేక అవకాశం కల్పించలేదు. కొత్తగా ఏర్పాటు కాబోయే వాటిలో కూడా అటువంటి ప్రతిపాదన చేయలేదు. దీంతో సంచారజాతుల వారికి ఎలా న్యాయం జరుగుతుందని సంచార జాతుల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఎంబీసీలకు ప్రత్యేకకార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ. 1000 కోట్లు కేటాయించారు. ఎంబీసీలు ఎవరనేది ప్రభుత్వం ఇప్పటి వరకు తేల్చలేదని, కానీ చారిత్రక నేపథ్యం ఉన్న సంచార జాతులను మాత్రం గుర్తించడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచార జాతుల వారికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని అందుకు రూ. 5 కోట్లు కేటాయిస్తామని తెలంగాణ ఏర్పాటైన తరువాత జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న ప్రకటించారని సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు వై వెంకటనారాయణ గుర్తు చేశారు. ఇప్పుడు ఎంబీసీలకు కేటా యించిన రూ. 1000 కోట్లు ఎంబీ సీలు ఎవరో తెలియక ఖర్చు చేయకుండా మురి గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

తిట్టుడు కులాల పేరు మార్చాలి

సంచార జాతుల్లోని చాలా కులాలు తిట్టుడు కులాలుగా ముద్రపడ్డాయని సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు వై వెంకటనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మొండి, గంగిరెద్దుల, బుడబుక్కల, చిందుల, బాగోతుల వంటి కులాలు ప్రధానంగా ఇటువంటివి ఉన్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు, కొన్ని సందర్భాల్లో మంత్రులు కూడా కులాలను అగౌరవ పరిచేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుడబుక్కల వేషాలని, గంగిరెద్దుల్లా అని మర్యాదలేకుండా సంభాషిస్తున్నారని ఇటువంటి వారిపై చర్యలు తీసుకునేలా అట్రాసిటీ చట్టంలాగా తమకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరుతున్నారు. అదేవిధంగా తిట్టుడు కులాలుగా ఉన్న వాటి పేర్లను మార్చుకునేలా వెసులుబాటును ఆయా కులాలకు కల్పించేలా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 సంచార జాతులు ఏ జాబితాలో లేవని, వాటిని ఆయా కులాలు చేస్తున్న వృత్తుల ఆధారంగా ఇప్పటికే బీసీల్లో ఉన్న కులాల మాదిరిగా చేర్చేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంచార జాతులకు తగిన న్యాయం చేయాలని కోరుతూ తాము ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సంచారజాతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసుకున్నామని, అందుకు సంబంధించిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

రాష్ట్రంలో అరుణాచల్ రిజిస్ట్రేషన్ బస్సులు

• పట్టించుకోని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు • భారీగా ఆర్టీసీ ఆదాయానికి గండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అరుణాచల్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ బస్సులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో యదేచ్ఛగా తిరుగుతున్నాయి. ప్రైవేటు బస్సు యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించి రెండు రాష్ట్రాల్లో తిప్పుతున్నప్పటికీ వాటిని అదుపుచేయలేక పోతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో టిఎస్ఆర్టీసీ, ఏపిఎస్ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుంది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు గత జూన్ మాసంలో అరుణాచల్ ప్రదేశ్ రిజిస్ట్రేషన్ బస్సులను నిషేధించాయి. అక్రమంగా తిప్పుతున్నారంటూ కేసులు పెట్టాయి. నిఘాను కట్టుదిట్టం చేయడంతో బెర్తు బస్సులను యాజమాన్యాలు గ్యారేజీలకే పరిమితం చేశాయి. సంక్రాంతికి కొద్ది రోజుల ముందు నుంచి తిరిగి ఈ బస్సులు రోడ్డెక్కాయి. హైదరాబాద్, విజయవాడ నుండి దూర ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ఈ విషయం రెండు రాష్ట్రాల ఆర్టీసీ, ఆర్టీఏ అధికారులకు తెలిసినప్పటికీ తమకేమీ పట్టనట్టుగా ఉంటున్నారు. బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్టణం ప్రాంతాలకు ఆరుణాచల్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న బస్సులు హైదరాబాద్‌లోని మియాపూర్, బిహెచ్ఇఎల్, కూకట్‌పల్లి, లకిడికాపూల్, అమీర్‌పేట నుండి అధికంగా నడుస్తున్నాయి. సాధారణ సెలవు రోజుల్లో ఈ బస్సులు మరింత అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. ఆర్టీఏ నిబంధనల్లో ఎలాంటి మార్పులు జరగలేదు.అక్రమాలన్ని సక్రమం అని భావించి ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నట్టుగా ఆర్టీసీ కార్మిక సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతున్నప్పటికీ ప్రభుత్వాలు తమకేమీ తెలియనట్టుగా ఉండటంలోని ఆంతర్యం ఆర్థం కావడం లేదని అంటున్నాయి. ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోతున్నప్పటికీ ప్రైవేటు బస్సులను నియంత్రించలేక పోతున్నారని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని చిరనామాతో అదే రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని, అక్కడే పర్మిట్లు పొంది, వేరే ప్రాంతాల్లో తిరగడం అక్రమం అని గత జూన్‌లో తెలంగాణ ఆర్టీఏ అధికారులు తెల్చి చెప్పారు. వాటి అనుమతులు రద్దు చేశారు. బస్సుల్లో సీట్ల ఏర్పాటు తెలంగాణ రవాణా చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి బస్సులు తెలుగు రాష్ట్రాల్లో 650 నుండి 860 వరకు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ బస్సుల నుండి త్రైమాసిక పన్నులను వసూలు చేయడం నిలిపివేశారు. వాటికి అనుమతి లేనందున రోడ్డెక్కితే జప్తు చేయాలని ఆదేశించారు. కొన్ని బస్సులను జప్తు చేశారు. మరికొన్ని బస్సులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ చర్యలతో బస్సులను ప్రైవేటు యాజమాన్యాలు గ్యారేజీల నుండి బయటికి తీయడానికి భయపడిపోయాయి. ఈ వ్యవహారం అనేక మలుపులు తిరిగి చివరగా సంక్రాంతి నుండి అరుణాచల్ ప్రదేశ్ రిజిస్ట్రేషన్ బస్సులు యదేచ్ఛగా రెండు తెలుగు రాష్ట్రాలలో తిరుగుతున్నాయి. ప్రైవేటు బస్సులు సీటుకు రూ. 3,500 చొప్పున ఏడాదికి రూ. 5.50 లక్షల వరకు ఆర్టీఏకు చెల్లించవలసి ఉంటుంది. ఈ విధంగా వచ్చే ఆదాయానికి గండి పడుతుందని భావించి ఆంక్షలను సడలించి ఉంటారని ఆర్టీసీ కార్మిక సంఘాలు భావిస్తున్నాయి. విజయవాడ కేంద్రంగా అరుణాచల్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగిన బస్సులు అధికంగా వివిధ దూర ప్రాంతాలకు తిరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో మౌనంగా ఉండటంతో తెలంగాణ అధికారులు కూడా స్పందించడం లేదనే ప్రచారం జరుగుతున్నది.

ఇండో అమెరికన్‌కు జైలు శిక్ష

హవాలా వ్యాపారం చేశాడని నిర్ధారించిన కోర్టు

వాషింగ్టన్: అమెరికాలో హవాలా వ్యాపారానికి పాల్పడ్డ ఇండో-అమెరికన్ హరిందర్‌సింగ్‌ను అక్కడి కోర్టు దోషిగా తేలుస్తూ తీర్పు చెప్పింది. కోర్టులో 32 ఏళ్లున్న హరీందర్ సింగ్ అలియాస్ సోను కూడా తన నేరాన్ని ఒప్పుకున్నాడు. హరీందర్ హవాలా వ్యాపారం చేస్తూ.. మిలియన్ల కొద్దీ డాలర్లను డ్రగ్, నార్కొటిక్స్ సరఫరాదారులకు అక్రమంగా చేరవేసే కుట్రలో పాలుపంచుకున్నాడని కోర్టు నిర్ధారించింది. హవాలా వ్యాపారం, అక్రమంగా డబ్బును బదలీచేసే వ్యాపారం, నార్కొటిక్ సరఫరాదార్లకు డబ్బు అందించేందుకు కుట్రలున్న మూడు నేరాల కింద కోర్టు హరీందర్‌కు శిక్షను విధిస్తుంది. హవాలా కేసు కింద కనీసం 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది. దీనికి అదనంగా మిగతా రెండు నేరాలకు గాను ఐదేసి సంవత్సరాల చొప్పున జైలుశిక్షను విధించనుంది. ఈ శిక్షలను ఏప్రిల్ 30 నుంచి ప్రారంభం కానుంది. 2015లో కేసు నమోదుచేసిన స్థానిక పోలీసులు 18 మందిని నిందితులుగా పేర్కొన్నారు. అనంతరం సాగిన విచారణలో గ్రాండ్ జ్యూరీ వీరిని దోషులుగా కోర్టు తేల్చింది. డ్రగ్స్ సరఫరా, డాలర్ల మార్పిడి, సరఫరాకు సంబంధించి అమెరికాలో బయటపడ్డ అతిపెద్ద హవాలా కేసు ఇదేనని గ్రాండ్ జ్యూరీ అభిప్రాయపడింది.

ఆ పటేల్‌కు.. న్యూజెర్సీ బార్ అసోసియేషన్‌లో చోటు

వాషింగ్టన్: చిన్నతనంలో ఎటువంటి అధికార పత్రాలు లేకుండా అమెరికాకు వలసవచ్చిన భారత సంతతికి చెందిన పార్థివ్ పటేల్ న్యూజెర్సీ బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందాడు. డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్(డీఏసీఏ) కింద బార్ అసోసియేషన్‌లో పొందిన తొలి వ్యక్తి పటేల్. ఒబామా హయాంలో ఈ విధంగా సరైన అధికార పత్రాలు లేకుండా చిన్నతనంలో వలస వచ్చిన వారిని దేశం విడిచిపోయే అవసరం లేకుండా డీఏసీఏ చట్టం రక్షించేది. కాగా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డీఏసీఏ ఉపసంహరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది మార్చినుంచి అమల్లోకి రానుంది. ఈ చట్టంలో తెచ్చిన మార్పులవల్ల అనేక వేలమంది భారత సంతతికి చెందిన ఇండో అమెరికన్లు ప్రభావితం కానున్నారు.

పటేల్ 2016లో న్యూజెర్సీ, పెన్సిల్వేనియాలో బార్ పరీక్షలు పాస్ అయ్యాడు. శుక్రవారం, న్యూజెర్సీ అటార్నీ గుర్‌బిర్ గ్రేవల్ సమక్షంలో పటేల్ న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా గుర్‌బిర్ అమెరికా చరిత్రలోనే తొలి సిక్కు అటార్నీ జనరల్. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ కూడా హాజరయ్యారు. చిన్నతనంలోనే అమెరికాకు అక్రమంగా తీసుకురాబడ్డ పటేల్ వంటి అమెరికా డ్రీమర్ల రక్షణలకు అన్ని విధాల ప్రయతన్నం చేస్తామని గుర్‌బిర్ అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మర్ఫీ మాట్లాడుతూ.. ట్రంప్ సర్కారు నిర్ణయాలకు వ్యతిరేకంగా న్యూజెర్సీ సమాఖ్య రాష్ట్రాల హక్కుల ఉల్లంఘన కేసును దాఖలు చేస్తామని అన్నారు.

సా...గుతున్న నయీం కేసు

- శేషన్న ఏడున్నాడో.. డైరీ ఎక్కడుందో
- సాక్ష్యాధారాలు లభిస్తే చర్యలు
- కొనసాగింపునకు తావిస్తున్న ఉన్నతాధికారుల వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు టీవీ సీరియల్స్ మాదిరిగా నయీం కేసు దర్యాప్తు ఎన్నటికీ పూర్తయ్యేనో...!? అన్న అనుమానాలు తొంగి చూస్తు న్నాయి. కరడుగట్టిన నరహంతకుడు గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఎప్పటికప్పుడు ఆసక్తికర విషయా లు వెలుగులోకి వస్తున్నా ఈ కేసు దర్యాప్తు మాత్రం ముందుకు సాగడం లేదు. పోలీసు ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ నయీం హతమైనప్పట్నించీ పరారీలో ఉన్న నయీం గ్యాంగ్‌లో నెం.2గా వ్యవహరిస్తున్న శేషన్నను సహా మరో నలుగురి ఆచూకీ కనిపెట్ట డంలో సిట్ పూర్తిస్థాయి వైఫల్యం చెందింది. శేషన్న ఆచూకీ దొరికిందని అడపాదడపా లీకులిస్తూ దర్యాప్తు కొనసాగు తోందన్న సంకేతాలను మాత్రం సిట్ అందిస్తుండటం గమనార్హం. నయీం హతుడైనప్పట్నించీ నయీంకు సంబంధించిన అనుచరులు, బంధు వులను అరెస్టు చేయడంలో దూకుడు ప్రదర్శించినా.. కేసులో ప్రమేయమున్న రాజకీయ నేతలు, పోలీసు ఉన్నతాధికారులపై చర్యలకు సాహసించిన పాపాన పోలేదన్న ఆరోపణలు ఆ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ ఎదుర్కొంటోంది. కాగా, సామాజిక మీడియాలో గ్యాంగ్‌స్టర్ నయీంతో అంటకాగిన పోలీసు అధికారుల ఫోటోలు దర్శనమివ్వడంతో పోలీసు శాఖ ప్రతిష్ట మంటగలిసే అవకాశం ఉందన్న దృష్ట్యా దాదాపుగా 25 మంది కిందిస్థాయి పోలీసు సిబ్బందిపై చర్యలతో సిట్ సరిపుచ్చిందన్న ఆరోపణలు సైతం మిన్నంటాయి. పీపుల్స్‌వార్ పార్టీతో విభేదించి పోలీసు కోవర్టుగా మారిన నయీం కొందరు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేత లు, జర్నలిస్టుల సహకారంతో అనతి కాలంలో గ్యాంగ్‌స్టర్ నయీంగా అవతారమెత్తాడు. ఓ కరంగా చెప్పాలంటే సమాంతర ప్రభుత్వాన్నే నయీం నడిపాడని తెలుస్తోంది. నయీం కేసు దర్యాప్తులో పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలపై చర్యలు ఏవీ? అన్న మీడియా ప్రశ్నలకు నయీం హతుడవ్వడమే పెద్ద ఎచీవ్‌మెంట్‌గా డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొనడం గమనార్హం. ఇటూ నయీం కేసులో పెద్దల జోలికి పోకుండా.. అటూ నయీం బాధితులకు సహాయం అందించే విష యంలోనూ సిట్ చేతులెత్తేసిందా? అన్న అనుమా నాలను పలువురు వ్యక్తపరుస్తున్నారు. నయీం హతుడైన వెంటనే పెద్ద పెట్టున నయీం డెన్‌లపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సందర్భంగా నయీం దురాగతాలకు సంబంధించిన పలు ఆధారాలను సైతం పోలీసులు సేకరిం చినట్లు వార్తలొచ్చా యి. తాను హతుడైనా తనతో అంటకాగిన వాళ్లను సైతం నయీం వదిలేవాడు కాదని, తనతో అంటకాగిన వారి ఫోటోలను, వారితో కలిసిన సందర్భాలను ఉదహరిస్తూ ఏకంగా డైరీలో ఉదహరించినట్లుగా పోలీసు అధికారులే అప్పట్లో వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ డైరీని మాత్రం సిట్ అధికా రులు ఇంతవరకూ బయటపెట్టలేదు. యాదాద్రి, భువనగిరి, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో నయీం చెలరేగిపోయాడు. తన భూదందాను ఇతర రాష్ట్రాల క ు వ్యాపింపజేశాడు. పోలీసుల కళ్లుగప్పి తిరగ డంలోనూ నయీం చతురతను కనబర్చేవాడు. ఎన్‌ఆర్‌ఐ లను బెదరించడంతో నయీం దందా ప్రపంచవ్యాప్తంగా విస్తరించినట్లైంది.

అమ్మాయిల అక్రమరవాణా, ఆయు ధాల రవాణా, ఉగ్రవాదులతో లింకులకు సంబంధించి నయీం ప్రమేయంపై సైతం సిట్ ఆరా తీసిందని, అందుకు సంబంధించి కీలకమైన సమాచారాన్ని సేకరించిందని సైతం అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఇక నయీం హత్యో దాంతాలకు సంబంధించి చెప్పదల్చుకుంటే ప్రజా గాయకురాలు బెల్లిలలిత హత్యోదంతాన్ని పరాకాష్టగా చెప్పవచ్చు. తనకెదురొస్తాడని భావించిన సొంత బావనే నయీం తన కుటుంబసభ్యుల సహకారంతో అంతమొందించాడు. దాదాపుగా నయీం 25 హత్యలు చేసినట్లు సిట్ గుర్తించింది. ఇంకా అనేక హత్యలకు పాల్పడి ఉండవచ్చున్న అనుమానాన్ని సైతం సిట్ వ్యక్తపర్చిన సంగతి తెలిసిందే. నయీం కూడబెట్టిన అక్రమాస్తుల విలువ దాదాప ు 10వేల కోట్ల పైమాటేనని సైతం అప్పట్లో వార్తలొచ్చాయి. ఇతర రాష్ట్రాల్లోనూ నయీం దందా కొనసాగించిన నేపథ్యంలో ఈ కేసును సీబీఐకి అప్ప గించాలన్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల డిమాండ్ చేసినా.. ఎట్టి పరిస్థితుల్లో ఈ కేసు సీబీఐకి అప్పగించే ప్రసక్తే లేదని ప్రభుత్వం తేల్చిచెప్పిన సంగతి విదితమే. సాక్ష్యాధారాలు లభిస్తే చర్యలంటూ పోలీసు బాస్‌ల మాటలు దర్యాప్తు కొనసాగింపుకు తావిచ్చేవిగా ఉన్నాయని అంటున్నారు.

బెల్లి లలితకు కారణమిదే

ముషీరాబాద్ జైల్లో ఉన్న సమయంలోనే మాజీ మావో యిస్టు నయీం పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మార్చిన ఘటనలో తన పాత్ర లేదని ఈ విష యంలో ఆ సమయంలో ఉన్న పోలీసు ఉన్నతాధి కారులు చేసి ఉండొచ్చని భువనగిరిలో డీఎస్పీగా పనిచేసి రిటైరైన రవీందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బెల్లి లలిత హత్య కేసు విచారణ సందర్భంగా తాను ఒక్కసారి నయీంను విచారించినట్లు రవీందర్‌రెడ్డి చెప్పారు. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలోని పలు ప్రాంతా ల్లో వివిధ హోదాల్లో పనిచేసి డీఎస్పీగా రిటైరైన రవీందర్‌రెడ్డి తన ఉద్యోగ నిర్వహణలో చోటు చేసుకున్న ఘటనలను ఓ చానెల్ ఇంటర్వ్యూలో ప్రస్తా వించారు. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత ఈ కేసు విచారణ కోసం ఏర్పాటు చేసిన సిట్ విచారణ ముందు కూడా రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. సిట్ విచారణకు హాజరుకావడం తనకు బాధ కలిగిం చిందన్నారు. మాజీ మావోయిస్టు నయీంను పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మార్చడంలో తాను కీలకంగా వ్యవహరించాననే విషయాన్ని రిటైర్డ్ డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఖండించారు.

బెల్లి లలిత హత్య తర్వా త ఆ కేసు విచారణ సందర్భంగానే ముషీరాబాద్ జైల్లో ఉన్న నయీంను కలుసుకున్నట్లు రవీందర్‌రెడ్డి చెప్పారు. కానీ, అంతవరకు నయీం వ్యాస్ హత్య కేసులో నిందితుడిగా మాత్రమే తెలుసు అని ఆయన చెప్పారు. ఆ సమయంలో శాఖమూరి అప్పారావు, రవిలను కూడా కలిసి మాట్లా డినట్లు రవీందర్‌రెడ్డి చెప్పారు. ఆ సమయంలో నయీంను తాను తొలి సారిగా కలుసుకున్నట్లు రవీందర్‌రెడ్డి చెప్పారు. బెల్లి లలిత కేసు విషయమై నయీంను విచారించిన సమయంలో లలితను తన సోదరుడు అలీ చంపేసి ఉంటారని నయీం చెప్పారని రవీందర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. బెల్లి లలిత, మాజీ మావోయిస్టు నయీం మధ్య సంబంధాలు ఉండేవని విచారణలో తేలిందన్నారు. వీరిద్దరూ కూడా ఒకానొక సమ యంలో వివాహం చేసుకోవాలని భావించారని రవీందర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. కానీ, నయీం ను బెల్లి లలిత ట్రాప్ చేసిందనే అనుమానంతో ఆమెను నయీం జైలులో ఉండి హత్య చేయించాడని రవీందర్‌రెడ్డి చెప్పారు. ఈ కేసు విషయంలో అప్పటి మంత్రి మాధవరెడ్డితో పాటు తనపై కూడా ప్రచార జరిగిందని ఆయన గుర్తు చేశారు.

శ్రీవారి సేవలో సింగపూర్ మంత్రి

- షణ్ముణంకు పూర్ణకుంభంతో స్వాగతం

తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సింగపూర్ మంత్రి షన్మగం శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయంలోకి చేరుకున్న సింగపూర్ మంత్రికి తిరుమల జేఇఓ శ్రీనివాసరాజు సాదర స్వాగతం పలికి దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు.

దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా తిరుమల జేఇఓ శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం, నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను అందచేశారు. ఆయనతో పాటు ఏపి ఇన్‌చార్జ్ మంత్రి నారాయణ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు కూడా తిరుమల జేఇఓ శ్రీనివాసరాజు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందచేశారు.

గణతంత్ర వేడుకలో అపశ్రుతి

విద్యుదాఘాతంతో అటెండర్ మృతి

కోహెడ, ప్రభన్యూస్: గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు ఆవరణలో శుక్రవారం గణతంత్ర వేడుకల నిర్వహణకు జెండాను తయారు చేసి గద్దెపై పెట్టే క్రమంలో అటెండర్ గొట్టి చంద్రయ్య కార్యాలయం ముందు గల విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. విద్యుత్ షాక్‌కు గురైన అనంతరం చంద్రయ్యను మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. ఈ సంఘటన మండల కేంద్రంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు మృతదేహంతో బైఠాయించారు. మృతునికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో శంకర్‌కుమార్ పరిస్థితి గమనించి ప్రభుత్వం తరపున రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని చెప్పినా విని పించుకోలేదు. ఎమ్మెల్యే వచ్చి హామీ ఇస్తేనే ఊరుకుంటామన్నారు. దీంతో ఎమ్మెల్యే సతీష్ కుమార్ హుటాహుటీగా కోహెడకు చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని హామీ ఇచ్చి రూ.5లక్షల చెక్కును అక్కడే అందజేశారు. అలాగే భార్యకు ఉద్యోగంతో పాటు 3ఎకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం, పిల్లలకు ఉచిత విద్యనందిస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర స్వామి, ఎంపీపీ ఉప్పుల స్వామి, తహసీల్దార్‌శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు శ్రీనివాస్, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాజు, ఉపాధ్యక్షులు ఎం.డీ.సలీం, ఎస్.శ్రీనివాస్, సతీష్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కుమారస్వామి, తదతరులు ఉన్నారు.





రైతన్నలకు వడ్డీలేని రుణాలు

- ఏపీ ప్రభుత్వం నిర్ణయం

అమరావతి, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగాన్ని లాభ సాటిగా మార్చడం ద్వారా రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పునర్విభజన తరువాత ఏర్పడిన నవ్యాంధ్ర జనాభాలో 62 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనోపాధిని పొందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ రంగాభివృద్ధికి పెద్దపీట వేస్తూ అద్భుతమైన రైతాంగ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోంది. రైతన్న సేద్యాన్ని మొదలు పెట్టినప్పటి నుంచి భూసార పరీక్షలు, ఎరువుల పరీక్షలు, పురుగుల మందుల పరీక్షలు, విత్తన పరీక్షలు, భూ వినియోగ గణాంకాల తయారీ, రుణ సౌకర్యం, పంటల భీమా ఏర్పాటు, నాణ్యమైన విద్యుత్ సరఫరా తదతర సూచనలు, సలహాలు, సేవలను రైతన్నలకు చంద్రబాబు సర్కార్ అందిస్తోంది. ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా 50.56 లక్షల హెక్టర్లలో వరి, అపరాలు, మొక్కజోన్న, పత్తి, వేరు శనగ, ఆముదం, మిర్చి, పసుపు తదితర 55 రకాల పంటలను పండిస్తున్నారు. రైతులకు భూమిని చదును చేసుకునే దశ నుంచి పంటల దిగుబడి వచ్చి, వాటికి మార్కెట్ సౌకర్యం కల్పించే వరకు వివిధ దశల్లో పలు రకాలుగా తోడ్పాటును అందిస్తున్న ప్రభుత్వం అన్నదాతకు ఆర్థికంగా కూడా చేదోడు వాదోడుగా ఉంటూ వడ్డీలేని పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందిస్తోంది.

చిన్న, సన్నకారు రైతులకు వరంగా మారిన పథకం..

పంట రుణాలపై వడ్డీ మాఫీ పథకం చిన్న, సన్నకారు రైతులకు వరంలా మారుతోంది. సేద్యానికి ముందుగా లక్ష రూపాయల లోపు పంట రుణాలను బ్యాంకుల నుంచి తీసుకున్న రైతులు గరిష్టంగా ఏడాదిలోపు తిరిగి రుణాన్ని చెల్లిస్తే వారికి ఎలాంటి వడ్డీని బ్యాంకులు వసూలు చేయవు. కానీ బ్యాంకులు పంట రుణాలపై విధించే 7 శాతం వడ్డీని ఆర్‌బీఐ 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వాటాగా చెల్లిస్తాయి. లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులు పెట్టుబడి లేకుం డాసేద్యం చేసి లాభపడేందుకు తోడ్పాటును అందిస్తున్న ఈ పథకాన్ని 2011-12 సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది. దీని కోసం ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.172 కోట్లను చెల్లిం చడం ఆనవాయితీగా వస్తోంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం రైతాంగానికి మరింత వెసులుబాటు ను కల్పిస్తూ గత ఏడాది రూ.249.48 కోట్లను తన వాటాగా బ్యాంకులకు వడ్డీ బకాయిలు చెల్లించడం జరిగింది. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి లక్ష లోపు పంట రుణాలపై చెల్లించిన వడ్డీ బకాయిలను పరిశీలిస్తే 2014-15లో రూ.172 కోట్లు, 2015-16లో రూ.172 కోట్లు, 2016-17లో రూ.249.48 కోట్లు, 2017-18కి గాను రూ.187.02 కోట్లను బ్యాంకులకు చెల్లించడం జరిగింది. దీని ద్వారా లబ్దిపొందిన రైతుల వివరాలను పరిశీలిస్తే 2014-15లో 4,42,463 మంది, 2015-16లో 2,42,345 మంది, 2016-17లో 21,13,018 మంది, 2017-18 ఏడాదికి గాను ఇప్పటి వరకు 7,76,254 మంది లబ్ది పొందడం జరిగింది. గత నాలుగేళ్లలో చంద్రబాబు సర్కార్ బ్యాంకులకు వడ్డీ రూపంలో కట్టిన రూ.780.5 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 35,74,080 మంది అన్నదాతలు లబ్దిపొందారని చెప్పవచ్చు.

రైతాంగ సంక్షేమమే లక్ష్యం

- మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ద్వారా రైతాంగ ఆర్థికాభివృద్ధికి, సంక్షే మానికి తోడ్పాటును అందించ డమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్ర సమయంలో రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకొని కేంద్ర సహకారం, ఆర్‌బీఐ సహకారం లేకపోయినా, నవ్యాంధ్ర రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్నా, రాష్ట్ర నిధులతో వ్యవసాయ రైతులకు రూ.24,500 కోట్లు, ఉద్యాన రైతులకు రూ.600 కోట్లు మొత్తంగా రూ.25,100 కోట్లు రైతు రుణమాఫీని చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

ట్రంప్ విందులో... ముగ్గురు భారతీయులు

- అమెరికాలో పెట్టుబడులకు సీఈఓలకు ఆహ్వానం




దావోస్ : దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు ఇచ్చిన విందులో ముగ్గురు భారతీయ కంపెనీలకు చెందిన సీఈఓలు పాల్గొన్నారు. అమెరికాలో పెట్టుబడుల విషయమై ట్రంప్ టాప్ యూరోపియన్ 15 సీఈఓలతో సమావేశం అయ్యారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికిగాను కంపెనీలు తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా వారిని ట్రంప్ కోరారు. ముగ్గురు భారతీయ సీఈఓల్లో నోవార్టీస్ సీఈఓ వాస్ నరసింహన్, నోకియా సీఈఓ రాజీవ్ సూరి, డెలాయిట్ సీఈఓ పునీత్ రెంజిన్ ఉన్నారు. వారితో పాటు అమెరికా కార్యదర్శి రెక్స్ టిల్లర్‌సన్, రక్షణ శాఖ కార్యదర్శి క్రిస్టెన్ నెల్సన్, జాతీయ రక్షణ సలహాదారు హెచ్‌ఆర్ మెక్ మాస్టర్, నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ దిశానిర్దేశకుడు గ్యారీ కోహన్ హాజరయ్యారు. 2017 సెప్టెంబర్‌లో నోవార్టీస్ సీఈఓగా నరసింహన్ బాధ్యతలు చేపట్టారు. రోహతక్‌లో జన్మించిన పునీత్ రెంజిన్ 2015 జూన్‌లో డెలాయిట్ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అమెరికాలో పన్నుల చెల్లింపులు, సౌకర్యాలు, వనరుల గురించి ట్రంప్ 15 మంది సీఈఓలకు వివరించారు. అమెరికా వ్యాపార రంగంలో ఎలా దూసుకుపోతున్నదో వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా పేరుపొందిన టాప్ వ్యాపార దిగ్గజాలతో కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. మనం అందరం కలుసుకోవడానికి ఇంతకంటే మంచి స్థలం దొరకదని భావించి సమావేశం ఏర్పాటు చేసినట్టు ట్రంప్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 2,65,000 ఉద్యోగుల్లో సువారు 70,000 మంది అమెరికాలో ఉండటం ఎంతో సంతోషంగా డెలాయిట్ సీఈఓ పునీత్ రెంజిన్ అన్నారు. అనంతరం నోకియా సీఈఓ సూరీ మాట్లాడారు. టెలీకాం రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నామని ఈ సందర్భంగా సూరీ వివరించారు. వ్యాపారాన్ని ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తృతపర్చడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. న్యూజెర్సీలో సొంతంగా నోకియా బెల్ ల్యాబ్ కూడా ఉందన్నారు. చికాగోలో కూడా వ్యాపారం బాగా సాగుతోందని వివరించారు. ప్రస్తుతం 5జీ నెట్‌వర్క్‌పై దృష్టిసారించినట్టు తెలిపారు. అనంతరం నోవార్టీస్ సీఈఓ నరసింహన్ మాట్లాడుతూ... ప్రపంచంలో కెల్లా అతిపెద్ద హెల్త్‌కేర్‌గా నోవార్టీస్‌కు పేరుందని వివరించారు. కొత్త తరహా మందులు, జెనరిక్స్ ఔషధాల రూపకల్పన కోసం ప్రయత్నిస్తున్నామని, అదేవిధంగా కంటికి సంబంధించిన వ్యాధులపై కూడా పరిశోధనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమెరికా వ్యాప్తంగా 22వేల మంది ఉద్యోగులు ఉన్నారని, ప్రతీఏడాది నోవార్టీస్‌లో 14 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడ్తామని వివరించారు. అందులోంచి పరిశోధనల కోసం 3.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం అమెరికాలోని కార్మిక చట్టాలు, కంపెనీలకు అందించే వసతుల గురించి ట్రంప్ సీఈఓలకు వివరించారు.

బ్రిటన్ ప్రధానికి ట్రంప్ క్షమాపణలు



లండన్ : నవంబర్‌లో ఓ బ్రిటన్ సంస్థ ముస్లిం వ్యతిరేక వీడియోను పోస్టు చేసింది. దానిపై అమెరికా అధ్యక్షుడు రీట్వీట్ చేశారు. ఆ సమయంలో ఆయన చేసిన ట్వీట్ దుమారం లేపింది. దీనిపై స్పందించిన బ్రిటన్ ప్రధాని థెరెసా మే ట్రంప్‌కు విమర్శించారు. ట్రంప్ ట్వీట్‌తో ప్రజల్లో చెడు సాంకేతాలు వెళ్తాయని, ఇది మంచి పని కాదని ట్విట్టర్ వేదికగా చెప్పుకొచ్చారు. దీంతో ట్రంప్ కూడా ధీటుగానే సమాధానం ఇచ్చారు. తనను విమర్శించడం మాని బ్రిటన్‌లో ఉగ్రవాదంపై దృష్టిపెట్టాలని థెరెసాకు ట్రంప్ సూచించారు. దీనిపై దావోస్ వేదికగా నిర్వహించిన గుడ్ మార్నింగ్ బ్రిటన్ కార్యక్రమంలో ట్రంప్ క్షమాపణలు చెప్పారు. తన రీట్వీట్‌తో ఎవరి మనస్సు అయినా నొప్పి ఉంటే క్షమాపణలు చెబుతున్నాను అంటూ చెప్పుకొచ్చారు. గతంలో తాను కొందరిని జాత్యాంహాకార ప్రజలుగా అభివర్ణించానని, దీనిపై ప్రతీ ఒక్కరికి నన్ను ప్రశ్నించే హక్కు ఉందని ట్రంప్ అన్నారు. అలా తప్పుగా వ్యహరించినందుకు క్షమాపణలు అంటూ వివరించారు. ప్రపంచ దేశాలన్నింటితో మైత్రి కొనసాగించాల్సిందే తన కోరిక అని, ఎవరితో శత్రుత్వం పెంచుకునే ఆలోచన తనలో లేదని అన్నారు. కలిసికట్టుగా ముందుకు వెళ్లేందుకు తాను ఎప్పటికీ సిద్ధంగానే ఉంటానని చెప్పుకొచ్చారు.




తెలంగాణ ట్రాన్స్‌కో కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో సీఎండీ ప్రభాకర్‌రావు



ఎస్‌వీకేలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులు తమ్మినేని, తదితరులు

డ్రీమర్స్ సిటిజన్‌షిప్‌ల డబ్బులతో... మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం



వాషింగ్టన్ : అమెరికాలో నివాసం ఉంటున్న 1.8 మిలియన్ డ్రీమర్స్ సిటిజన్‌షిప్‌లతో వచ్చే డబ్బులను మెక్సికన్ సరిహద్దు గోడ నిర్మాణానికి ఉపయోగించనున్నట్టు ట్రంప్ పరిపాలనాధికారులు ప్రకటించారు. సిటిజన్ షిప్‌తో సుమారు 25 బిలియన్ డాలర్లు సమకూరే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 6కంటే ముందు సభలో ఉన్న బిల్లుకు డెమోక్రట్‌లు, రిపబ్లికన్‌లు ఆమోదిస్తే.. వీలైనంత త్వరలో గోడ నిర్మాణం జరుగుతుందని వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. సెనెట్ మెజార్టీ లీడర్ మిట్చ్‌మెక్ కొన్నెల్ ఉభయ సభలో అమెరికన్ సిటిజన్ షిప్‌నకు సంబంధించిన బిల్లును ప్రవేశపెడ్తారని, ఫిబ్రవరి 6కి ముందు ఆమోదం లభించేలా చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. డీఏసీఏ ప్రకారం.. 6,90,000 వలసదారులకు అమెరికన్ సిటిజన్ షిప్ ఇవ్వడానికి ఆస్కారం ఉంది. 1.1 మిలియన్ ప్రజలు అర్హులుగా ఉన్నా వారు అమెరికన్ సిటిజన్‌షిప్ కోసం దరఖాస్తు చేయలేదని చెప్పారు. ఒబామా తీసుకొచ్చిన డీఏసీఏ ప్రోగ్రాంను ట్రంప్ గతేడాది సెప్టెంబర్‌లో రద్దు చేశారు. కచ్చితంగా బిల్లు పాస్ అవుతుందని, 60 ఓట్లు పొందుతామని వైట్‌హౌస్ అధికారి ఒకరు ధీమా వ్యక్తం చేశారు.

తాలిబన్, హక్కానీ నేతలపై ఆంక్షలు

- ఉగ్రవాదంపై కలిసి పోరాడాలి : అమెరికా



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం ఆరు తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్ నేతలపై ఆంక్షలు విధించింది. ఇప్పటికైనా అమెరికాతో కలిసి పని చేయాలని పాక్‌ను ఈ సందర్భంగా హెచ్చరించింది. నిధుల సమీకరణపై అమెరికా నిఘా పెట్టింది. హక్కానీ నెట్‌వర్క్ ఆఫ్ఘనిస్థాన్‌లో చెలరేగిపోతున్నది. అమెరికన్‌లే లక్ష్యంగా కిడ్నాప్ చేసి వారిపై దాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యం పాలనాధికారులు హక్కానీ నాయకులపై ఆంక్షలకు తెరలేపింది. అమెరికా, భారత్‌వాసులను లక్ష్యంగా చేసుకుని ఆఫ్ఘనిస్థాన్ వేదికగా దాడులకు పాల్పడుతుండటం గమనార్హం. 2018లో తాలిబన్‌తో పాటు హక్కానీ గ్రూపు కాబూల్‌లో జరిపిన బాంబు దాడిలో 58 మందిని పొట్టనపెట్టుకుంది. దీంతో 2018 ప్రారంభంలో ట్విట్టర్ వేదికగా మొదటిసారిగా పాక్ వ్యవహారశైలి, ఉగ్రవాదం పెంచి పోషిస్తుండటంపై నిప్పులు చెరిగారు. నలుగురు తాలిబన్ నాయకులైన అబ్దుల్ సమద్‌సనీ, అబ్దుల్ ఖదీర్ బసీర్ అబ్దుల్ బషీర్, హఫీజ్ మహ్మద్ పోపల్‌జై, మౌల్వీ ఇన్యాతుల్హా, ఇద్దరు హక్కానీ నాయకులు ఫకీర్ ముహ్మద్, గులా ఖాన్ హమిదీపై అమెరికా చర్యలకు పూనుకుంది. ఆరుగురు ఉగ్రవాదులను ప్రపంచ స్థాయి టెర్రరిస్టులుగా అమెరికా శాఖ ప్రకటించింది. తాలిబన్, హక్కానీ గ్రూపు నాయకులు కిడ్నాప్‌లు చేసి వచ్చిన డబ్బులతో ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సాయం అందిస్తున్నాయని టెర్రరిజం, ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ కార్యదర్శి సిగల్ మండేల్‌కర్ వివరించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే ధృఢ నిశ్చయంతో ట్రంప్ ఉన్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటికైనా తాలిబన్, హక్కానీ గ్రూపులకు వ్యతిరేకంగా అమెరికాతో జతకట్టి పనిచేయాలని మండేల్కర్ డిమాండ్ చేశారు.



ఆదివాసీ జాతరకు హైటెక్ హంగులు

భూపాలపల్లి, ప్రభ న్యూస్: ఆదివాసీ మహాజాతర హైటెక్ హంగులు అద్దుకుంటున్నది. సుమారు కోటి 20 లక్షలకు పైగా భక్తులు సమ్మక్క - సారలమ్మ దర్శించుకునేందుకు పోటెత్తనుండటంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు, ఇతర ప్రభుత్వ విభాగలు అధునిక టెక్నాలజీ వినియోగించుకుంటున్నాయి. క్రౌడ్ కౌంటింగ్, క్యూలైన్ మానిటరింగ్ కెమెరాలతో పాటు, తప్పిపోయిన వారి వివరాలను ఫోటోలతో తెలిపేందుకు వీఎంఎస్ బోర్డులను పోలీసులు జాతరలో ఏర్పాటు చేస్తున్నారు. గగణతల వీక్షణకు డ్రోన్ కెమెరాలు సిద్దంగా ఉన్నాయి. వీటితో పాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు యాప్‌లు, వెబ్‌సైట్లు సిద్దం చేశారు.

క్రౌడ్ డిటెక్షన్ కెమెరాలు

ఎక్కడైన భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడినా, నిలిచిపోయినా క్రౌడ్ డిటెక్షన్ కెమెరాలు గుర్తించి కంట్రోల్ రూం ద్వారా సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తుంది. దీంతో అక్కడికి పోలీసులు చేరుకుని వారిని పంపించి వేస్తారు. కోటి మందికి పైగా జన సమూహం 10 నుంచి 15 కిలోమీటర్ల మేరా అతి చిన్న ప్రదేశంలోకి వస్తుండటంతో అక్కడ ఏ ఒక్క నిమిషం అంతరాయం ఏర్పడినా సరిచేయడానికి పోలీసులకు తలకుమించిన సమస్య అవుతుంది. అందుకే క్రౌడ్ ఎక్కడైనా వెయ్యిమంది నిలిచినట్లు కెమెరా గుర్తించగానే ఆ ప్రదేశం వివరాల్ని కంట్రోల్ రూమ్‌కు చేరవేస్తుంది. దీంతో అక్కడి అధికారులు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తారు. వారు అక్కడికి చేరుకుని వారిని అక్కడి నుండి ముందుకు నడిపిస్తారు. వెనకాల వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది.

వీఎంఎస్

మేడారం జాతరకు వచ్చే వభక్తులు ప్రధానంగా భయాందోళనకు గురయ్యేది పిల్లు ఎక్కడ పోతారోనని, కోటి మంది భక్తులు వస్తుండటంతో తారుమారై ఎక్కడ తప్పిపోతారోనని తల్లిదండ్రులు భయపడుతుంటారు. కానీ ఈ సారి ఆ ఆందోళనలు తగ్గించేందుకు పోలీసులు టెక్నాలజీని అందుబాటులోకి తీసుకు వచ్చారు. వీఎంఎస్ బోర్డులు ప్రదర్శిస్తూ వారి సంబంధీకుల వివరాలు ప్రదర్శించడంతో పాటు మైక్‌లో అనౌన్స్ చేయనున్నారు. దీంతో భక్తులు అవసరమైన సూచనలు ,ట్రాఫిక్ అంశాలు వెల్లడించనున్నారు.

హెలికాప్టర్ సేవలు

మేడారం జాతరకు గతంలో హెలీకాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ సారి యాప్ రూపంలో బుకింగ్‌కు రెవెన్యూ శాఖ అవ



కాశం కల్పించింది. హైదరాబాద్ నుంచి ఒక్కొక్కరికి రూ.12,999 చార్జీలు వసూలు స్తుండగా, మేడారం జాతర పరిసరాల్ని వీక్షించేందుకు రూ.2,499 వసూలు చేయనున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ మేడారం ఆప్‌లో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. దీనితోపాటు జాతరకు సంబంధిన పూర్తి రూట్ మ్యాప్‌ను యాప్ రూపంలో ఎలా వెళ్ళాలి? తిరిగి బస్టాండ్ కాంప్లెక్స్‌కు ఎలా చేరుకోవాలో తెలిపే మ్యాప్‌ను ఏర్పాటు చేశారు.

200 సీసీటీవి కెమెరాలు

సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు పోలీసు శాఖ గద్దెలకు 10 కిలోమీటర్ల రేడియస్‌లో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ నియంత్రణ , జాతరలో రద్దీని గుర్తించడం, దొంగతనాల నివారణ, బందోబస్తు పర్యవేక్షించేందుకు మేడారం పరిసరాల్లో అమ్మవార్ల గద్దెల నుంచి జంపన్న వాగు, చిలుకల గుట్ట, ఆర్టీసీ కాంప్లెక్స్, రెడ్డిగూడెం, ఇంగ్లీషుమీడియం పాఠశాల, వనం రోడ్డు, గద్దెల ప్రాంగణం, మేడారం వై జంక్షన్, పోలీసు క్యాంపు ప్రాంతాల్లో ఈ కెమెరాలు అమర్చారు.వీటిని పోలీసు క్యాంపు వద్ద నిర్మించిన కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు.

హరితా హోటల్

మేడారంలో కొత్తగా నిర్మిస్తున్న హరిత హోటల్ భక్తుల కోసం ఎనిమిది కాటేజీలను ఏర్పాటు చేస్తున్నారు. అతి త్వరలోనే ఇవి భక్తులకు అందు బాటులోకి రానున్నాయి. వీటి ధరలను క ూడా ఇంకా నిర్ణయించలేదు. తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ బార్ అండ్ రెస్టారెంట్ భవనాన్ని రూ. రెండు కోట్లతో ఎనిమిది కాటే జీలను రూ. మూడు కోట్లతో నిర్మిస్తున్నారు. టీఎస్‌టీడీసీ వెబ్‌సైట్ ద్వారా కాటేజీలను బుక్ చేసుకోవచ్చు. ఆధునిక గుడారాల బుకింగ్ సైతం ఈ వెబ్‌సైట్‌తోనే టూరిజం సిబ్బంది నిర్వహిస్తున్నారు.

డ్రోన్ కెమెరాలు

సమ్మక్క - సారలమ్మ మహా జాతరలో జరిగే నాలుగు రోజులు మేడారానికి కోటి మందికి పైగా భక్తులు రానుండటంతో పోలీసులు కట్టు దిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మేడారం అటవీ ప్రాంతంలో ఉండటంతో భక్తుల తాకిడి తొక్కిసలాట జరుగకుండా, వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా 4 డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నారు. జాతరకు ముందు నుంచే భక్తులు రోజు పెద్ద సంఖ్యలో వస్తుడటంతో ఇప్పటికే వీటిని విని యోగిస్తున్నారు.

ఇంట్రానెట్ సేవలు

జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారు కాబట్టి ఒక్కోసారి సెల్‌ఫోన్ సేవలు నిలిచిపోవచ్చు. ఈ సమస్యను అధిగమించడానికి పోలీసులు సమాచారం కోసం ఇంట్రానెట్‌ను వినియోగించనున్నారు. దీని కారణంగా ఇంటర్‌నెట్‌తో సంబంధం లేకుండా అధికారులు , సిబ్బందితో నిరంతరం సమాచారం కొనసాగించవచ్చు

పోలీస్ ఆప్

మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీసులు ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో పార్కింగ్ అంశం, భక్తులకు అత్యంత ఉపయోగకరం కానున్నది. జాతరకు వచ్చే భక్తులకు 32 పార్కింగ్ లాట్‌లను ఏర్పాటు చేశారు. ఉదాహరణకు ఇందులో ఒక పార్కింగ్ లాట్‌లో 500 వాహనాలు నిలిపే అవకాశం ఉండగా అందు లో ఎన్ని వాహనాలను సరిపడ స్థలం ఉన్నది ?లేదా లాట్ నిం డిందా..? అన్న అంశాలన్నీ అక్కడి సీసీటీవి కెమెరాల ద్వారా ఈ యాప్‌లో అప్‌డేట్స్ ఉంటాయి. వాటి ఆధారంగానే వాహనాలను పోలీసులు అనుమతించడం, వాహనదారులకు సైతం ముందు గానే ఏ పార్కింగ్ లాట్‌లో స్థలం ఖాళీగా ఉందో సమాచారం తెలియనున్నది. ఈ యాప్ ఈ నెల 24న ప్రాంభమయ్యే అవకాశం ఉన్నది.

ఎంప్లాయీస్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్

ఈ సాఫ్ట్‌వేర్ పూర్తిగా పోలీసులకు సంబంధించినదే అయినా , జాతరలో తొలిసారిగా వినియోగిస్తున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ముందుగా మేడారంలోని జాతరను సెక్టార్లుగా విభజిస్తారు. ఏ సెక్టార్లలో ఏయే అధికారులు , సిబ్బంది పనిచేయాలో వారికి ఎస్సెమ్మెస్ రూపంలో సందేశాలు పంపిస్తారు. ఈ సందేశాలను స్మార్ట్ ఫోన్‌తో పాటు ఫీచర్ ఫోన్‌లకు వచ్చేలా ఈ సాఫ్ట్ వేర్ పనిచేస్తుంది. పోలీసులు అవసరమైన సూచనలను ఎప్పటికప్పుడు దీని సహాయంతో అందిచనున్నారు.

వజ్ర మినీ ఏసీ బస్సులు

జాతకు వజ్రమినీ ఏసీ బస్సులను తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ నడిపించనుంది. ఇతర బస్సులు కేవలం మేడారం వరకు మాత్రమే ఆన్‌లైన్ బుకింగ్‌లో అవకాశం ఇస్తుండగా , రిటర్న్‌లో ఆన్‌లైన్ బుకింగ్ అవకాశం కల్పించడంలేదు. కానీ వజ్ర మినీ బస్సులకు మాత్రం ఆర్టీసీ ఆప్ డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పిస్తున్నది, ఇప్పటికే టీఎస్ ఆర్టీసీ వజ్రపేరుతో నిర్వహిస్తున్న ఆప్ ద్వారానే ఈ టికెట్లు బుక్ చేసుకోవచ్చు.



క్యూలైన్ మానిటరింగ్ కెమెరాలు

జాతరలో అమ్మవారి గద్దెల ప్రాంగణంలో తొక్కిసలాట తావులేకుండా పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఆరు క్యూలైన్ మానిటరింగ్ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇవి గద్దెల వద్దకు భక్తులు వెళ్ళే సమయంలో వాళ్ళను లెక్కించి కంట్రోల్ రూంకు చేరవేస్తుంది . నిర్దేశిత సమయంలోగా వాళ్ళు బయటకి వెళ్ళారా లేదా? అన్నది ఎగ్జిట్‌లో ఉన్న కెమెరాలు పరిశీలిస్తాయి, ఉదాహరణకు గద్దెల ప్రాంగణంలో సుమారు రెండు వేల మంది భక్తులు ఉండేందుకు అవకాశం ఉంటే , వారికి తల్లుల దర్శనానికి 20 నిమిషాలు సమయం పడుతుందని అనుకుంటే ఆ సమయంలోగా వాళ్ళు బయటకు రాకపోతే కంట్రోల్ రూంలోని పోలీసు సిబ్బందిని ఎగ్జిట్ గేట్‌లో నున్న కెమెరాలు అలర్ట్ చేస్తాయి. దీంతో అక్కడి నుంచి గద్దెల వద్దనున్న సిబ్బందికి సమాచారం అందుతుంది. వాళ్ళు త్వరగా భక్తులను బయటకు పంపేందుకు అప్రమత్తం అవుతారు.

ఆధునిక అద్దె గుడారాలు

ఖర్చుకు వెనకాడని భక్తులు



భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరకు తరలివచ్చే భక్తులకు ఈసారీ ఆధు నిక గుడారాల సౌకర్యాలు కూడా పర్యాటక శాఖ , అటవీ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. జాతరకు వచ్చే భక్తులు చిన్నపాటి డేరాలను వేసుకోవడానికి స్థలాలు లేకపోవడంతో బస చేయడానికి ఇబ్బంది పడేవారు. మేడా రానికి చెందిన స్థానికులు పరదాలతో గుడారాలు వేసి అద్దెలకు ఇసున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులు పరదాలతో నిర్మించిన రూముల్లో ఉండటానికి ఇష్టపడక, తగిన వసతి లేక అవస్థలు పడేవారు. ఈ సారీ ఫారెస్టు , పర్యాటక శాఖలు ఒక అడుగు ముందుకు వేసి భక్తుల కోసం అత్యాధునిక గుడారాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. జాతరలోని గిరిజన మ్యూజీయం పక్కన 38 గుడారాలను నిర్మించారు. ఈ లగ్జరీ గుడారాల్లో ఫర్నిచర్ కూడా అమర్చారు. రోజులు , గంటల లెక్కల పైన అద్దెకు ఇస్తున్నారు. ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో వంద గుడారాలను ఏర్పాటు చేశారు. ఈ గుడారాల్లో అయిదుగు వ్యక్తులు ఉండటానికి అనుకూలంగా ఏర్పాటు చేశారు. ఈ గుడారానికి రోజుకు రూ. వెయ్యి నుండి 2వేల వరకు చెల్లించాల్సిఉంది. ఫారెస్టు శాఖ ఏర్పాటు చేసిన గుడారాలు జంపన్న వాగు సమీపంలో ఉన్నాయి. పస్రా నుంచి జాతర వరకు ఉన్న పలు గ్రామాల్లో గ్రామస్థులు పరదాలతో నిర్మించిన గుడారాలను అద్దెకు ఇస్తున్నారు. పల్లెల నుంచి వచ్చిన ప్రజలు ఈ గుడారాల్లో బస చేస్తున్నారు. రోజుకు 5నుండి 6 వందల రూపాయలు సంఖ్యను బట్టి 2 వేల వరకు కిరాయిలు వసూలు చేస్తున్నారు.

జాతర ఏర్పాట్లపై మందకృష్ణ అసంతృప్తి



భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతరను శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగా సందర్శించి వన దేవత లకు మొక్కు లు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఏబీసీడీ వర్గీ కరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టేలా చూడా లని తల్లులను వేడుకున్నానన్నారు. జాతర ఏర్పాట్ల పై అసం తృప్తి వ్యక్తం చేశా రు. జంపన్న వాగులోకి ఇప్పటి వరకు నీరే రాలేదని , ఈ సారి జాతరంతా ఇంచార్జీలతో నడవడంతో అధికారుల్లో సమన్వ యం లోపించినట్లు జాతరలో ఏర్పాట్లను చూస్తే అర్థమ వుతుం దన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు , కార్యకర్తలు ఉన్నారు.

మేడారం జాతరకుముందే పోటెత్తిన భక్తజనం





మేడారం జాతర సందర్భంగా నిలువెత్తు బంగారాన్ని అమ్మవార్లకు తులాభారంగా సమర్పించుకుంటున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

కనువిందుగా లిటరరీ ఫెస్ట్

- కళలకు ప్రాణం పోసిన కళకారులు
- ప్రతిదీ వైవిధ్య భరితమే
- కళకళలాడుతున్న స్టాల్స్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : లిటరరీ ఫెస్టివల్‌లో ఎంతోమంది కళాకారులు తమకు కళల్లో ఉన్న ప్రావీణ్యాన్ని ప్రపంచానికి తెలియచెప్ప డానికి తమకు వచ్చిన, నచ్చిన వాటిని ప్రదర్శించారు. ఒక్కో దానిలో ఒక్కొక్కరూ నిష్ణాతులు. వారి ప్రదర్శిం చిన కళలను చూస్తే ఇంత ప్రతిభ దాగి ఉందా అని ఆశ్చర్యపోవాల్సిందే. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు ఇక్కడ కొలువుదీ రాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రభ పలువురు కళాకారులను పలకరించి వారు అనుభవాలను అడిగి తెలుసుకుంది. అందులో మచ్చుకు కొన్ని...



తమ సంగీతంలో ఓలలాడిస్తున్నారు

ది నేషన్స్ రాక్ బీట్ పేరుతో 85 మంది యువతీ, యువకులు ఓ సంస్థను నెలకొల్పి సంగీతంలో తమకున్న మక్కువను తీర్చుకుంటున్నారు. వీరందరూ కూడా చదువుకుంటున్న వారే. వారు తమ చదువును కొనసాగిస్తూనే తమకు ఇష్టమైన సంగీతంవైపు పరుగులు పెడుతున్నారు. వీరు చాలా ప్రదర్శనలు ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ సంస్థలు చాలా వరకు సంగీత కార్యక్రమాలకు సంబంధించి వీరికే చాన్స్ ఇస్తాయి. వీరిలో చాలామంది ఇంజనీర్లు, డాక్టర్లు, ఉద్యోగం చేసే యువతీ, యువకులు ఉన్నారు. సమాజంలో తమ సంస్థకు ఒక ప్లాట్‌ఫాం నిర్మించుకోవాలన్న ఆశతో ముందుకు కదులుతున్నారు. గతంలో పూణెలో కూడా వీరి సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వీరు ప్రదర్శనలు ఇవ్వడానికి చాలామంది తల్లిదండ్రులు ఒప్పుకోక పోయినా తమకు నచ్చిన కళను ప్రదర్శించడానికి వారితో గొడవపడి మరి ఇందులో పాల్గొంటున్నట్టు వారు తెలిపారు. మన రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ది నేషన్స్ రాక్ బీట్ సంస్థ సభ్యులు న్నారు. వీరు తెలుగు, హిందీ పాటలతో ప్రేక్షకులను సంగీత సాగరంలో ఓలలాడిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంస్థకు శ్రీయా గుప్తా లీడర్ వ్యవహరిస్తున్నారు. ఈమె ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. మూడు రోజుల పాటు ఉదయం నుంచ సాయంత్రం వరకు వీరి ప్రదర్శన ఉంటుంది.

మనస్సుకు హత్తుకునే ఫొటోలు తీయడం ఆయనకు ఇష్టం

ఈయన తీసే ఫొటోలు మాట్లాడతాయి. అంటే నిజంగా మాట్లాడతాయని కాదు. ఆయన ఉద్దేశ్యం అది. ఒక ఫొటోను చూడగానే దాంట్లో ఏముందన్న అర్థం చూసే వాళ్లకు తెలియాలి. ఫొటోను అందరూ తీయగలుగుతారు. తాను మాత్రం అందరికన్నా భిన్నంగా తీయాలన్న ఆలోచనతోనే తన ఫొటోగ్రఫీని పార్ట్‌టైంగా ఎంచుకున్నారు సుమన్‌స్పతి. ఆయన తీసిన ఫొటోలు కూడా అలానే ఉన్నాయి. ఆయన ఆలిండియా రేడియోలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. దృశ్యం యొక్క ప్రాధాన్యతను మనం గుర్తించినప్పుడే మనం తీసిన ఫొటో చూసిన వారి మదిలో నిలిచి పోతుంది. ఆయన తీసిన ఫొటోలు దాదాపు తెలం గాణలో తీసినవే కాగా రెండుఫొటోలు మాత్ర వేరే రాష్ట్రంలో తీశారు. ఫొటోలు ఎన్ని తీసినా దానిలో కొన్ని మాత్రమే చెప్పుకోదగినవన్నారు.

గోరుతో వేల బొమ్మలకు ప్రాణం పోశాడు

ఈయన గోరుతో వేల బొమ్మలను గీశారు. దానినే నఖ చిత్రలేఖనం అంటారు. ఇందులో ప్రముఖుల ఫొటోలు ఉన్నాయి. 20 సంవత్సరాలుగా ఆయన నఖ చిత్రాలను గీస్తూ తన జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. ఆయన బొమ్మలను గీశారనే కంటే వాటికి ప్రాణం పోశారంటే బాగుంటుంది.

8 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయం



మన భాష, సంస్కృతీ గురించి ప్రపంచానికి తెలియచెప్ప డానికి లిటరరీ ఫెస్టివల్‌లు ఎంతగానో ఉపయోగపడతా యని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పేర్కొ న్నారు. శుక్రవారం బేగంపేట లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఆయన ప్రారం భించారు. కళలు , సంస్కృతీ, సాహిత్యం గురించి చెప్పే క్రమంలో లిటరరీ ఫెస్టివల్ చాలా దోహదప డుతుం దని, 8 సంవత్సరాలుగా నిర్వాహకులు హైదరా బాద్ లిటరరీ ఫెస్టివల్ ను నిర్వహించడం సంతోషకరమ న్నారు.

హైదరాబాద్ ప్రతిష్ట పెరుగుతుంది: బుర్రా వెంకటేశం

తెలంగాణ టూరిజం మరియు సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఈ ఫెస్టివల్ వలన హైదరాబాద్ యొక్క ప్రతిష్ట పెరుగుతుందన్నారు. దీనిని చూడడానికి పర్యాటకులు కూడా వస్తారు. పర్యాట కులు ఎంత ఎక్కువగా వస్తే మన రాష్ట్రానికి అంత పేరు వస్తుందన్నారు. పర్యాటకులు ఎక్కువగా మన రాష్ట్రానికి రావడం వలన మన ప్రాంతానికి ఆదాయం పెరగడంతో పాటు, నిరుద్యోగులకు ఉపాధి పెరుగుతుందన్న భావనతోనే ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

ఇలాంటి ఫెస్టివల్‌కు అందరూ రావాలి: మామిడి హరికృష్ణ

హైదరాబాద్‌ను ప్రమోట్ చేయ డానికి ఇలాంటికార్యక్రమాలు ఉపయోగపడతాయనిసాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. ఒక రాష్ట్రానికి, ఒక దేశానికి చెందిన సంస్కృతీ, సంప్రదాయాల గురించి తెలియచెప్పడానికి ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు.

కళాభిమానమే స్థాపనకు నాంది

- హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌తో ఎంతో ప్రయోజనం: కిన్నెర మూర్తి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మన భాష, సంస్కృతీ గురించి తెలియచెప్పాలన్న ఉద్దేశ్యంతో మొదటగా ఇద్దరం కలిసి హైదరాబాద్ లిట రరీ ఫెస్టివల్‌ను ప్రారంభించాం. మిగతా రాష్ట్రాల్లో కూడా ఇలాంటి ఫెస్టివల్‌లు జరుగుతాయి. వాటి ప్రేరణ తోనే దీనికి అంకురార్పణ జరిగింది. మొదటి ఫెస్టివల్ తారామతి, బారాదరిలో నిర్వహించాం. రెండోది మౌలానా నేషనల్ ఉర్దూ యూనివర్శిటీలో జరిపాం. 4 వ సంవత్సరం మేము చేసిన ఫెస్టివల్‌ను బంజారాహిల్స్ లోని లామా కామ్ తో పాటు నాలుగు ప్రదేశాల్లో దీనిని నిర్వహించాం. అప్పుడు మేము పడిన కష్టానికి గుర్తిం పుగా మాకు చాలా పేరు వచ్చిం ది. ప్రతి సంవత్సరం ఒక రాష్ట్ర, ఒక దేశానికి సంబంధించి సంస్కృతీ, సంప్రదాయాలను ఈ ఫెస్టివల్లో ప్రదర్శిస్తున్నాం.



సాహిత్యం, కళలు, సంస్కృతీ, వారసత్వాన్ని పరిగణలోకి తీసుకుంటాం

సాహిత్యం, కళలు, సంస్కృతీ, వారసత్వం తదితర అం శాలను పరిగణలోకి తీసుకొని ఈ ఫెస్టివల్‌ను నిర్వహి సున్నాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరిగే ఫెస్టివల్‌లో మా సంస్థ 5వ స్థానంలో ఉంది. 8 వ ఫెస్టివల్‌కు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించా లనుకొని ఇక్కడ ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రభుత్వం ప్రతిసారి ప్రోత్సాహం అందిస్తోంది.

పలు దేశాలకు అవకాశం కల్పించాలి

జర్మనీ, ఫ్రాన్స్, పిలీఫిన్స్, సింగపూర్, ఐర్లాండ్, స్పెయిన్ తదితర దేశాలకు గతంలో ఈ ఫెస్టివల్‌లో అవకాశం ఇచ్చాం. భాష పరంగా చూస్తే మొదటగా తెలుగు, ఆ తరువాత హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషలకు ఇందులో అవకాశం కల్పించాం. నాతో పాటు మా ట్రస్టులో ఇంకా ఐదుగురు సభ్యులు ఉన్నారు. మేమందరం కలిసి ఈ ఫెస్టివల్‌ను 8 ఏళ్లుగా ముందుకు తీసుకెళుతున్నాం. విజయ్ కుమార్ (ఉస్మా నియా యూనివర్శిటీలో ప్రొఫెసర్), సూర్యప్రకాష్‌రావు (ఆన్‌లైన్), అజయ్‌గాంధీ (సీఏ), అమితా దేశాయ్ (కల్చర్), శ్రీనివాసమూర్తి (ఆర్కిటెక్చర్) మాకు కళల మీద ఉన్న అభిమానంతో మేము ఈ సంస్థను స్థాపించి దీనిని నిర్వహిస్తున్నాం.

ఖర్చులు పెరుగుతున్నాయి..

ఈ ఫెస్టివల్ నిర్వహణకు ఒక్కో సంవత్సరం కొంచెం కష్టంగా మారుతోంది. అయినా పట్టువదలకుండా ముందుకు తీసుకెళుతున్నాం. కొన్ని ఫండ్స్ రూపంలో నిధులు వచ్చినా కొన్ని మాత్రం సొంతంగా మళ్లీ భరించాల్సి వస్తుంది. మాకు కళల మీద ఉన్న అభిమానంతో దీనిని నిర్వహించాల్సి వస్తుంది. ఈ సారి ఫెస్టివల్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి గ్రాంటు ఎక్కువగా వచ్చింది. బుర్రా వెంకటేశం (ఐఏఎస్) మాకు చాలా సాయం చేశారు.

వివిధ దేశాల నుంచి ప్రముఖుల హాజరు

వివిధ దేశాలతో పాటు రాష్ట్రాల నుంచి ప్రముఖులు ఈ కార్యక్రమానికి వస్తున్నారు. గిరీష్ కాసరవెల్లి, అరుణారాయ్, సంజనా కపూర్, పెరుమాళ్ మురుగున్, నార్త్ ఈస్ట్ నుంచి, వివిధ దేశాల నుంచి పలువురు ప్రముఖులు 3 రోజుల కార్యక్రమానికి వస్తారు. ఓ ఆర్టిస్ట్ నుంచి కూడా మేము డబ్బులు తీసుకోం. ఇక్కడ స్టాల్స్ పెట్టుకునే వారు కూడా ఉచితంగానే తమ ప్రదర్శనలు నిర్వహిస్తారు. హైదరాబాద్ లిటరరీ ట్రస్టు నిర్వాహకురాలు డాక్టర్ కిన్నెర మూర్తి (ఫెస్టివల్ డైరెక్టర్) ఆంధ్రప్రభతో పంచుకున్నారు.





రబీ పంటకు సక్రమంగా సాగునీరు

- కాలువల వెంట క్షేత్రస్థాయిలో సీఈల పర్యవేక్షణ
- సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎస్.ఆర్.ఎస్.పి, ఎస్.ఎస్.పి, నిజాంసాగర్ లలో చివరి ఆయుకట్టు రైతులకు కూడా నీరందేలా చూడాలని మంత్రి హరీష్‌రావు కోరారు. శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాం సాగర్ ప్రాజెక్టుల పరిధిలో ఆయుకట్టుకు రబీ పంటలకు సాగునీటి సరఫరాను క్రమబద్ధం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు జలసౌధలో ఈ మూడు ప్రాజెక్టుల ఆయుకట్టుకు జరుగుతున్న సాగునీటి సరఫరాపై మంత్రి సమీక్షించారు. కాలువల వెంట సీ.ఈ. ఎస్.ఈ.ఈ.లు ఇతర సిబ్బంది నిరంతరం తిరగాలని, సాగునీటి సరఫరా తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకోవాలని కోరారు. రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. సంబంధిత జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగించాలని ఆయన అన్నారు. నీరు అత్యంత విలువైనదని, చుక్క నీరు కూడా వృధా పోకుండా అత్యంత సౌకర్యంగా వాడాలని ఆయన కోరారు. సాగునీటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో ఎలాంటి లోటుపాట్లు జరిగినా ఈ.ఈ.లదే బాధ్యత అని, వారిఐ చర్యలకు ప్రభుత్వం వెనుకాడదన్నారు. నీటిని వదిలినప్పుడు అప్రమత్తంగా ఉండాలని.. రాత్రి, పగలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మూడు ప్రాజెక్టుల పరిధిలో రబీ ఆయుకట్టును కాపాడవలసి ఉందన్నారు. ప్రధాన కాలువలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేస్తున్నందున దిగువనున్న రైతులకు నీరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హరీష్‌రావు కోరారు. శ్రీరాంసాగర్ లోయర్ మానేరు డ్యామ్ ఎగువ, లోయర్ మానేరు డ్యామ్ దిగువ ప్రాంతాల్లో ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, ఎస్.ఎస్.పి ఎడమ కాలువ కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, నిజాంసాగర్ కింద కాలువల పరిధిలోనూ ఆయుకట్టుకు సాగునీటి సరఫరాపై క్షేత్రస్థాయి పరిస్థితిని మంత్రి సమీక్షించారు. ఎస్.ఆర్.ఎస్.పి ఎల్ఎండి ఎగువ ప్రాంతాల్లో 4,07,417 ఎకరాలు, ఎల్ఎండి దిగువ భాగాన 1,52,588 ఎకరాలు, ఎస్.ఎస్.పి. కింద 5,25,629 ఎకరాలు, నిజాం సాగర్ కింద 1,51,666 ఎకరాలకు ఈ యాసంగిలో తప్పనిసరిగా సాగునీరందించాలని మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఈ.ఎస్.సి మురళీధరరావు, సీ.ఈలు శంకర్, సునీత, మధుసూధనరావు, ఎస్.ఈ, ఈ.ఈలు పాల్గొన్నారు.

స్వేచ్ఛా వాణిజ్యానికి

షరతులు వర్తిస్తాయి

- అమెరికా ఫస్ట్ అంటే.. అమెరికా మాత్రమే కాదు: దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో మాటమార్చిన ట్రంప్

దావోస్: స్వేచ్ఛా వాణిజ్యానికి తన మద్దతు ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం తెలిపారు. కానీ అది సముచితంగా, ఉభయతారకంగా ఉండాలని ఆయన చెప్పారు. అమెరికా ఫస్ట్ విధానం పట్ల తనకు గల నిబద్ధతను ట్రంప్ మరోసారి చాటుకున్నారు. దానర్థం అమెరికా మాత్రమే కాదని స్పష్టం చేశారు. అమెరికాకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా విధానాలు చేపడుతున్న ట్రంప్‌పై ప్రపంచ నేతల్లో పలువురు మండిపడుతున్న తరుణంలో ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మరోసారి వాణిజ్యానికి తలుపులు తెరిచిన అమెరికా పోటీ తత్వాన్ని ప్రదర్శిస్తుందని ట్రంప్ తెలిపారు.

రికార్డులు బద్దలు కొడుతున్న స్టాక్ మార్కెట్

అమెరికా ప్రజల ప్రయోజనాలకు ప్రతినిధిగా నేను ఇక్కడ ఉన్నాను. ఒక ఉత్తమ ప్రపంచానికి వారి మద్దతుపై హామీ ఇవ్వడానికి వచ్చాను అని ఆయన చెప్పారు. అమెరికా గురించి, తాను చేపట్టిన పలు నిర్ణయాల గురించి ట్రంప్ వివరించారు. స్టాక్ మార్కెట్ ఒక దాని తర్వాత ఒకటి అన్నట్టుగా రికార్డులు బద్దలు కొడుతున్నది. నేను ఎన్నికైన తర్వాత కొత్తగా ఏడు ట్రిలియన్ డాలర్లకు పైగా సంపదను జోడించిందని తెలిపారు.

పన్నుల్లో కోతలు.. మధ్యతరగతికి ఆదాయాలు

ప్రతి కొత్త నిబంధనకు రెండు పాత నియంత్రణలను పరిహరించాలని తాను ప్రతినబూనానని ట్రంప్ చెప్పుకొచ్చారు. మధ్యతరగతి ప్రజలకు పన్నుల్లో కోతలు పెట్టాము. కార్పోరేట్ పన్నును తగ్గించాము అని తెలిపారు. పన్ను కోత బిల్లు అమెరికాలో ప్రతి కుటుంబం సగటు ఆదాయాన్ని 4,000 డాలర్లకు పైగా పెంచుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఇంధన సరఫరాదారుకు బందీ కారాదు

వినియోగదారు స్తోమతకు తగ్గట్టుగా విద్యుత్ సమకూర్చడానికి, ఇంధన భద్రతను ప్రోత్సహించడానికి ఇంధన ఉత్పాదకతపై స్వంతంగా విధించుకున్న ఆంక్షలను అమెరికా ఎత్తివేయనుందని ఆయన తెలిపారు. ఏ ఒక్క దేశం కూడా ఏకైక ఇంధన సరఫరాదారుకు బందీ కారాదని అన్నారు. పన్నుల్లో కోత పడుతుంది, భారమైన నియంత్రణలు తొలగిపోతున్నాయి, పాలనాస్వామ్యం సంస్కరణకు నోచుకుంటుంది అని ట్రంప్ వివరించారు.

ఆఫ్ఘనిస్తాన్‌ను ఉగ్రవాదులకు అప్పగించం

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదంపై అమెరికా పోరాడుతుందని, టెర్రరిస్టు లకు నిలయంగా ఆఫ్ఘనిస్తాన్‌ను మరో సారి మార్చదని ఆయన తెలిపారు. దేవుడు మిమ్ములను అందర్నీ ఆశీర్వదించాలి అన్న వాక్యంతో అమెరికా అధ్యక్షుడు తన ప్రసంగం ముగించారు. బిల్ క్లింటన్ అనంతరం దాదాపు రెండు దశాబ్దాల తర్వాత దావోస్ సదస్సుకు హా జ రై న రెండవ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ నిలిచారు.



ఇదే మంచి తరుణం.. పెట్టుబడులకు స్వాగతం

అమెరికా మరోసారి వాణిజ్యానికి తలుపులు తెరిచిందనే సందేశాన్ని ఇవ్వడానికి నేను ఇక్కడకు వచ్చాను. మీ వ్యాపారాలు, మీ ఉద్యోగాలు, మీ పెట్టుబడులను అమెరికాకు తీసుకురావడానికి ఇదే మంచి సమయం అని ట్రంప్ స్వాగతం పలికారు. ప్రతిఫలాలు అందించే ఒక వాతావరణాన్ని మేము సృష్టిస్తున్నాము. అమెరికా రండి. నేను అమెరికాను నమ్ముతాను. అధ్యక్షుడిగా సతతం అమెరికా ఫస్ట్‌ను విశ్వసిస్తుంటాను. ప్రపంచ నేతలందరూ వారి దేశం పట్ల అదే భావన కలిగి ఉండాలి. కానీ అమెరికా ఫస్ట్ అంటే అమెరికా మాత్రమే అని కాదు అని ఆయన తెలిపారు.

ఏదో ఒక దేశం నియమ, నిబంధనలను పాటించని పక్షంలో స్వేచ్ఛ, బహిరంగ వాణిజ్యం ఉండదని నొక్కి వక్కాణించారు.

ఒక అధ్యక్షుడిగా తన దేశం, ఉద్యోగులు, కంపెనీల ప్రయోజనాలను ఎల్లప్పుడూ పరిరక్షిస్తుంటానని ట్రంప్ తెలిపారు.

కేవలం ఒక్క దేశానికి మాత్రమే కాక అన్ని దేశాల కోసం పనిచేసే ఒక వ్యవస్థను మనం సృష్టించగలమా... అనేక ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నాము. మరిన్ని దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నాము అని ఆయన చెప్పారు.

గంట ముందే హాలు కిటకిట

డబ్ల్యూఈఎఫ్ సదస్సు జరుగుతున్న ప్రాంగణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగానికి ఉద్దేశించిన అతి పెద్దదైన సమావేశ మందిరం ఆయన రావడానికి గంట ముందే సభికులతో కిటకిటలాడిపోయింది. ఆయన ప్రసంగాన్ని బహిష్కరించాలని కొందరు ఆఫ్రికా అధికారులు నిర్ణయించినప్పటికీ అనేక మంది సమావేశ మందిరంలోకి కాలుపెట్టలేక పోయారు. అమెరికా అధ్యక్షుడు వేదికను ఎక్కుతుండగా స్విట్జర్లాండ్ బ్యాండ్ వాద్య సంగీతం ఆయనకు స్వాగతం పలికింది.

ఉపాధికి ఊపిరిగా..

స్టార్టప్స్

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగించారు. దేశంలో పరిశోధనా రంగానికి మరింత ప్రాధాన్యత పెరగాల్సిన అవకాశం ఉందని, అందుకోసం దేశంలోని పరిశోధనా సంస్థలు, ఉన్నత విద్యాసంస్థలు మరింత చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రైవేట్ రంగంలో పెద్ద సంస్థలు చేస్తున్న పరిశోధనలతో దేశంలోని అకడమిక్ రిసెర్చ్‌ని సమ్మిళితం చేసినపుడు మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. పరిశోధనా కార్యక్రమాలతో పాటు వాటి ఫలితాల ఆధారంగా ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉండేలా చూడాలని కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సిలికాన్ వ్యాలీలోని సంస్థలు జరుపుతున్న పరిశోధనలే వాటి విజయాలకు కారణమని అన్నారు. హైదరాబాద్‌లో 50 పరిశోధనా సంస్థలను అనుసంధానం చేస్తూ రిచ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశోధనా ఫలితాలను మార్కెట్‌లోకి తెచ్చేందుకు రిచ్ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. ఇస్రోలాంటి భారతీయ సంస్థలు తమ పరిశోధనా పటిమను సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటాయని, అతి తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఇస్రో విజయం నిరూపిస్తుందని కేటీఆర్ అన్నారు.

తమ ప్రభుత్వం టి-వర్క్స్ ద్వారా హార్డ్‌వేర్ రంగంలోనూ త్వరలోనే పరిశోధనా చేసే అవకాశం కనిపిస్తోందని చెప్పారు. విద్యార్థుల్లో పరిశోధనాలపట్ల ఆసక్తి నెలకొల్పేలా చేసేందుకు శాస్త్రీయ పరిశోధనలపట్ల వారిలో ఒకదృక్పథాన్ని పెంచేప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పరిశోధనల ద్వారానే వర్ధమాన దేశాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు వేగవంతమైన పరిష్కార మార్గాలు లభిస్తాయని, పరిశోధనా ఫలితాలు, పేటెంట్లు, మేథోసంపత్తిని కాపాడేందుకు తెలంగాణ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ క్రైమ్ యూనిట్ (టిప్యూ)ను ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. టిప్యూ మాదిరిగా ప్రతి రాష్ట్రం ఈ నమూనాను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు లేఖలు రాశామని ఆయన చెప్పారు.

ప్రముఖ పవన విద్యుత్ సంస్థ సుజ్లాన్ చైర్మన్ తులసి తంతితో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. సోలార్ విద్యుత్ ఉత్పాదనలో తెలంగాణ ముందు వరుసలో ఉందని మంత్రి వివరించారు. సౌర, పవన విద్యుత్ రంగంలో పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా సౌర విద్యుత్ నిల్వ సౌకర్యం మరింత అందుబాటులోకి వస్తే ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. తెలంగాణలో పవన విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సుజ్లాన్ ఆసక్తిగా ఉందని తులసి తంతి చెప్పారు. వ్యవసాయ రంగం బలోపేతం కోసం తాము చేపట్టిన చర్యలవల్ల రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ బాగా పెరుగుతుందని, ఈ మేరకు ఉత్పత్తి కూడా పెరగాల్సి ఉందని మంత్రి అన్నారు. పవన విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని తులసి తంతికి ఈ సందర్భంగా వివరించారు.

సెల్ఫ్ ఫోర్స్ సీఈవో మార్క్ బెనియఫ్ మంత్రి కేటీఆర్‌కు దావోస్‌లో ప్రత్యేక లంచ్ ఏర్పాటు చేశారు. అనంతరం తెలంగాణ లాంజ్‌లో జరిగిన సమావేశంలో ఈ సంస్థ ప్రెసిడెంట్ అమీ వియోతో సమావేశం అయ్యారు.

హెచ్-1బి వీసాలపై మరో బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

రిపబ్లికన్ సెనేటర్లు సభలో వివరించారు. పరిమితి పెంచితే అమెరికాకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పరిమితి పెంచడంతో ఉద్యోగులకు ఎంతో ఊరట లభిస్తుందని, న్యాయపరంగా వారు ఒక ఉద్యోగం నుండి మరో ఉద్యోగానికి వెళ్లే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఇందులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే వీలుంటుందని ఆరిన్ హాచ్, జెఫ్ఫ్ ఫ్లాక్‌లు వివరించారు. ఈ బిల్లుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ అమెరికన్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, వాణిజ్య రంగ సంస్థలు, యూఎస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్‌తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీ కౌన్సిల్ కూడా ఆమోదించాలని కోరుతున్నాయని వారు గుర్తు చేశారు. ఈ బిల్లుకు ఆమోదం తెలిపితే.. ప్రపంచంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఎక్కడ అయితే అమెరికన్ కార్మికులు తక్కువగా ఉన్నారో అక్కడ పరిశ్రమల కోసం హెచ్1బీ వీసా అందుబాటులోకి ఉందని పేర్కొన్నారు. హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌లో సంస్కరణలు, మోస పూరిత కుట్రలు తగ్గించి, వర్కర్లను కాపాడుతుందని, ఎక్కువ ప్రతిభావంతులైన వర్కర్లకు గ్రీన్ కార్డు సౌలభ్యాన్ని పెంచుతుందని వారు సభలో వివరించారు. గతంలో కూడా కాంగ్రెస్ సెనేటర్లు బిల్లును రెండు సార్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అమెరికాకు ప్రతిభావంతుల అవసరం ఎంతో ఉందని గుర్తు చేశారు. మెరిట్ ప్రాతిపదికన వలసదారులను ఎన్నుకుంటే భవిష్యత్‌లో ఎంతో తోడ్పతుందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలా కంపెనీలు అమెరికాలో కూడా ఉన్నాయని, హెచ్1బీ వీసాల పరిమితి పొడగింపుతో వివిధ రంగాల నిపుణులతో టెక్నికల్ రంగంలో ఖాళీలు భర్తీ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల నుండి వసూలు చేసిన ఫీజులను ఎస్‌టీఈఎం వర్కర్ల శిక్షణ, విద్యను ప్రమోట్ చేయడానికి ఉపయోగించాలని సెనేటర్లు కోరారు. అమెరికాకు నైపుణ్యమైన ఇమ్మిగ్రేషన్ సిస్టమ్ కావాలని హాచ్ అన్నారు. వీసా ఫీజులను పెంచడంతో వచ్చిన మొత్తాన్ని ఎస్‌టీఎం విద్యకు, వర్కర్ శిక్షణ కార్యక్రమాలకు 1 బిలియన్ డాలర్ల కొత్త ఫండింగ్‌ను అందించామని రిపబ్లికన్ సెనేట్‌లు ఆరిన్ హాచ్, జెఫ్ఫ్ ఫ్లాక్‌లు చెప్పారు. అందరూ పెద్ద మనస్సుతో బిల్లు గెలుపునకు కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. డిమాండ్‌కు తగిన విధంగా హెచ్1బీ వీసాలను సరఫరాకు అనుమతి ఇవ్వాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తుందని చెప్పారు. ప్రస్తుత బిల్లు 20వేల అమెరికన్ మాస్టర్స్ డిగ్రీ అభ్యర్థులకు విరుద్ధంగా ఉందని వివరించారు. ఏడాదికి హెచ్1బీ వీసాల జారీని 65వేల నుండి 85వేలకు పెంచింది.



ఇక లాటరీ వీసాలకు స్వస్తి! - ప్రతిపాదించిన డొనాల్డ్ ట్రంప్

లాటరీ పద్ధతిలో వీసాలు పొందే వ్యవస్థకు స్వస్తి పలకాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. దీంతో దేశీయ వర్కర్లు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇది ప్రావిణ్యం ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ బిల్లుకు చట్టరూపం దాల్చితే ఐటీ సెక్టార్‌లో పనిచేస్తున్న వేలాది మందికి ఎంతో లాభదాయకం కానుంది. కొన్ని సంవత్సరాలుగా గ్రీన్ కార్డు కోసం వేచి చూస్తున్నవారికి ఇది శుభవార్తే అని చెప్పుకోవచ్చు. చట్టసభలో కాంగ్రెస్ దీనికి ఒప్పుకుంటే వ రాత్రం నైపుణ్యం ఉన్నవారికి ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతీఏడాది ది డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్ కింద సుమారు 50వేల మందికి అమెరికా పరిపాలనాశాఖ గ్రీన్‌కార్డులు జారీ చేస్తున్నది. గ్రీన్‌కార్డు పొందితే అమెరికాలో శాశ్వతంగా నివాసం ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న వీసా జారీ విధానంపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఇలాంటి విధానాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న వీసా విధానాలతో పాటు గొలుసుకట్టు వీసాతో ఉగ్రవాదులు అమెరికా వచ్చి న్యూయార్క్‌లో దాడికి పాల్పడ్డారని ట్రంప్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకే లాటరీ పద్ధతిన ఇచ్చే వీసా విధానానికి స్వస్తి పలకాలని ట్రంప్ యోచిస్తున్నారని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అమెరికాకు ఉత్తమమైన, ప్రతిభావంతులైన ఉద్యోగులు ప్రస్తుతం ఉన్న వీసా విధానంతో రాలేకపోతున్నారని ట్రంప్ చెప్పారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించడం జరుగుతోందని, వెంటనే దీన్ని అమల్లోకి తెచ్చేందుకు బిల్లును ఉభయ సభలో ప్రవేశపెడ్తామని అధికారులు చెప్పారు.

నీట్‌లో ఒకే సెట్ ప్రశ్నాపత్రం

న్యూఢిల్లీ: అఖిల భారత స్థాయిలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్(ఎన్ఈఈటీ)లో ఈ ఏడాది నుంచి ఒక సెట్ ప్రశ్నాపత్రం మాత్రమే ఉంటుందని సీబీఎస్ఈ(సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇప్పటివరకు నీట్ ప్రవేశ పరీక్షను హిందీ, ఇంగ్లీష్ భాషలతో కలిపి మొత్తం 10 భాషల్లో వేరువేరు సెట్లుగా ప్రశ్నాపత్రాలను సీబీఎస్ఈ రూపొందించేది. ఈ తీరును నిరసిస్తూ సంకల్ప్ అనే చారిటబుల్ ట్రస్ట్.. ఒకే సెట్ ప్రశ్నాపత్రాన్ని రూపిందించేవిధంగా సీబీఎస్ఈకి నిర్దేశకాలను జారీచేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, ఎఫ్ ఎ నజీర్‌లతో కూడిన ధర్మాసనం సీబీఎస్ఈ స్పందనను కోరింది. అంతకు ముందు విచారణలో భాగం గా ధర్మాసనం సీబీఎస్ఈ వేరు వేరు భాషల్లో ప్రశ్నాపత్రాల సెట్‌లను రూపొం దించడాన్ని వ్యతిరేకించింది. ప్రశ్నలు వేరువేరుగా ఉండటంవల్ల విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడం చాలా కష్టమని పేర్కొంది. ఈ ప్రక్రియ అసం బద్ధమని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో అన్ని సెట్లలో ప్రశ్నలు సమాన ప్రమా ణాలతో కఠినంగా ఉంటాయన్న సీబీఎస్ఈ వాదనను, కోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో ధర్మాసనం సూచనలను అంగీకరించిన సీబీఎస్ఈ ప్రస్తుత అకాడమిక్ సంవత్సరం నుంచి ఒకేసెట్‌తో కూడిన ప్రశ్నాపత్రాన్ని రూపొందిస్తామని దాన్ని మిగతా భాషల్లోకి అనువదిస్తామని శుక్రవారం కోర్టుకు తెలిపింది.

విహార యాత్రలో ఆరుగురు దుర్మరణం

కొల్హాపూర్, మహారాష్ట్ర: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విహార యాత్రకు బయలుదేరిన ఆరుగురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన తల్వాడ గ్రామానికి సమీపంలో చోటు చేసుకుంది. కారులో రత్నగిరికి వెళుతుండగా వారి కారు చెట్టును ఢీకొందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందినవారు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారని షాహువాడి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ గదే తెలిపారు. ముగ్గురు అక్కడిక్కడే మరణించగా మిగిలినవారు దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాయాలకు చికిత్స పొందుతూ మరణించారు. మృతులను సంతోష్ రౌత్(37), ఆయన భార్య స్నేహల్(32), వారి ఆరేళ్ల కుమారుడు స్వానంద, ప్రశాంత్ పతాంకర్, కారు యజమాని దీపక్ షేల్‌కండే(40), ఆయన మూడేళ్ల కుమారుడు ప్రణవ్‌గా గుర్తించారు. సంతోష్, ప్రశాంత్, దీపక్‌లు పూనెలోని యార్డీ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఐక్యూలో ఐన్‌స్టీన్‌ను తలదన్నాడు

- ఇంగ్లండ్‌లో భారత సంతతి బాలుడి ఘనత



లండన్: మెన్సా ఐక్యూ టెస్ట్‌లో గరిష్టంగా 162 మార్కులు సాధించిన భారతీయ సంతతికి చెందిన పదేళ్ళ బాలుడు మెహుల్ గార్గ్ అదే విషయంలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లను మించిపోయాడు. మెన్సా ఐక్యూ సొసైటీలో సభ్యత్వం పొందిన అతి పిన్న వయస్కుడిగా పేరు పొందాడు. అతడి అన్నయ్య 13 ఏళ్ళ ధ్రువ్ గార్గ్ గత ఏడాది ఇదే పరీక్షలో అత్యధికంగా 162 మార్కులు సాధించాడు. అన్న కన్నా తెలివితేటల్లో తానేమీ తక్కువ కాదని నిరూపించడానికి మెహుల్ ఐక్యూ టెస్ట్‌కు హాజరయ్యాడని అతడి తల్లి దివ్యా గార్గ్ తెలిపింది.

మెహుల్ సాధించిన స్కోరు ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ కన్నా రెండు మార్కులు ఎక్కువ. ఫలితాలు చూడగానే తన కళ్ల నుంచి ఆనంద భాష్పాలు వచ్చాయని మెహుల్ తెలిపాడు. బడిబాలుడిగా క్రికెట్, ఐస్ స్కేటింగ్ ఆటలను ఇష్టపడే మెహుల్‌కు చదువుల్లో గణితశాస్త్రమంటే ఎంతో ఇష్టం. గూగుల్ లాంటి భారీ టెక్ కంపెనీకి అధినేత కావడం తన జీవితాశయమని అతడు చెప్పాడు.

ఫేస్‌బుక్ పెండ్లి... పెటాకులే

అహ్మదాబాద్: ఫేస్‌బుక్ ద్వారా కుదుర్చుకున్న పెండ్లి విఫలమవుతుందని గుజరాత్ హైకోర్టు వ్యాఖ్యానించింది. కనుక తెగిపోతున్న వైవాహిక బంధాన్ని ముడివేసుకోవాలని ఒక జంటకు సూచించింది. తన భర్త, అత్తమామలు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ రాజ్‌కోట్‌కు చెందిన ఫాన్సీ షా దాఖలు చేసిన గృహ వేధింపు పిటిషన్‌పై విచారణ చేపట్టిన సందర్భంగా జస్టిస్ జె.బి.పర్దీవాలా పై వ్యాఖ్యలు చేశారు.

ఇద్దరూ పెండ్లి చేసుకున్న రెండు నెలల్లోనే వారి వైవాహిక జీవితంలో సమస్యలు పుట్టుకొచ్చాయి. అయితే ఇరు వర్గాలు వ్యవహారాన్ని పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. కానీ పరిష్కారం ఇంకా రాలేదు అని జడ్జీ పేర్కొన్నారు. నవసరి వాసి జైదీప్ ఇంజినీరింగ్ చదువుతుండగా 2011లో ఫేస్‌బుక్ ద్వారా ఫాన్సీతో పరిచయం ఏర్పరుచుకున్నాడు. ఇరువురు పెద్దల అంగీకారంతో 2015, ఫిబ్రవరిలో మూడు ముళ్ళ బంధంతో ఒక్కటయ్యారు. పెండ్లి అయిన రెండు నెలల్లోనే వారి వైవాహిక బంధం బీటలు వారింది.

కట్నం కోసం తనను వేధిస్తూ గృహ హింసకు పాల్పడుతున్నారంటూ జైదీప్, ఆయన సోదరుడు పీయూష్, తల్లిదండ్రులు వికేష్‌భాయి, అనితాబెన్‌లపై ఫాన్సీ ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేసును కొట్టివేయాలని అభ్యర్థిస్తూ జైదీప్, అతడి కుటుంబ సభ్యులు 2016లో హైకోర్టును ఆశ్రయించారు. భార్యాభర్తలిద్దరూ ఇరవైల్లోనే ఉన్నారు కాబట్టి విడాకులు తీసుకొని కొత్త జీవితాన్ని ఆరంభించాలని జడ్జి సూచించారు. అభియోగాలు జైదీప్‌పైన ఉన్నాయి కాబట్టి అతడి తల్లిదండ్రులపై కేసును కొట్టివేశారు. కానీ చట్టప్రకారం జైదీప్‌పై దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించారు.

ద.కొరియా ఆసుపత్రిలో

భారీ అగ్ని ప్రమాదం

- 41 మంది మృతి, 80 మందికి పైగా గాయాలు

సియోల్: దక్షిణ కొరియాలోని జియోంగ్‌సంగ్‌నం దొ రాష్ట్రం, మిర్యాంగ్ పట్టణంలో ఉన్న సిజోంగ్ ఆస్పత్రిలో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో కనీసం 41 మంది మృత్యువాత పడగా, 80మందికి పైగా ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అగ్నిమాపక సిబ్బంది మీడియాకు తెలిపారు. చాలామంది పొగ పీల్చడంతోనే మరణించారని వారు చెప్పారు. మృతుల్లో ఒక డాక్టరు, నర్సు, ఆమె సహాయకురాలు ఉన్నారన్నారు. ఈ ప్రమాదాన్ని దశాబ్దంలో సంభవించిన అతి పెద్ద దుర్ఘటనగా స్థానిక మీడియా పేర్కొంది. అగ్ని కీలల నుంచి తప్పించుకోవడానికి రోగులు సహాయక హెలీకాప్టర్లు వదిలిన తాళ్లను పట్టుకొని వేళ్లాడుతున్న వీడియోలు, కిటికీలనుంచి నిచ్చెనలను ఎక్కుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్నాయి. ఆరు అంతస్తులున్న ఆస్పత్రిలోని మొదటి అంతస్తులోని ఎమెర్జెన్సీ రూమ్‌లో ఉదయం 7.30 గంటలకు అకస్మాత్తుగా మంటలు లేచాయని ఇద్దరు నర్సులు అగ్నిమాపక విభాగం చీఫ్ చియోమాన్ వూకు చెప్పారు. క్రమంగా మంటలు రెండు, మూడో అంతస్థులకు విస్తరించాయన్నారు. అత్యవసర మెట్ల దారిలో దట్టంగా పొగ కమ్ముకోగా ఊపిరాడక చాలామంది రోగులు చనిపోయారని చెప్పారు. కాగా ప్రమాదంకు కారణంను ఇంకా గుర్తించలేదని చియోమాన్ తెలిపారు. ఈ కాంపౌండ్‌లో రెండు భవనాలున్నాయని ఒకటి ఆస్పత్రికాగా మరొకటి నర్సింగ్ హోం అని ఆయన చెప్పారు. నర్సింగ్ హోం నుంచి 94 మంది రోగులను, ఆస్పత్రిలోని రోగులను మరో ఆస్పత్రికి తరలించామన్నారు. గాయపడ్డవారి సంఖ్య ఎక్కువగా ఉందని వారికి చికిత్స కొనసాగుతున్నదని ఆయన తెలిపారు. చాలా మంది బాధితులు మొదటి, రెండు అంతస్థుల్లో ఉన్న వారేనని చియోమాన్ తెలిపారు. ప్రమాద సమంయలో ఆస్పత్రిలో సుమారు 200 మంది ఉన్నారన్నారు. కాగా, దేశ అధ్యక్షుడు మూన్ జె ఇన్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రమాదంపై దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరికొన్ని వారాల్లో దేశంలో ప్రారంభం కానున్న శీతాకాల ఒలింపిక్ క్రీడల్లో పాలుపంచుకునేందుకు వస్తోన్న అంతర్జాతీయ అథ్లెట్లు, పర్యాటకులు.. ఈ ప్రమాదం నేపథ్యంలో అక్కడి భద్రతా ఏర్పాట్లను శంకించే అవకాశముందని స్థానిక మీడియా పేర్కొంది.





త్రివర్ణ పతాకానికి వందనం చేస్తున్న రాష్ట్రపతి కోవింద్, ఆసియాన్ దేశాధినేతలు



రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



ప్రధాని మోడీతో రాష్ట్రపతి కోవింద్ కరచాలనం

ఘన తంత్ర వేడుకలు

- ✦ జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి
- ✦ పది ఆసియాన్ దేశాల నాయకులకు ప్రధాని మోడీ సాదర స్వాగతం
- ✦ ఆత్మీయ అతిథుల మధ్య అబ్బురపరిచిన త్రివిధ దళాల ప్రదర్శనలు
- ✦ ఆలోచింపజేసిన శకటాలు ✦ విదేశాల్లోనూ గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ: 69వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఢిల్లీలోని రాజ్‌పథ్ లో కన్నులపండువగా జరిగిన ఈ వేడుకలను చూసి 10 మంది ఆసియన్ దేశాల నాయకులు మంత్రముగ్ధులయ్యారు. భారత సైన్యం ప్రతిభాపాటవాలు, సాంస్కృతిక వైభవం, భిన్నత్వంలో ఏకత్వం చూసి మైమరచిపోయారు. 10 ఆసియన్ దేశాధినేతలు భారత రిపబ్లిక్ డేకు అతిథులుగా హాజరుకావడం ఇదే మొదటిసారి. దేశ రాజధాని న్యూఢిల్లీ దట్టమైన పొగమంచు కమ్మేసినా.. చలి వణికిస్తున్నా.. వేన్నీ లెక్కచేయకుండా రాజధాని నడిబొడ్డున ఉన్న రాజ్‌పథ్ వైపు వందలాదిమంది కదిలారు. రైసినా హిల్స్ నుంచి రాజ్‌పథ్ వరకు (8 కి.మీపైనా) నిర్వహించిన గ్రాండ్ మార్చ్ ను చూసేందుకు ఉత్సాహంగా అడుగులేశారు. రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఎగరవేయగానే రిపబ్లిక్ డే వేడుకలు ప్రారంభమయ్యాయి. త్రివిధ దళాధిపతి అయిన రాష్ట్రపతి మొదటి రిపబ్లిక్ డే సెల్యూట్ ఆర్మీ నుంచి స్వీకరించారు. రాష్ట్రపతికి సెల్యూట్ చేస్తూ జవాన్లు 10 ఆసియన్ దేశాల జాతీయ జెండాలతో మార్చ్ నిర్వహించారు. మార్షల్ ఆహ్లాదకరమైన సంగీతం మధ్య మార్చ్ సాగింది. పారామిలిటరీ బలగాలు, ఢిల్లీ పోలీసులు కూడా స్టెప్ బై స్టెప్ గా ముందుకు కదిలారు. ఈ వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు, ప్రతిపక్షాల నాయకులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న త్రివిధ దళాల విన్యాసాలు

భారత ఆర్మీకి చెందిన టీ-90 యుద్ధ ట్యాంకర్ (భీష్మ) తో విన్యాసాలు ప్రారంభమయ్యాయి., బాల్ వే మిషన్ పికెట్, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, ఆయుధాలను గుర్తించే రాడార్ (స్వాతి), బ్రిడ్జ్ లైయింగ్ ట్యాంక్ టీ -72, మొబైల్ బేస్ ట్రాన్స్‌సివర్ స్టేషన్, ఆకాష్ ఆయుధాల వ్యవస్థ తదితర మార్చ్‌లు ఆకర్షణీయంగా నిలిచాయి. మహిళాబీఎస్ఎఫ్ అధికారులు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై చేసిన విన్యాసాలు చూపరులను కట్టిపారేశాయి. సీమా భవాని పేరుతో మహిళా బీఎస్ఎఫ్ జవాన్లు కదులుతున్న బైక్ లపై వారు చేసిన స్టంట్స్ తో రాజ్‌పథ్ అంతా కరతాల ధ్వనులతో మారుమోగింది. ఫిష్ రైడింగ్, సప్తరుషి, బ్రహ్మ యోగా, జాతీయ జెండాతో నిర్వహించిన బైక్ మార్చ్ అబ్బురపరిచింది. మహిళా జవాన్లు బైక్ మార్చ్ నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ సహా రిపబ్లిక్ డేకు హాజరైన ప్రతీ ఒక్కరూ వారి స్టంట్స్ చూసి ఒకింత ఆశ్చర్యానికి గురై ఉత్సాహంగా తిలకించారు. జమ్ము కశ్మీర్‌లోని లడక్‌కు చెందిన మహిళా ఎస్సై స్టాంజిన్ నోర్యాంగ్ నేతృత్వంలో బైక్ విన్యాసాలు సాగాయి. దేశీయంగా నిర్మించిన ఆయుధ వ్యవస్థ అయిన ఫస్ట్ ఇంటిగ్రేటెడ్ హెలికాప్టర్ రుద్ర రిపబ్లిక్ సందర్భంగా విన్యాసాలు పాల్గొంది. రుద్రను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) రూపొందించి అభివృద్ధి చేసింది. ఆర్మీ విన్యాసాల తర్వాత ఆల్ ఇండియా రేడియో ప్రధాని మోడీ ప్రతీ నెల చివరి ఆదివారం రోజు నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమం ఉట్టిపడేలా రూపొందిన చిత్రంతో .. ఆదాయపు పన్ను శాఖ స్వచ్ఛ్ ధాన్, నల్లధనంపై యుద్ధం పేరుతో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ప్రత్యేకతలను వివరిస్తూ శకటాల ప్రదర్శనసాగింది. దాదాపు గంటన్నర పాటు సాగిన పరేడ్ ఎయిర్ ఫోర్స్ విన్యాసాలతో ముగిశాయి.

రాష్ట్రపతి భావోద్వేగం

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఓ క్షణంలో భావోద్వేగానికి గురయ్యారు. దేశ అత్యుత్తమ శౌర్య పురస్కారం అశోక చక్ర అవార్డు బహుకరణ సందర్భంగా కోవింద్ కంటతడి పెట్టారు. ఉగ్రవాదుల పోరులో అసువులు బాసిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గరుడ కమాండో జ్యోతి ప్రకాశ్ నిరాలా కు ప్రభుత్వం ప్రకటించిన అశోక చక్ర అవార్డును అమరుడి సతీమణి సుష్మాకు అందజేసిన తర్వాత ఒక్క క్షణం ఆయన అమరుడి త్యాగాన్ని స్మరించుకుని కన్నీరు పెట్టుకున్నారు. పురస్కారం బహుకరణ సందర్భంగా అమరుడు త్యాగాన్ని ఒక్కసారి స్మరించుకోవాలంటూ వినిపించిన క్షణంలో రాష్ట్రపతి తనలోని భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. ఆ తర్వాత తన కూర్చీలో ఆసీనులై జేబురుమాలుతో కన్నీళ్లు తుడుకుని భావోద్వేగాన్ని దిగమింగారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా 390 మందికి రాష్ట్రపతి సాహస పురస్కారాలు లభించాయి. వీటిలో ఒక కీర్తి చక్ర, 14 శౌర్య చక్ర, 28 పరమవిశిష్ట సేవా పతకాలు, 4 ఉత్తమ యుద్ధ సేవా పతకాలు ఉన్నాయి. ఉత్తమ సేవలందించిన 27 మంది సీబీఐ అధికారులకు కూడా రాష్ట్రపతి పురస్కారాలు లభించాయి.

భారత సార్వభౌమత్వాన్ని చాటాలే ఎయిర్ ఫోర్స్ ప్రదర్శన సాగింది. పొగమంచులోనూ భారత వాయుసేన విన్యాసాలు చూపరులను కట్టిపారేశాయి. వెయిర్ ఫోర్స్ సీ-130 జే సూపర్ హెర్క్యూలెస్, సీ 17 గ్లోబ్ మాస్టర్, సుఖోయ్ -30 ఎంకేఐఎస్, లైట్ కాంబాట్ తేజాస్ , జాగ్వార్, మిగ్ -29 విమానాలు గగనతలంలో నిర్వహించిన ప్రదర్శనలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. జాతీయ సహాస అవార్డులు అందుకున్న 18 మంది సాహస బాలలు కూడా వేడుకల్లో పాల్గొన్నారు.వీరిలో ఇద్దరు బాలికలు, ఒక బాలుడికి మరణాంతరం అవార్డు వచ్చింది. ఢిల్లీ, నాగపూర్, డిమాపూర్ లోని స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు, డ్యాన్సులు అందర్నీ ఆకట్టుకున్నాయి. రిపబ్లిక్ డే సందర్భంగా ఉగ్రదాడులు జరగవచ్చున్న నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతాఏర్పాటు చేశారు. దాదాపు 60 వేల మంది పోలీసులు, పారామిలిటరీ భద్రతా బలగాలు ఢిల్లీలో మోహరించాయి.





ఆసియన్ దేశాధినేతలకు మోడీ సాదర స్వాగతం

రిపబ్లిక్ డే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశం కోసం అమరులైన జవాన్లకు ఇండియా గేట్ వద్ద ఉన్న అమర్ జ్యోతి వద్ద నివాళులర్పించారు. రంగులు పొదిగిన తలపాగాను ధరించి ముందుకు కదిలిన ప్రధాని.. 10 ఆసియన్ దేశాల నాయకులను వ్యక్తిగతంగా వేదికపైకి ఆహ్వానించారు. థాయ్ లాండ్,వియత్నాం, ఇండోనేసియా, ఫిలిప్పిన్స్, సింగపూర్, మయన్మార్, లావోస్,కాంబోడియా, బ్రూనై, దేశాధినేతలకు మోడీ సాదర స్వాగతం పలికారు.

ప్రోటోకాల్ పక్కనబెట్టిన మోడీ

గణతంత్ర దినోత్సవ వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి తన వినూత్న వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. రాజ్‌పథ్ వేదిక నుంచి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, 10 ఆసియన్ దేశాల ప్రతినిధులు వెళ్లిపోయిన తర్వాత మోడీ ప్రోటోకాల్ పక్కనబెట్టి.. రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించేందుకు వచ్చి భారీ జన సమూహానికి సమీపంగా నడుచుకుంటూ వెళ్లారు. జనాలకు అభివాదం చేస్తూ ఇండియా గేట్ వరకు మోడీ ముందుకు కదిలారు.మోడీ..మోడీ అంటూ నినాదాలు చేశారు. వారి అభివాదానికి ఉబ్బితబ్బిపోయిన మోడీ చేయి ఊపుతూ ముందుకసాగారు. భద్రతా సిబ్బంది.. నిఘా కెమెరాల్లో ప్రతీ అంగులాన్ని పరిశీలిస్తూ మోడీని అనుసరించారు. ప్రధానితో కలిసి నడిచేందుకు జనం ఆసక్తి చూపడంతో వారిని నియంత్రించడం భద్రతా సిబ్బందికి కష్టంగా మారింది. మోడీకి రక్షణగా నిలిచేందుకు ఎస్పీజీ పోలీసులు తీవ్రంగా శ్రమించారు. గతంలోనే మోడీ ప్రోటోకాల్ ను బ్రేక్ చేశారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజు బుల్లెట్ ఫ్రూట్ అద్దం వెనక నుంచి ప్రధానులు ప్రసంగించేవారు. కానీ మోడీ మాత్రం బుల్లెట్ ఫ్రూఫ్‌ను పక్కనబెట్టి ప్రసంగించారు.

ప్రతిబింభించిన భారత్- ఆసియన్ బంధం

69వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత్ తన మిత్ర దేశాలకు గుర్తుండిపోయే సందేశాన్నిచ్చింది. రిపబ్లిక్ డే కు హాజరైన 10 ఆసియన్ దేశాల ప్రతినిధులే ఇందుకు సాక్షంగా నిలిచారు. ఆసియన్ దేశాలతో భారతదేశానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక, మతపరమైన బంధాన్ని ప్రతిబింభించేలా రెండు అద్భుతమైన చిత్రాలతో శకటాలను ప్రదర్శించారు.. 23 రకాల రంగులతో నిర్వహించిన మార్చ్ అందర్ని దృష్టిని ఆకర్షించింది. ఆసియన్ - ఇండియా ఎట్ 25 పేరుతో విదేశాంగ శాఖ రూపొందించిన ఓ చిత్రంతో ప్రదర్శన సాగింది. ఇక మరో చిత్రంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రాచీన విశ్వవిద్యాలయం నలంద ను గుర్తు చేసుకున్నారు.

దావోస్‌లో ఘనంగా వేడుకలు

భారత గణతంత్ర వేడుకలు స్విట్జర్లాండ్‌లోని దావోస్ లోనూ ఘనంగా జరిగాయి. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రదాన్, అధికారులు..భారత రాయభార కార్యాలయం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు సందేశాన్ని వినిపించారు.

శ్రీనగర్‌లో సూసైడ్ బాంబర్ అరెస్ట్

రిపబ్లిక్‌డే టార్గెట్‌గా జమ్మూ-కాశ్మీర్‌లో ఓ యువతి తనను తాను పేల్చుకునేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయింది. ఐసిస్‌తో టచ్‌తో యువతి ఆత్మాహుతి దాడికి యత్నించింది. పూణెకు చెందిన యువతి ఆత్మహుతికి యత్నిస్తున్నట్టు గుర్తించిన జమ్మూ పోలీసులు గురువారం రాత్రే అరెస్టు చేశారు. ఐసిస్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు యువతి రిపబ్లిక్ డేను టార్గెట్‌గా చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

గీత దాటిన ఆర్ఎస్ఎస్ అధినేత

✦ కేరళ పాఠశాలలో త్రివర్ణ పతాకం ఎగురవేత

తిరువనంతపురం: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ పట్టణంలో ఒక ప్రైవేట్ పాఠశాల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. మూడు రోజుల ఆర్ఎస్ఎస్ సమావేశాల్లో పాల్గొనే నిమిత్తం ఆయన పాలక్కాడ్ వచ్చారు. సీబీఎస్ఈకి అనుబంధమైన ఉన్నత సెకండరీ పాఠశాల వ్యాస్ విద్యాపీఠానికి ఉదయం 9.30 గంటలకు కొందరు ఆర్ఎస్ఎస్ వర్గీయులతో చేరుకున్న భగవత్ జాతీయ జెండాను ఎగురవేశారు. తన ప్రసంగంలో రాజకీయాలను ఆయన ప్రస్తావించలేదు. గణతంత్ర దినోత్సవం రోజున విద్యా సంస్థలకు చెందిన హెడ్‌మాస్టర్లు లేదా ప్రిన్సిపాళ్లు మాత్రమే త్రివర్ణ పతాకం ఎగురవేయాలంటూ సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలకు రెండు రోజుల క్రితం ఒక సర్క్యులర్ జారీ చేసింది.

ఈ నేపథ్యంలో మోహన్ భగవత్ చర్య వివాదానికి దారి తీసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే భగవత్ చర్యను ఆర్ఎస్ఎస్ సమర్థించింది. ఆయన ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించారు లేదా అగౌరవపరిచారు అని అనడం సరికాదని పేర్కొంది.

సరిహద్దుల్లో స్వీట్స్ పంచుకోలేదు

వాఘా సరిహద్దు వద్ద భారత్ విముఖత

అమృత్‌సర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా అట్టారి-వాఘా సరిహద్దు వద్ద పాక్ రేంజర్లతో మిఠాయిలు ఇచ్చిపుచ్చుకోవడానికి సరిహద్దు భద్రతా బలగం (బీఎస్ఎఫ్) శుక్రవారం నిరాకరించింది. దీపావళి, ఈద్ లాంటి ముఖ్యమైన పండుగలు, జాతిపరంగా ప్రాముఖ్యత సంతరించుకున్న స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం లాంటి సందర్భాల్లో ఇరు పక్షాలు మిఠాయిలు ఇచ్చిపుచ్చుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. కానీ పాక్ బలగాలు అదేపనిగా కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలకు పాల్పడుతున్న కారణంగా జమ్మూకాశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ), నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వెంబడి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తం తారాస్థాయికి చేరుకుంది. దీంతో ఆనవాయితీకి భిన్నంగా ఈసారి మిఠాయిలు

(ఫైల్ ఫొటో)



పంచుకోలేదు. దాని వెనుక నిర్దేశిత కారణాలు ఉన్నాయి అని చెప్పడం ద్వారా బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కె.కె.శర్మ ఈ విషయాన్ని నిర్ధారించారు. భవిష్యత్తులో మంచి కారణాలు ఉంటేనే మిఠాయిలు ఇచ్చిపుచ్చుకోవాలని బీఎస్ఎఫ్ ఆకాంక్షిస్తోందని ఆయన తెలిపారు. రిపబ్లిక్ డే రోజున మిఠాయిలు ఇచ్చిపుచ్చుకోవడంలేదని పాక్ రేంజర్లకు గురువారమే చెప్పినట్టు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

ముగ్గురు దేశాధినేతలతో మోడీ ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ: ప్రధాని మోడీ మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, ఇండోనేషియా అధ్యక్షుడు జొకొ విడొడొ, లావోస్ ప్రధాని థొంగ్ లోవున్ సిసోలిత్‌తో శుక్రవారం విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరపారు. ఈ వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో కార్యదర్శి (తూర్పు) ప్రీతి శరన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మలేసియా ప్రధానితో మోడీ సమావేశం ఉగ్రవాదానికి దీటుగా సహకారం, తిరుగుబాటువాదం నిర్మూలన, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనా రంగంలో సహకారం పెంచే మార్గాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది.

ఆరో వరుసపై కాంగ్రెస్ ఆగ్రహం

- ✦ ఇది అవమానించడమే: కాంగ్రెస్ పార్టీ
- ✦ ప్రొటోకాల్ ప్రకారమే: ప్రభుత్వ వర్గాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రిపబ్లిక్ వేడుకల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఆరోవరుసలో సీటు కేటాయించడం వివాదాస్పదమైంది. రాహుల్‌గాంధీకి వెనుకసీటు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే పది ఆసియాన్ దేశాలకు చెందిన అధినేతలు ముఖ్యఅతిథులుగా హాజరైన నేపథ్యంలో దానికి అనుగుణంగా సీట్ల సర్దుబాటు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. ప్రొటోకాల్ ప్రకారం ప్రతిపక్ష పార్టీ నేతకు ఏడో వరుసలో సీటు కేటాయిస్తారని చెపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని రాజకీయం చేయడం చౌకబారు ప్రచార ఎత్తుగడ అని బిజెపి నేతలు విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాహుల్‌గాంధీకి వెనుక వరుసలో సీటు కేటాయించడం ఉద్దేశపూర్వక చర్య అని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా విమర్శించారు. రాహుల్ గాంధీని అవమానించాలనే ఉద్దేశంతో ఇలా వెనుకసీటు ఇచ్చారని అన్నారు. ప్రతిపక్ష నేతకు సంప్రదాయబద్ధంగా ముందువరుసలో సీటు కేటాయించడం అనవాయితీగా వస్తోందని, సంప్రదాయాలను బీజేపీ ఉల్లంఘిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ ఉన్న సమయంలోనూ రిపబ్లిక్ డే వేడుకల్లో ఆమెకు ముందు వరుసలో సీటు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని చిన్నబుచ్చే విధంగా ఈసారి వెనకసీట్లు ఇచ్చారని పేర్కొన్నారు. తొలుత నాలుగో వరసలో సీటు కేటాయించి, ఆ తర్వాత ఆరో వరుసకు మార్చడం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రొటోకాల్ అంశం కాదని, కనీస మర్యాద పాటించాలని మాజీ మంత్రి కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ప్రభుత్వంలో ఉన్న వ్యక్తి సీటింగ్ ను నిర్ణయించడం దురదృష్టకరమని, చరిత్రాత్మక కాంగ్రెస్ పార్టీకి అధినేతగా ఉన్న రాహుల్‌కు ముందువరుస సీటు ఇవ్వడం కనీస మర్యాద అని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నేత గులాం నబీ ఆజాద్‌తో కలిసి రాహుల్ గాంధీ ఆరోవరుస నుంచే రిపబ్లిక్ డే పరేడ్‌ను వీక్షించారు. ఎక్కడ కూర్చోవడమేని తాను పట్టించుకోనని, చౌకబారు ప్రచార ఎత్తుగడలు తమకు అవసరం లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే రిపబ్లిక్ డే వేడుకల్లో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ వృద్ధనేత ఎల్‌కె.అద్వానీ తదితరులు ముందువరుస సీటులో కూర్చోవడం విశేషం. ఆసియాన్ దేశాల అధినేతల కోసం వంద అడుగుల వెడల్పైన వేదికను ఏర్పాటు చేశారు. అయితే సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో రామ్‌నాథ్ కోవింద్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో రాహుల్‌గాంధీకి సముచిత స్థానం కల్పించారు. ఆసియాన్ దేశాధినేతలకు కేటాయించిన ఎంక్లోజర్‌లో ఆయనకు సీటు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోడీ, రాహుల్‌గాంధీ ఒకరినొకరు పలకరించుకున్నారు.







క్రీడాప్రభ



సైనాదే పైచేయి

● హోరా హోరీ క్వార్టర్స్‌లో సింధుపై గెలుపు ● ఇండోనేసియా మాస్టర్

జకర్తా: మాజీ ప్రపంచ నెంబర్ వన్ సైనా నెహ్వాల్... ఒలింపిక్ రజత పతక విజేత పీవీ సింధుపై పైచేయి సాధించింది. శుక్రవారం ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్ పోరులో సైనా వరుస గేమ్‌లలో విజయం సాధించింది. ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా చీలమండ గాయం నుంచి కోలుకొని టోర్నీలో అడుగుపెట్టింది. ఆమె 21-13, 21-19తో సింధుపై గెలిచింది. ప్రపంచ చాంపియన్ షిప్‌లో రజతం, కాంస్యం వశం చేసుకున్న సైనా... సెమీస్‌లో నాలుగో సీడ్ థాయ్‌లాండ్ షట్లర్ రచనోక్ ఇంటనోన్‌తో తలపడుతుంది. రచనోక్ మరో క్వార్టర్స్‌లో జపాన్‌కు చెందిన నజోమి ఒకుహరపై గెలిచింది. రచనోక్‌పై సైనాకు ఇప్పటివరకు 8 సార్లు గెలిచి 5 సార్లు ఓడిన రికార్డుంది.

సైనా దూకుడుగా...: భారత్ వెలుపల తొలిసారి సింధుతో తలపడిన సైనా అత్యుత్తమ ఆటతీరు కనబరిచింది. తొలి గేమ్‌లో 3-0 ఆధిక్యంలోకి వెళ్లిన అనంతరం సింధుకు అవకాశమివ్వలేదు. సింధు పోరాడి 4-4తో స్కోరు సమం చేసినప్పటికీ సైనా ఆధిపత్యం కొనసాగించింది. విరామానికి 11-9 ఆధిక్యంతో వెళ్లింది. విరామం తర్వాత కూడా నెహ్వాల్ జోరు కొనసాగించింది. ఆధిక్యాన్ని 18-10కి పెంచుకుంది. సింధు మరో మూడు పాయింట్లు గెలుచుకోగలిగినా సైనా తొలి గేమ్‌ను సొంతం చేసుకోకుండా నిలువరించలేకపోయింది. రెండో గేమ్‌లో ఇద్దరూ 3-3 స్కోరు వరకు తీవ్రంగా పోరాడారు. సింధు టాప్ గేర్ వేసి 10-5 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఐతే సైనా తిరిగి పుంజుకొని వరుసగా 5 పాయింట్లు సాధించి 10-10తో స్కోరును సమం చేసింది. 11-10ఆధిక్యంతో సింధు డ్రింక్స్ విరామానికి వెళ్లింది. అనంతరం స్కోరు 14-14 వరకు సింధు, సైనా నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. తర్వాత ఇద్దరు ఊపిరి సలపని సుదీర్ఘ ర్యాలీ ఆడారు. చివరకు సైనా 15-14 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ ఆధిక్యాన్ని ఆమె 17-14కు తీసుకువెళ్లింది. రెండో సీడ్ సింధు.. సైనాను దాటిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించింది. నెహ్వాల్ పట్టువిడవకుండా గేమ్‌ను, మ్యాచ్‌ను వశం చేసుకుంది. గత ఏడాది ఆగస్టులో ప్రపంచ చాంపియన్‌షిప్ తరువాత సైనాకిదే తొలి సెమీ ఫైనల్.





ఆటగాళ్లను మైదానం విడిచి వెళ్లమంటున్న అంపైర్ మైకేల్ గాఫ్

మర్‌క్రమ్ వికెట్‌తో షమి, సహచరుల సంబరం

పిచ్‌పై ఆందోళన

● ముందుగానే ఆగిన ఆట ● దక్షిణాఫ్రికా లక్ష్యం 241 ● ప్రస్తుతం 17-1 ● భారత్ 247 ఆలౌట్ ● రాణించిన రహానే, కోహ్లి ● కెప్టెన్‌గా విరాట్ రికార్డు పరుగులు

వాండరర్స్ పిచ్‌పై రగడ మొదలైంది. శుక్రవారం మూడో రోజు సాయంత్రం దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆరంభమై 8 ఓవర్లు పూర్తయిన తర్వాత 9వ ఓవర్లో బుమ్రా వేసిన మూడో బంతి ఓపెనర్ ఎల్గర్ తలకు తగలడంతో పిచ్ ప్రమాదకరంగా స్పందిస్తోందని అంపైర్లు మ్యాచ్‌ను నిలిపి వేశారు. రిఫరీ ఆండీ పై క్రాఫ్ట్ కూడా మైదానంలోకి వచ్చాడు. దీంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకున్నారు. కెప్టెన్లు సమావేశమయ్యారు. నిర్ణీత సమయం కంటే దాదాపు 15 నిమిషాల ముందు ఆట ఆగిపోయింది. నాలుగో రోజు మ్యాచ్ సాగేది అనుమానంగానే ఉంది. పిచ్‌పై బౌన్స్ ఒకే మాదిరిగా లేదంటూ గురువారం టీవీ కామెంటేటర్లు వ్యాఖ్యానించారు. ఇలాంటి పిచ్‌పై మ్యాచ్ ఎలా నిర్వహిస్తున్నారంటూ సునీల్ గవాస్కర్ కూడా విమర్శించాడు. మ్యాచ్ ఆగిపోయేసరికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోయి 17 పరుగులు చేసింది. గెలవాలంటే ఆ జట్టు ఇంకా 224 పరుగులు చేయాలి. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికాకు 7 పరుగుల ఆధిక్యం లభించడంతో ఆ జట్టు 241 స్కోరును ఛేదించాలి. కెప్టెన్‌గా టెస్టుల్లో అత్యధిక పరుగుల రికార్డు సాధనలో విరాట్ కోహ్లి.. ధోనీని అధిగమించాడు. కెప్టెన్‌గా ధోని 3454 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో 41 పరుగులు సాధించిన విరాట్ తన పరుగులను 3456కు పెంచుకున్నాడు.

జొహాన్నెస్‌బర్గ్: వాండరర్స్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ మెరుగ్గా ఆడింది. ఓవర్‌నైట్‌స్కోరు 49-1తో ఉదయం ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్ఇండియా టీ విరామం అనంతరం 247 పరుగులకు ఆలౌటైంది. వెంటనే ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా... ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. ఓపెనర్ మర్‌క్రమ్ (4) వికెట్ తీసి షమి .. భారత్‌లో ఆశలు రేపాడు. అయితే బుమ్రా బౌలింగ్‌కు దిగాక మూడో బంతి ఎల్గర్ తలకు తగలడంతో పిచ్ ప్రమాదకరంగా ఉందని అంపైర్లు ఆటను నిలిపివేశారు.

రాణించిన రహానే: తొలి రెండు టెస్టుల్లో జట్టులో చోటు లభించని రహానే (48, 68 బంతుల్లో, 6 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లో రాణించాడు. క్రీజులో 132 నిమిషాల పాటు నిలిచిన అతను రెండు పరుగుల తేడాతో అర్ధసెంచరీ చేజార్చుకున్నాడు. కెప్టెన్ కోహ్లి (41, 79 బంతుల్లో, 6 ఫోర్లు)తో కలిసి 5వ వికెట్‌కు 34 పరుగులు జోడించాడు. తరువాత కుమార్‌తో కలిసి ఏడో వికెట్‌కు 55 పరుగులు జత చేశాడు. ఉదయం ఓవర్‌నైట్ స్కోరుకు రెండు పరుగులు జత చేయగానే రాహుల్ (16) వెనుదిరిగాడు. పుజారా ఒక్క పరుగుకే ఔట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆ దశలో విరాట్, విజయ్ జట్టును ఆదుకున్నారు. విజయ్ (25) నాలుగో వికెట్‌గా వెనుదిరిగాక క్రీజులోకి వచ్చిన రహానే సాధికారికంగా ఆడాడు. విరాట్‌తో కలిసి భారత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపాడు.

వీరిద్దరు ఔటైన తర్వాత చివరి వరుస బ్యాట్స్‌మెన్ భువనేశ్వర్ (33, 76 బంతుల్లో, 2 ఫోర్లు), షమి (27, 28 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్స్) దక్షిణాఫ్రికా బౌలర్లను విసిగించారు. భువీ క్రీజులో పాతుకుపోగా.. షమి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రెండు భారీ సిక్స్‌లు బాదాడు. వీరిద్దరు కలిసి 8వ వికెట్‌కు 35 పరుగులు జోడించారు. ఫిలాండర్ 61 పరుగులకు, రబాడ 69 పరుగులకు, మోర్కెల్ 47 పరుగులకు మూడేసి వికెట్లు తీశారు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 187

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడ 25, పటేల్ (సి) మర్‌క్రమ్ (బి) ఫిలాండర్ 16, రాహుల్ (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, పుజారా (సి) డు ప్లెసిస్ (బి) మోర్కెల్ 1, కోహ్లి (బి) రబాడ 41, రహానే (సి) డి కాక్ (బి) మోర్కెల్ 48, పాండ్య (సి అండ్ బి) రబాడ 4, కుమార్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33, షమి (సి) డివిలియర్స్ (బి) ఎన్‌గిడి 27, ఇషాంత్ నాటౌట్ 7, బుమ్రా (సి) రబాడ (బి) ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 29, మొత్తం (80.1 ఓవర్లలో ఆలౌట్) **247**

వికెట్ల పతనం: 1-17, 2-51, 3-57, 4-100, 5-134, 6-148, 7-203, 8-238, 9-240, 10-247

బౌలింగ్: ఫిలాండర్ 21.1-5-61-3, రబాడ 23-5-69-3, మోర్కెల్ 21-6-47-3, ఎన్‌గిడి 12-2-38-1, ఫెహ్లుక్‌వాయో 3-0-15-0

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రమ్ (సి) పటేల్ (బి) షమి 4, ఎల్గర్ బ్యాటింగ్ 11, ఆమ్లా బ్యాటింగ్ 2, మొత్తం (8.3 ఓవర్లలో వికెట్‌కు) 17, **వికెట్ల పతనం:** 1-5, **బౌలింగ్:** కుమార్ 4-0-8-0, షమి 4-1-7-1, బుమ్రా 0.3-0-2-0.

పాక్ కాచుకో!

● క్వార్టర్ ఫైనల్లో బంగ్లాపై భారత్ ఘన విజయం ● గిల్ అర్ధసెంచరీ ● అభిషేక్ ఆల్‌రౌండ్ ప్రదర్శన ● అండర్ 19 ప్రపంచకప్

ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు దూసుకుపోతోంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో సెమీ ఫైనల్ పోరుకు సిద్దమైంది. సెమీ ఫైనల్ 30న క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతుంది. భారత్ శుక్రవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసి సెమీస్ చేరింది. శుభ్‌మన్ గిల్ (86) మరోసారి రాణించి జట్టు ఘన విజయంలో కీలక పాత్ర పోషించాడు. నగర్‌కోటి (3-18), శివమ్ మావి (2-27), అభిషేక్ (2-11) బంగ్లా పతనాన్ని శాసించారు. అభిషేక్ (50) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశాడు.

క్వీన్స్‌టౌన్ (న్యూజిలాండ్): అండర్ 19 ప్రపంచకప్‌లో భారత యువకులు మరోసారి అద్వితీయ ప్రదర్శనతో ఘనవిజయాన్ని సొంతం చేసుకున్నారు. అన్ని రంగాల్లోనూ పైచేయి అయిన క్వార్టర్ ఫైనల్ పోరులో భారత్ 131 పరుగుల తేడాతో బంగ్లాను మట్టికరిపించింది. 266 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లా అండర్ 19 జట్టు...భారత పేసర్లు నగర్‌కోటి, శివమ్ మావి, అభిషేక్‌ల విజృంభణలో 42.1 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. భారత్ లీగ్ మ్యాచ్‌లాడిన మౌంట్ మాంగనీలో మాదిరిగా బ్యాటింగ్‌కు అనుకూలించని పిచ్‌పై షా బృందం ఒక విధంగా మెరుగైన స్కోరే సాధించింది. భారత్ టాప్ ఆర్డర్‌కు తొలిసారి పరీక్ష ఎదురైంది. ఐతే మిడిలార్డర్ రాణించడంతో జట్టు భారీ స్కోరు సాధించగలిగింది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (86, 94 బంతుల్లో, 9 ఫోర్లు), అభిషేక్ (50, 49 బంతుల్లో, 6 ఫోర్లు), కెప్టెన్ షా (40, 54 బంతుల్లో, 5 ఫోర్లు) రాణించారు.



గిల్ 86

గిల్ దూకుడు

గిల్ వరుసగా మూడో అర్ధసెంచరీ సాధించాడు. అతను 94 బంతుల్లోనే 86 పరుగులు చేశాడు. షాతో కలిసి రెండో వికెట్‌కు 86 పరుగులు, దేశాయ్(34)తో కలిసి మూడో వికెట్‌కు 98 బంతుల్లో 74 పరుగులు జోడించాడు. ఆరంభంలోనే మన్‌జోత్ (9) వికెట్ కోల్పోవడంతో షా ఆచితూచి బ్యాటింగ్ చేశాడు. కానీ మరోవైపు గిల్ ఆరంభం నుంచే బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. బంగ్లా బౌలర్లు ఎంతగా క్రమశిక్షణతో బౌలింగ్ చేసినప్పటికీ గిల్ దూకుడు కారణంగా భారత్ 10 ఓవర్లలో 71 పరుగులు సాధించింది. షా అర్ధసెంచరీ వైపు దూసుకుపోతున్న తరుణంలో మీడియం పేసర్ ఖాజి లెంత్ బాల్‌తో షాను కంగుతినిపించాడు. బంతి షా బ్యాట్ అంచును తీసుకొని వికెట్లను గిరాటేసింది. అనంతరం దేశాయ్‌తో కలిసి గిల్ స్ట్రయికింగ్‌ను మారుస్తూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. భారత్ 2 వికెట్లకు 176 పరుగులతో సజావుగా సాగిపోతున్న తరుణంలో బంగ్లా బౌలర్లు మరోసారి దెబ్బ తీశారు. బంగ్లా బౌలర్ల విజృంభణలో భారత్ 239 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. దేశాయ్, గిల్ వెంటవెంటనే వెనుదిరగారు. ఆ దశలో అభిషేక్ ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను భుజాన వేసుకున్నాడు. సీనియర్ పార్టనర్ పరాగ్ (15)తో కలిసి క్రీజులో కుదురుకున్నాక అభిషేక్ పరుగుల వేగాన్ని పెంచాడు. అభిషేక్ 9వ వికెట్‌గా వెనుదిరిగాక మరో మూడు బంతులకే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

బంగ్లా విలవిల

266 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా.... భారత్ పేసర్ల దాటికి విలవిల్లాడింది. ఓపెనర్ పినక్ ఘోష్(43, 75 బంతుల్లో, 3 ఫోర్లు) ఒక్కడే ప్రతిఘటించాడు. అతను సహనంతో 75 బంతులెదుర్కొని 43 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తక్కిన బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలం కావడంతో 42.1 ఓవర్లలోనే బంగ్లా కథ ముగిసింది. క్రమం తప్పకుండా వికెట్లు కూలడంతో బంగ్లా కోలుకోలేకపోయింది. ఆ జట్టు ఆది నుంచి లక్ష్యాన్ని అందుకనే పరిస్థితి కనిపించలేదు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన అభిషేక్ మూడు క్యాచ్‌లలూ అందుకోవడం విశేషం. మరో క్వార్టర్స్‌లో దక్షిణాఫ్రికాను పాక్ ఓడించింది. రెండో సెమీస్‌లో అఫ్గాన్, ఆసీస్ తలపడతాయి.

స్కోరు బోర్డు

భారత్ అండర్ 19: షా (బి) ఖాజి ఒనిక్ 40, మన్‌జోత్ కల్రా (సి) తౌహిద్ (బి) రొబియుల్ 9, శుభ్‌మన్ గిల్ (సి) మహిదుల్ (బి) నయీమ్ 86, దేశాయ్ (బి) నయీమ్ 34, పరాగ్ (సి) సైఫ్ (బి) ఖాజి 15, అభిషేక్ (సి) మహిదుల్ (బి) హసన్ 50, నగర్ కోటి (సి) మహిదుల్ 5, అనుకూల్ రాయ్ రనౌట్ 2, శివమ్ మావి (సి) అమినుల్ (బి) సైఫ్ 5, శివ సింగ్ (బి) సైఫ్ 3, పొరేల్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 16, మొత్తం (49.2 ఓవర్లలో ఆలౌట్) **265**

వికెట్ల పతనం: 1-16, 2-102, 3-176, 4-181, 5-215, 6-231, 7-239, 8-251, 9-265, 10-265

బౌలింగ్: హసన్ 8-0-55-1, రొబియుల్ 5-0-34-1, ఖాజి ఒనిక్ 10-0-48-3, అఫిఫ్ 8-0-46-0, నయీమ్ 10-0-36-2, సైఫ్ 8.2-0-41-2

బంగ్లాదేశ్ అండర్ 19: పినక్ ఘోష్ (సి) పొరేల్ (బి) రాయ్ 43, మహ్మద్ నయీమ్ (సి) షా (బి) శివమ్ మావి 12, సైఫ్ (సి) అభిషేక్ (బి) నగర్ కోటి 12, తౌహిద్ రనౌట్ (శివమ్ మావి) 9, అఫిఫ్ (సి) పరాగ్ (బి) అభిషేక్ 18, అమినుల్ రనౌట్ (నగర్‌కోటి) 3, మహిదుల్ (బి) శివమ్ మావి 10, ఖాజి (బి) అభిషేక్ 0, నయీం (బి) నగర్ కోటి 11, హసన్ (సి) అభిషేక్ 0, రొబియుల్ నాటౌట్ 14, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం (42.1 ఓవర్లలో ఆలౌట్) **134**

వికెట్ల పతనం: 1-23, 2-55, 3-76, 4-79, 5-85, 6-106, 7-107, 8-118, 9-119, 10-134, **బౌలింగ్:** శివమ్ మావి 8-2-27-2, పొరేల్ 5-2-8-0, నగర్‌కోటి 7.1-1-18-3, పరాగ్ 5-0-25-0, శివమ్ సింగ్ 7-0-29-0, అనుకూల్ రాయ్ 5-1-14-1, అభిషేక్ 5-1-11-2.

అదిగో... టైటిల్ నెం.20

స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్... కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. రోజర్... ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశించాడు. దక్షిణకొరియా సంచలనం చంగ్‌పై శుక్రవారం నాటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో విజయం... ఈ దిగ్గజాన్ని ఆదివారం మారిన్ సిలిక్‌తో తుది పోరుకు సిద్ధం చేసింది. గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన దక్షిణకొరియా ఆటగాడిగా చరిత్ర సృష్టించిన చంగ్ పోరాటం విషాదకరంగా ముగిసింది. 1-6, 2-5తో వెనుకబడి గాయం కారణంగా సెమీస్ పోరు నుంచి చంగ్ తప్పుకున్నాడు.

● ఫైనల్లో ఫెదరర్ ● సిలిక్‌తో రేపు అమీతుమీ ● గాయంతో తప్పుకున్న చంగ్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్ 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు మరింత చేరువయ్యాడు. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఫెదరర్ 6-1, 5-2తో ఆధిక్యంలో ఉండగా చంగ్ పాదం గాయంతో వైదొలగాడు. అంతకు రెండు గేమ్‌లకు ముందు తన ఎడమ పాదానికి మెడికల్ టైమౌట్‌లో చికిత్స చేయించుకున్నాడు. కానీ 21 ఏళ్ల చంగ్ ఆశ్చర్యకరంగా రెండో సెట్లో 2-5తో వెనుకబడి ఉన్న దశలో ఓటమిని అంగీకరిస్తూ పోరు నుంచి తప్పుకున్నాడు. దీంతో ఫెదరర్ ఫైనల్లో ప్రవేశించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్విస్ దిగ్గజానికిది ఏడో ఫైనల్. ఆదివారం ఇక్కడ గెలిస్తే ఆరో టైటిల్ అవుతుంది. 2014 యుఎస్ ఓపెన్ చాంప్ సిలిక్‌పై రోజర్‌కు 8-1 రికార్డుంది. గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్స్‌లో అతను 30 సార్లు గెలిచి 13 సార్లు ఓటమి చవి చూశాడు. ఈ ఏడాది ఇక్కడ ఇంతవరకు ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. ''చివరి వరకు ఏమీ చెప్పలేం'' అని చంగ్ గాయం సమస్యల గురించి ఫెదరర్ వ్యాఖ్యానించాడు. ''అందుకే అతను రిటైరయ్యాడంటే చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ఇంజ్యూరీ టైమౌట్ తీసుకున్నపుడే ఏదో సమస్య ఉందనిపించింది. ఐతే చంగ్ చాలా ప్రశాంత చిత్తుడు. అతను ఇప్పటికే మేటి ఆటగాడిగా ఎదిగాడు. మరింత ఉన్నతమైన ఆటను సాధిస్తాడు. టాప్ 10లో తప్పక చేరతాడు'' అని రోజర్ అన్నాడు. వర్షం కురిసే సూచనలుండడంతో రాడ్ లెవర్ ఎరీనాలో పైకప్పును లాగి ఉంచారు. ఫెదరర్ ఇండోర్ రికార్డు మెరుగ్గా ఉండడంతో అతని విజయానికే అవకాశాలెక్కువ. చంగ్ ఓపెనింగ్ సర్వ్‌ను రోజర్ బ్రేక్ చేశాడు. మరో రెండు సార్లు కూడా బ్రేక్ పాయింట్లు సంపాదించాడు. చంగ్ పదే పదే అనేక తప్పులు చేయడంతో తొలి సెట్ 33 నిమిషాల్లోనే ముగిసింది. రెండో సెట్లో సైతం చంగ్ ఆటతీరు మారలేదు. ఫెదరర్ నాలుగో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సంపాదించాడు. అంతకుముందు చంగ్ పాదానికి చికిత్స కోసం ట్రెయినర్‌ను పిలిచారు. మరో రెండు గేమ్‌లకే చంగ్ కథ ముగిసింది. అతను వైదొలగుతుంటే కోర్టును నిశ్శబ్దం ఆవిహించింది. ఫెదరర్ నాలుగు సార్లు చంగ్ సర్వ్‌ను బ్రేక్ చేశాడు. ఓ సారి బ్రేక్ పాయింట్ ఇచ్చుకున్నాడు. చంగ్ 14 గేమ్‌లలో 17 అనవసర తప్పిదాలు చేశాడు.



బబోస్-మ్లడెనొవిచ్‌కు టైటిల్

టిమియా బబోస్ (హంగరీ), క్రిస్టినా మ్లడెనొవిచ్ జోడీ మహిళల డబుల్స్ టైటిల్ గెలుచుకుంది. శుక్రవారం రాడ్ లెవర్ ఎరీనాలో జరిగిన ఫైనల్లో వీరు 6-4, 6-3తో రష్యా జోడీ ఎక్తరీనా మకరోవా, ఎలీనా వెస్నినాపై విజయ సాధించారు. బబోస్‌కిది తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2016 వింబుల్డన్ ఫైనల్లో సెరెనా, వీనస్ చేతిలో ఓడింది. మ్లడెనొవిచ్ 2016లో సహచరిణి కరోలినా గార్సియాతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలిచింది. ''మాలోని స్ఫూర్తి, స్నేహం మమ్మల్ని రెండు వారాల పాటు నడిపించాయి. ఆరంభంలో మేం కొన్ని కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నాం. కఠిన మ్యాచ్‌లూ ఆడాం. ఈ రోజు సునాయాస విజయం సాధించాం'' అని బబోస్ అంది.



డబుల్స్ ట్రోఫీతో బబోస్ (ఎడమ), క్రిస్టినా

ఫైనల్లో బోపన్న-బబోస్

● ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్



మెల్‌బోర్న్: భారత ఆటగాడు రోహన్ బోపన్న... గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు మరో అడుగు దూరంలో నిలిచాడు. హంగరీ క్రీడాకారిణి బబోస్‌తో కలిసి బోపన్న ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్ చేరాడు. శుక్రవారం రసవత్తరంగా సాగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో బోపన్న-బబోస్ జోడీ 7-5, 5-7, 10-6తో మార్సెలో డిమెలినర్ (బ్రెజిల్), మారియా జోస్ మార్టినెజ్ శాంచెజ్ (స్పెయిన్) పై విజయం సాధించారు. 2017లో బోపన్న తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఫ్రెంచ్ ఓపెన్‌లో గెలిచాడు. కెనడా క్రీడాకారిణి గాబ్రియేలా డబ్రోస్కీతో కలిసి రోలండ్ గారోస్‌లో టైటిల్ వశం చేసుకున్నాడు. ఇపుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ కోసం బోపన్న... డబ్రోస్కీనే ఎదుర్కోబోతున్నాడు. మిక్స్‌డ్ టైటిల్ కూడా గెలిస్తే ఇప్పటికే మహిళల డబుల్స్ టైటిల్ గెలిచిన బబోస్ ఆనందం ద్విగిణీకృతమవుతుంది. బోపన్న... మహేశ్ భూపతి, పేస్, సానియా తర్వాత ఇక్కడ టైటిల్ గెలిచిన నాలుగో భారతీయుడవుతాడు.


Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
I
లైఫ్
lifepage2012@gmail.com
శనివారం
27 జనవరి 2018

బడ్జెట్‌లో... ఇవి కావాలి!



రూపాయి రావటం, పోవటం...కుటుంబానికైనా దేశానికైనా ఈ రెండు అంశాలు చాలా ముఖ్యం. ఆదాయ వ్యయాల మధ్య సమతౌల్యమే మన తలరాతలను మార్చేసే అంశం. అయితే రూపాయి పట్ల జనం మాత్రమే జాగ్రత్తగా ఉంటే చాలదు...ప్రజల ఆదాయాన్ని పెంచడం, తగ్గించడం, మిగల్చడం...వీటన్నింటినీ ప్రభుత్వ నిర్ణయాలు సైతం ప్రభావితం చేస్తుంటాయి. అందుకే సంవత్సరానికి ఒకసారి ప్రభుత్వాలు వేసుకునే ఆదాయవ్యయాల పట్టిక...బడ్జెట్ కి అంత ప్రాధాన్యత. ఈసారి రానున్న బడ్జెట్ కి ఉన్న ప్రత్యేకతలను గురించి చెప్పాలంటే...జిఎస్‌టి దెబ్బతో జనం గగ్గోలు పెడుతున్న తరుణంలో...సామాన్యుడిపై ధరలు స్వైర విహారం చేస్తున్న సమయంలో...సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో...వస్తున్న బడ్జెట్ ఇది. ఎక్కడో ఢిల్లీలో నేతలు తీసుకునే నిర్ణయాలు...ఇక్కడ మన జేబుకి చిల్లులు పెడతాయని... జిఎస్‌టి ద్వారా సగటు పౌరుడికి మరింత స్పష్టంగా అర్థమైన వేళ... సామాన్యులు ఈ బడ్జెట్ ఎలా ఉండాలని కోరుకుంటున్నారు. లోకల్ సర్కిల్స్ అనే సంస్థ..'సిటిజన్స్ బడ్జెట్ 2018' అనే అంశంపై ఓ సర్వేని నిర్వహించింది. మూడువారాలకు పైగా 200 సిటీల్లో 50 వేల మంది భిన్న వర్గాలకు చెందిన జనం నుండి...సుమారు 1,25,000ల అభిప్రాయాలను సేకరించారు. ఆ వివరాలే ఇవి...ఈ అభిప్రాయాలను దేశ ప్రజల గళాలకు ప్రతీకలుగా తీసుకోవచ్చు-



సత్వర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏం చేయాలి...

ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలని 29శాతం మంది చెప్పారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రాధాన్యతా రంగంగా గుర్తించి రుణ అవకాశాలు పెంచాలని 29శాతం మంది చెప్పగా, డిజిటల్ లావాదేవీలు చేస్తున్నవారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని 24శాతం మంది, కార్పొరేట్ ఇన్‌కమ్ ట్యాక్సులను తగ్గించాలని 18శాతం మంది అభిప్రాయపడ్డారు.


ఏ రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలి...

వ్యవసాయం లేదా గ్రామీణ ప్రాంతాలకు అని...38శాతం చెప్పగా, ఆరోగ్య సంరక్షణకని 12శాతం మంది, విద్య కోసమని 16శాతం, మౌలిక వసతుల కోసం ఎక్కువ కేటాయింపులు చేయాలని 34శాతం మంది కోరుకున్నారు.


బడ్జెట్ లో తగిన మొత్తం కేటాయించాల్సిన నూతన రంగం

మహిళలు పిల్లల రక్షణ అని 20శాతం మంది చెప్పగా...ప్రకృతి వైపరీత్యాలకు సమాయత్తం కావడానికి ప్రాధాన్యత ఇవ్వాలని 15శాతం, సమయ పాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని 15శాతం మంది కోరారు.

ఏ రంగానికి ఎక్కువ కేటాయింపులు కావాలి?



తగిన మొత్తం కేటాయించాల్సిన నూతన రంగం ఏది (శాతాల్లో)





8శాతం మంది, ఉద్యోగ అవకాశాలకు నైపుణ్యాలను పెంచాలని 56శాతం మంది, ప్రమాదాల్లో గాయపడినవారికి ఉచిత వైద్య సహాయం అందించాలని 15శాతం మంది కోరారు.

బడ్జెట్ అనగానే ...జనం ఎక్కువగా చూసే అంశాలు... ఏ వస్తువుల ధరలు తగ్గాయి...వేటి ధరలు పెరిగాయి. తరువాత... ఆదాయపన్ను మినహాయింపులు, వివిధ రంగాలకు కేటాయింపులు ఎలా ఉన్నాయి..అనేది చూస్తారు. అయితే ఇప్పుడు ప్రభుత్వానికి అర్జంటుగా కావాల్సింది...దేశమంతా ఒకే పన్ను విధానంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టికి జనం మద్దతు ఎంతవరకు ఉంది...అనేది. ఈ విషయంలో ప్రభుత్వానికి చుక్కెదురు అన్నట్టుగానే ప్రజాభిప్రాయం ఉంది. వ్యవసాయానికి, ఉద్యోగాలకోసం నైపుణ్యాల పెంపు, రైల్వేలో భద్రత, ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ మొదలైనఅంశాలకు కేటాయింపులు పెరగాలని ప్రజలు ఆశిస్తున్నారు.

ఏ రకమైన ఇన్‌కమ్‌ట్యాక్స్ రిలీఫ్ కావాలి..

పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుండి రూ. 3 లక్షలకు పెంచాలని 31శాతం మంది కోరుకోగా, పన్నుల భారాన్ని తగ్గించడానికి ట్యాక్స్ శ్లాబులను పెంచాలని 37శాతం మంది చెప్పారు. 80(సి) ప్రకారం పన్ను మినహాయింపు ఇచ్చే పరిమితిని రూ.1.5 లక్షల నుండి రూ. 2లక్షలకు పెంచాలని 12శాతం మంది, గరిష్ట పన్నురేటుని 25 శాతానికి తగ్గించాలని 20శాతం మంది ఆశించారు.

ఆరోగ్యరక్షణ విషయంలో ఏ అంశానికి ఎక్కువ కేటాయింపులు చేయాలి?

వైద్యరంగంలో మంచి పర్యవేక్షణ ఉండాలని, ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రుల బాధ్యతని పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని 45శాతం మంది కోరగా, వైద్యపరీక్షలు, మందులకు అయ్యే ఖర్చుని తగ్గించాలని 27శాతం మంది, ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించడానికి, వాటి సంఖ్య పెంచడానికి ఎక్కువ కేటాయింపులు చేయాలని 25 శాతం, యాక్సిడెంట్లకు గురయినవారికి ఉచిత వైద్యం అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని 3 శాతం మంది ఆకాంక్షించారు.

రైల్వేలో ఏ అంశానికి ఎక్కువ కేటాయిపులు చేయాలి?

భద్రత పెంపుకి ఎక్కువ కేటాయింపులు చేయాలని 44శాతం మంది, సేవలు వసతుల పెంపుదలకు ప్రాధాన్యతను ఇవ్వాలని 26శాతం, శుభ్రత కావాలని

ప్రాథమిక అవాంతరాలు దాటి జిఎస్‌టి విధానం స్థిరపడిందా?

ఈ ప్రశ్నకు 40శాతం మంది అవునంటే...50శాతం మంది కాదని సమాధానం చెప్పారు. 10శాతం మంది చెప్పలేమన్నారు.

కార్పొరేట్ ఆదాయపన్ను తగ్గింపు విషయంలో ప్రభుత్వ దృక్పథం ఎలా ఉండాలి?

పన్ను రేటు తగ్గిస్తే...పెట్టుబడులు పెరుగుతాయనే నమ్మకం లేదని 25శాతం మంది అన్నారు. ఈ సంవత్సరం ఒకేసారి 25శాతానికి పన్నురేటుని తగ్గించాలని 36శాతం మంది, ఈ సంవత్సరం 27శాతానికి వచ్చే సంవత్సరం 25శాతానికి తగ్గించాలని 16శాతం మంది, జిఎస్‌టి వలన ఆదాయం పెరిగేవరకు పన్నురేటుని 30శాతంగానే ఉంచాలని 23శాతం మంది కోరారు.

చిన్నతరహా వాణిజ్యానికి ఆమోదయోగ్యమైన పన్ను విధానం కోసం ప్రభుత్వం ఏం చేయాలి?

పన్నురేటుని 21శాతానికి తగ్గించాలని 25శాతం మంది కోరగా, 18శాతానికి తగ్గించాలని 45శాతం మంది, మార్పు లేకుండా 25శాతం వద్దే ఉంచాలని 20శాతం మంది, చెప్పలేమని 10శాతం మంది తెలిపారు.


ప్రజల సొంత ఇంటి కలని నిజం చేయడానికి ప్రభుత్వం ఏం చేయాలి?

మొదటిసారి ఇంటిరుణం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి వడ్డీలో రాయితీ ఇవ్వాలని 33శాతం మంది కోరగా, హౌసింగ్ స్థల పరిమితిని 60 చదరపు మీటర్లనుండి నుండి 120 చదరపు మీటర్లకు పెంచాలని 27శాతం మంది, హౌసింగ్ రుణాల ఇఎమ్ఐలపై ప్రత్యేక పన్ను మినహాయింపులు ఉండాలని 27శాతం, సబ్సిడీ ఇచ్చే రుణ పరిమితిని పెంచాలని 13శాతం మంది ఆశించారు.


ఈ బడ్జెట్ లో ఏంజిల్ ట్యాక్స్‌ని రద్దు చేయాలా?

57శాతం మంది ఇందుకు అంగీకారం తెలుపగా, 31శాతం మంది వద్దని, 12శాతం మంది చెప్పలేమని తెలిపారు.


జిఎస్‌టి సింగిల్ రేటు విధానంలో 18% గా నిర్ణయించాలా



ఆరునెలల జిఎస్‌టి అమలు తరువాత మొత్తం మీద ధరలు తగ్గాయా?



ఎలాంటి ఇన్‌కమ్‌టాక్స్ రిలీఫ్ కావాలి ?



విశ్వకళలు విలసిల్లి..!

అదో రంగుల ప్రపంచం.. జాతీయ,అంతర్జాతీయ కళాకారుల నైపుణ్యాల ప్రదర్శనకు అందమైన,అపురూపమైన రంగస్థలం...అది భారతీయ, సార్క్ దేశాలకు చెందిన చేతివృత్తి కళాకారులు,సాంస్కృతిక కళాకారులు తమ నైపుణ్యాలు ప్రదర్శించేందుకే కాదు.. జాతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే అంతర్జాతీయ వేదిక కూడా!.. అదే సూరజ్ కుండ్ క్రాఫ్ట్‌మేళా!


ఢిల్లీ సమీపంలోని, హర్యానా రాష్ట్రానికి చెందిన ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్‌లో అంతర్జాతీయ క్రాఫ్ట్ మేళా ప్రతి ఏటా అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ ఏడు నిర్వహించే 32వ మేళా ఫిబ్రవరి 2-15 తేదీల మధ్య జరుగనుంది. కేంద్ర టూరిజం,టెక్స్‌టైల్స్, సాంస్కృతిక, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, హర్యానా రాష్ట్ర టూరిజం శాఖ, హర్యానా టూరిజం కార్పొరేషన్ల సమన్వయంతో సూరజ్‌కుండ్ మేళా అథారిటీ ఈ ఉత్సవాన్ని ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తుంది. 40 ఎకరాలలో నిర్వహించే ఈ మేళాలో 1010 స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. ఉదయం 10. 30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు. ప్రవేశ రుసుము రోజుకు ఒక్కొక్కరికి 80 రూపాయలు. వారాంతపు రోజుల్లో 120 రూపాయలు వసూలు చేయాలని మేళా అథారిటీ నిర్ణయించింది. అయితే వికలాంగులు, సీనియర్ సిటిజన్స్, సైనికులు, యుద్ధం కారణంగా వితంతువులు అయిన వారికి ప్రవేశ రుసుములో 50శాతం తగ్గింపు ఇస్తారు. అదే విధంగా కళాశాల, పాఠశాల విద్యార్థులు కూడా తమ గుర్తింపు కార్డును చూపించి 50 శాతం రిబేట్ పొందవచ్చు.

ప్రపంచంలోనే అతిపెద్ద మేళా

ప్రపంచంలోనే అతిపెద్ద హస్తకళల ప్రదర్శన వేదిక సూరజ్‌కుండ్ క్రాఫ్ట్ మేళా! అంతర్జాతీయ పర్యాటక క్యాలెండర్‌లో విశిష్ట స్థానం పొందిన ఈ మేళాకు ప్రతియేటా పది లక్షలకు పైగా సందర్శకులు, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. భారతీయ కళావైభవాలను, హస్త కళానిపుణులైన కళాకారులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా జరుగుతున్న సూరజ్‌కుండ్ క్రాఫ్ట్స్ మేళా.....గత మూడు దశాబ్దాలుగా (1987నుంచి) ప్రపంచ పర్యాటకుల మురిపిస్తూ....మైమరిపిస్తోంది. ఈ మేళాలో హస్త, వస్త్ర,చిత్రలేఖన, చెక్క, దంతపు, కుమ్మరి, టెర్రకోట, మైనముతో చేసిన అపురూపమైన కళాఖండాలు ప్రదర్శిస్తారు. కనుమరుగవుతున్న కళలకు ప్రాణంపోసే వేదికగా భాసిల్లుతున్న ఈ మేళాలో ప్రపంచ నలుచెరుగుల నుంచి వచ్చే కళాకారులు అరుదైన చేతి వృత్తులను ప్రదర్శిస్తారు. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ కళాకారులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు పర్యాటకులు బారులు తీరుతారంటే అతిశయోక్తి కాదు!



అరటిపండు...అలా మేలు!



ఆహారంలో పొటాషియం సరిపడా తీసుకునేవారిలో అధిక రక్తపోటు సమస్య ఉండదట. బిపితో బాధపడుతున్నవారు ఉప్పుని తగ్గించుకోవటంతో పాటు పోటాషియం ఎక్కువగా ఉన్న అరటి పళ్లు, కమలాలను ఎక్కువగా తీసుకుంటే మంచిది.

తులసితో ఒత్తిడికి చెక్!



పవిత్రమైన మొక్కగా చెప్పుకునే తులసిలో ఆరోగ్యాన్ని రక్షించే లక్షణాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా దీనిని టీగా గానీ, మరే రూపంలో అయినా తీసుకున్నా ఒత్తిడి హార్మోను కార్టిసాల్‌ని క్రమబద్ధం చేస్తుంది...అలా ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఉల్లి..వెల్లుల్లితో వ్యాధి నిరోధక శక్తి!




ఆహారంతో పాటు ఉడికించిన ఉల్లి వెల్లుల్లిలను తీసుకుంటూ ఉంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ రెండింటిలో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఎక్కువ.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

ఉపదేశ గుచ్ఛం



(గత సంచిక తరువాయి భాగం)

శ్రీ రమణాశ్రమం

9-4-47

భగవాన్ ఏ ఆసనంలో ఉంటారో సెలవిస్తారా?" అన్నారు వేరొకరు. "ఏ ఆసనంలోనా? హృదయాసనంలో. ఎక్కడ సుఖంగా ఉంటుందో అక్కడే నా ఆసనం. దాన్నే సుఖాసనమంటారు. ఆ హృదయాసనం శాంతియుతమైనదీ, సుఖప్రదమైన దీని, ఆ ఆసనంలో నివాసం చేసే వారికి వేరే ఆసనాలతో పనిలేదే?" అన్నారు భగవాన్.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని గీతలో చెప్పారే. 'సర్వ ధర్మాన్' అంటే ఏయే ధర్మాలు?" అన్నారు మరొకరు. "సర్వధర్మాన్ అంటే జీవ ధర్మాలన్నమాట. పరిత్యజ్య అంటే ఆ జీవధర్మాలన్నీ విడిచి, మామేకం -ఏకస్వరూపుడనైన నన్ను, శరణం వ్రజ-శరుణుజెందుము. ఇదే అర్థం" అన్నారు భగవాన్. తిరిగి ఆ ప్రశ్నించినవారే 'రమణగీతలో హృదయగ్రంథి భేదనమంటే యేమి?" అన్నారు. "అదేనండీ, నేననేది పోవటమే వాసనాక్షయం. అహం నాశనం, జీవత్వనాశనం, మనోనాశనం, అని ఎన్నో పేర్లు. అన్నీ ఒకటే. మనో నాశనమే హృదయగ్రంథి భేదనం. జ్ఞానమంటేనూ అదే. పరిభాషకేదో ఒకపేరు" అన్నారు భగవాన్.

ఈ సంభాషణ ప్రారంభించగానే, ఉక్కగా ఉన్నదని, ఎలెక్ట్రిక్ ఫాను తిప్పారు సేవకులు. భగవాన్ చూచి 'ఇదెందుకయ్యా?" అంటూ ఆ ఫాను ఆపి సమీప వర్తులతో "ఇదుగో చూడు, జ్ఞాని అయిన వెనుక కర్మ ఎట్లా చేయగలరనినీ చాలామంది ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్న వస్తే, పూర్వం కులాల చక్రం ఉపమానంగా చెప్పేవారు. చక్రం గిరగిరా తిప్పితే కుండ అమరుతుంది. అమరిన వెనుక తిప్పటం మానినా మరికొంతసేపు అట్లాగే తిరిగిగాని ఆగదని, ఇప్పుడీ ఫాను ఉపమానం చెప్పవచ్చు. చూడు దీని స్విచ్చి ఆపాము. కొంచెం సేపు తిరిగి గాని ఫాను నిలవదు. అదేవిధంగా జ్ఞాని అయిన వెనుక ప్రారబ్ధవశాత్తు ఆ శరీరంతో చేయవలసిన పనులున్నంతవరకూ చేసిగాని దేహం చాలించడు" అన్నారు భగవాన్.

ఇంతలో నా వెనుక ఏడెనిమిది నెలలు పసికందు "తాతా, తాతా" అంటూ చిలకల్లే పలక సాగింది. పసిపాపల ముద్దు పల్కులంటే భగవానునికెంతో ప్రీతి, ఈ చిలుక పలుకులు వారి చెవిసోకగానే తలయెత్తి చూచి "ఎవరది" అన్నారు. "మన పాప మంగళం" అన్నాను. భగవాన్ మందహాసంతో "అదా? ఎవరో పెద్ద పిల్లలనుకున్నాను. అప్పుడే తాతా అనటం సాగించిందే?" అన్నారు. ఆ పాప 'తాతా, తాతా' అంటూనే ఉంది. భగవాన్ సమీపస్థులతో "ఇదుగో చూడూ ఈ చిత్రం. బిడ్డలకు తాతా అన్న మాటే ముందు వస్తుంది. మొదటి మాటే అది. ఏ పిల్లలు రానీ, నన్ను చూచి 'తాతా, తాతా' అంటారు. వాళ్ళకెవరు చెప్పారిది? పిల్లలంతా ఒకే ధోరణి, ఒకే మాట. తాతా అంటే 'తాను తానే అని అర్థం. మన స్సుకూ అంతేనోయ్. మొదటి శబ్దం "నేను" అని వస్తుంది. ఆ వెనుకగాని నీవూ, వాడూ, అనేవన్నీ రావు. తాతా అన్నమాట వచ్చి వెనుకనే, తక్కినవన్నీ వచ్చినట్లు అహం పుట్టిన వెనుకనే అన్నీ పుడత" వన్నారు.

తొమ్మిది గంటలు కావచ్చింది. గడియారం సరిచేసుందుకు టైం చూడాలని రేడియో తిప్పాడు కృష్ణస్వామి. గంటలు కొట్టిన వెనుక 'అందరికీ వందన'మని చెప్పి రేడియో పాట ముగించారు. భగవాన్ చిరునవ్వుతో "అందరికి వందన మట.అందరు వేరు. తాను వేరు గాబోలు. తానందరిలోనివాడు కాదేమి? తనకు తానే వందనం చెప్పుకుంటున్నాడన్నమాట. అది, తెలుసుకోలేరు. అదే చిత్రం" అన్నారు.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు / లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.


కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. అలసత్వం పెరుగుతుంది. అవకాశాలను సద్వినియోగ పరచు కోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదా యంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

మాఘ శుద్ధ ఏకాదశిని భీష్మ ఏకాదశి అంటారని బ్రహ్మాండ పురాణం, మహాభారతం ద్వారా తెలుస్తోంది. భీష్ముడు మాఘ శుక్ల అష్టమి నాడు తనువు చాలించినా వైకుంఠానికి చేరడానికి మూడు రోజులు పడుతుంది. కావున ఏకాదశి నాడు భీష్ముడు మోక్షాన్ని పొందాడని ప్రసిద్ధి. అందుకే మాఘ శుక్ల ఏకాదశిని భీష్మ ఏకాదశి అని అంటారు.



భీష్ముడు వైకుంఠం చేరిన పర్వం

ధర్మరాజుకు, భీష్ముడు సకల ధర్మములలో ఉత్తమ ధర్మము శ్రీవిష్ణు సహస్రనామాలతో స్తోత్రము చేయటం అని చెప్పాడు. అందుకే భీష్మునికి ఇష్టమైన విష్ణు సహస్రనామాన్ని ఈ ఏకాదశి నాడు ఉపవాసముతో మూడు మార్లకు తగ్గకుండా లేదా శక్తి మేరకు పారాయణ చేయాలి. భీష్మ ఏకాదశి సూర్యోదయం నుంచి ద్వాదశి సూర్యోదయం వరకు అఖండ విష్ణు సహస్రనామ పారాయణ చేస్తే పరమాత్మ వైకుంఠాన్ని ప్రసాదిస్తాడు. అటువంటి వారికి మరుజన్మ ఉండదు. ఏకాదశి, ద్వాదశి తిథులలో నిర్వహించే తిల తర్పణ మంత్రం.

వైయగ్ర పాద గోత్రాయ సాంకృత్య ప్రవరాయచ
అపుత్రాయ దదామ్య తత్ జలం భీష్మాయ వర్మణే
వసూనాం అవతారాయ శంతనోరాత్మ జాయ చ
అర్ఘ్యం దదామి భీష్మాయ ఆ బాల బ్రహ్మచారిణే

ఇలా ఈ మంత్రములతో అర్ఘ్యం, తిల తర్పణం చేసి మరు నాడు అనగా ద్వాదశి నాడు శ్రాద్ధం, అన్నదానం చేస్తే పునర్జన్మ ఉండదు. జీవితంలో బ్రతికినంత కాలం అన్ని కోరికలు నెరవేరి ఆనందంగా ఉంటారు.

జయ ఏకాదశి

మాఘ శుక్ల ఏకాదశి జయా ఏకాదశి అనే పేరుతో వ్యవహరించబడుతుంది. ఈ ఏకాదశి సర్వపాపహరమైనదే కాక పరమ పవిత్రమైనది, అన్ని కోరికలను తీర్చేది, మోక్షాన్ని ప్రసాదించేది, బ్రహ్మ హత్యాపాతకాన్ని నశింపజేసేది, పిశాచత్వము పొందిన వారికి దాని నుంచి విమోచనం కలిగించేది ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరించిన వారికి ప్రేతత్వం ఉండదు. మాఘ శుక్ల ఏకాదశిని మించిన పాపహరమైన ఏకాదశి మరొకటి లేదు. అందువలన ఈ ఏకాదశి వ్రతాన్ని ప్రయత్న పూర్వకంగా ఆచరించాలి. మాఘ శుక్ల ఏకాదశి వ్రత మహిమ గూర్చి పురాణాల్లో ఒక కథ ఉంది. దాని ప్రకారం ఇంద్రుడి రాజ్యపాలనలో స్వర్గంలోని దేవతలందరూ నందన వనంలోని పారిజాత పుష్పాలను ఆస్వాదిస్తూ, అమృత పానం చేస్తూ సుఖంగా ఉన్నారు. సభలో ఇంద్రుడు అప్సరసల నాట్యం తిలకిస్తూ, గంధర్వులతో గానం చేయిస్తున్నాడు. ఆ సభలోనే చిత్రసేన, మాలిని అనే గంధర్వ దంపతుల పుత్రిక పుష్పవంతి ఉంది. అలాగే పుష్పదంతుడనే మరో గంధర్వుని కుమారుడు మాల్యవంతుడు కూడా ఉన్నాడు. మాల్యవంతుడు పుష్పవంతి సౌందర్యంతో మోహాన్ని పొందాడు. ఇంతలో సభలో మాల్యవంతుడు గానం, పుష్పవంతి నాట్యం చేయవలసిన తరుణం వచ్చింది. అయితే వారిద్దరూ ఒకరినొకరు చూస్తూ పరవశులై చిత్త భ్రమతో రాగ, తాళాలను మరిచిపోయారు. దీనిని గమనించిన ఇంద్రుడు వారు సంగీత, నాట్యశాస్త్రాలకు, తనకు అవమానం జరిపారని కోపించి భూలోకంలో జన్మించి, పిశాచ రూపంలో కర్మ ఫలాన్ని అనుభవిస్తూ ఉండమని శపించాడు. ఇంద్రశాపం వలన వారు పిశాచత్వాన్ని పొంది దుఃఖాగ్నితో నిరంతరం పీడించబడుతూ హిమవత్ పర్వత గుహలలో సంచరించడం మొదలు పెట్టారు.



పిశాచ రూపంలో ఉన్న మాల్యవంతుడు, పుష్పవంతి తాము చేసిన తప్పుకు ఇంతటి శాపాన్ని అనుభవిస్తున్నామని బాధ పడుతూ ఉండేవారు. ఇదిలా ఉండగా తిథులలోకెల్లా ఉత్తమ తిథి అయిన మాఘ శుక్ల ఏకాదశి అనగా జయా ఏకాదశి వచ్చినదని తెలిసిన వారివురూ ఆ రోజు జీవహింసను విడిచి పెట్టి ఆహా రము, జలపానము మాని రావి చెట్టు వద్ద దుఃఖిస్తూ గడిపారు. అది హిమవత్ ప్రాంతమయినందున చలికి వణుకుతూ భూమి పై పడు కొనగా చలి వల్ల వారు నిద్రించలేక పోయారు. తెల్లవారి ద్వాదశి వచ్చింది. వారికి తెలియకుండానే దైవ యోగంతో మాఘశుద్ధ ఏకాదశి నాడు పగలు ఉపవాసము, రాత్రి జాగరణ అలాగే బ్రహ్మచర్యం కూడా చేశారు.

అనుకోకుండా కొంత తెలిసీ, కొంత తెలియక మరి కొంత వీలు లేక నిద్రాహారాలు మానినందున, జయ ఏకాదశీ వ్రతాచరణ యథావిధిగా చేసినందున శ్రీమన్నారాయణుడు సంతోషించి వారిని అనుగ్రహించగా వారి పిశాచత్వము తొలగింది. పుష్పవంతీ మాల్యవంతులు పూర్వరూపమును ధరించి, సకలాలంకార శోభితులై దివ్య విమానంపై స్వర్గలోకానికి వెళ్ళి ఇంద్రుని ముందు నిలిచి నమస్కరించారు. వారిని చూసిన ఇంద్రుడు ఆశ్చర్యపోయి ఏ పుణ్యంతో మీ పిశాచత్వము పోయిందని అడిగాడు. 'జయా ఏకాదశి వ్రత ముతో శ్రీమన్నా రాయణుని అనుగ్రహంతో, మీ యందున్న భక్తి ప్రభావంతో పిశాచత్వము పోయింద'ని మాల్యవంతుడు చెప్పాడు. ఆ మాట విన్న ఇంద్రుడు ఆ వ్రతాన్ని ఆచరించిన మీరు పరమ విష్ణు భక్తి పరాయణులని, మీరు కూడా నమస్కరించదగిన వారని పలికాడు. స్వర్గంలో యథేచ్ఛగా ప్రియురాలితో విహరిస్తూ సంతోషంగా కాలం గడపమని ఇంద్రుడు మాల్య వంతునికి అనుమతిచ్చాడు. అందువల్ల మాఘ శుక్ల ఏకాదశి అనగా జయా ఏకాదశి వ్రతాన్ని ఆచరించినవారు అన్ని దానములు, యజ్ఞములు చేసిన వారవుతారు. అంతేకాక కోటికల్పాలు వైకుంఠంలో ఉంటారు. మాఘ శుక్ల ఏకాదశి వ్రతమహిమను చదివిన వారు, విన్న వారు కూడా అగ్నిష్టోమయాగ ఫలాన్ని పొందుతారనేది ఆ కథ.



- డా॥ కందాడై రామానుజాచార్య

కష్టాల్లో ఆదుకునేవారే నిజమైన మిత్రులు



రే! రే! చాతక సావధాన మనసా మిత్ర! క్షణం శ్రూయతామ్
అంబోధా: బహవో భవంతి గగనే సర్వేపినైతా దృశాః!
కేచిత్ వృష్టిభిరార్ద్రియంతి వసుధాం గర్జన్తి కేచిత్ వృథా
యం యం పశ్యసి తస్య తస్య పురతః మా బ్రూహి దీనం వచః॥

(హే! చాతక మిత్రమా సావధాన మనసు కలదానివై నేను చెప్పే మంచి మాట విను! మేఘాలు ఆకాశంలో చాలా ఉంటాయి. కాని అన్నీ వర్షించవు. కొన్ని బాగా వర్షించి భూమిని సంతోష పెడతాయి. కొన్ని ఊరికే వృథాగా గర్జించి వెళ్ళిపోతాయి. కాబట్టి చాతక మిత్రమా! కనిపించే ప్రతివాడి దగ్గర నీ బాధలు చెప్పుకోకు. ఎవరో కొందరు మాత్రమే మనల్ని ఆదుకుని సహాయం చేస్తారు. వాళ్ళే నిజమైన మిత్రులు, ఆప్తులు).

ఇది శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఒక ప్రవచనంలో చెప్పిన హితోక్తి. నిజంగా సాయం చేసే వారికే నీ బాధలు చెప్పుకోమని ఈ హితోక్తి చెబుతుంది. సాయం చేసే వారెవరో తెలుసుకుని వారి దగ్గరకు వెళ్లడం వల్ల పని జరుగుతుంది. సాయం చేయలేనివారికి చెబితే అది వృథా అవుతుంది. అంతేకాక వారు గేలి చేసే అవకాశం కూడా ఉంది. ఊరికే శుష్కవాగ్దానాలు చేసేవారు, హడావుడి చేసి పని చేయని వారు మనకు నిత్య జీవితంలో తారసపడుతూనే ఉంటారు. ఇటువంటివారి గురించి చెప్పేదే ఈ హితవచనం. ఇటువంటివారి గురించి వివరణను ఒక చాతక పక్షికి బోధించే విధంగా ఉపమానపూర్వకంగా చెప్పారు. చాతక పక్షి వాన నీటికి ఎదురు చూస్తుంటుంది. ఉరిమే మేఘం వర్షిస్తుందని ఆశగా ఎదురుచూస్తుంది. అయితే ఉరిమే ప్రతి మేఘం వర్షించదు కదా.

- ఆయత్తు రాజేశ్వరి

శుద్ధభక్తుడే దేవాదిదేవుని గుర్తించగలడు

భగవద్గీత



అధ్యాయం7

శ్లోకం 20:

కామైస్తైస్తైర్హృతజ్ఞానాః
ప్రపద్యంతే న్యదేవతాః।
తం తం నియమమాస్థాయ
ప్రకృత్యా నియతాః స్వయా॥

తాత్పర్యం


విషయకోరికలచే జ్ఞానం అపహరింపబడిన వారు ఇతర దేవతలకు శరణము నొంది తమ గుణములను బట్టి ఆయా పూజా విధానములను అనుసరింతురు.

భాష్యం

భౌతిక భావనల నుండి పూర్తిగా ప్రక్షాళన చెందినవారు భగవంతునికి శరణు పొంది ఆయన సేవను చేయు దురు. అలా భౌతిక ప్రక్షాళన పూర్తి కాక పోతే వారు ఇంకా భక్తులు కానట్లే లెక్క. అయితే వారు భగవంతుణ్ణి ఆశ్రయించటమనే, సరైన లక్ష్యాన్ని ఎంచుకున్నారు కాబట్టి త్వరలోనే కామము నుండి దూరమవుతారు. కాని ఎవరైతే రజో గుణము, తమో గుణములతో ఉంటారో వారు సత్వరమే కోరికలను తీర్చుకొనేందుకు తెలివితక్కువ తనముతో దేవత లను పూజిస్తూ సంతృప్తి చెందుతారు. వారు జీవిత లక్ష్యాన్ని సాధించుట ఎలాగో తెలియక కొద్దిపాటి కోరికలను తీర్చుకొనుటకు తప్పుదోవ పడతారు. వారు తమ కష్టాలను తీర్చుటకు దేవాది దేవుని కంటే దేవతలను ఆశ్రయించటమే మేలు అని భావిస్తారు. అయితే శుద్ధ భక్తుడు, దేవాది దేవుడు ఒక్కడే అందరికి ప్రభువనీ, మిగిలిన వారందరు ఆయన దాసులని, అతడు భగవంతుని మీదే ఆధారపడి, ఆయన ఇచ్చిన దానితో సంతృప్తి చెందుతాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

మంచి మాట



ఉదయసాయంకాలాల్లో చేతులతో తాళం వేస్తూ ఎలుగెత్తి హరినామ సంకీర్తనం చేయండి. మీ పాపాలూ, తాపాలూ అన్నీ మిమ్మల్ని విడిచిపెడతాయి

- శ్రీరామకృష్ణ పరమహంస



సుమతి శతకము

బంగారు కుదువ బెట్టకు
సంగరమున బారిపోకు సరసుడవైతే
సంగడి వెచ్చములాడకు
వెంగిలితో జెలిమి వలదు వినరా సుమతీ

తాత్పర్యం: బంగారం తాకట్టు పెట్టవద్దు. యుద్ధములో పారిపోవద్దు. మర్యాద తెలిసిన వాడవైనచో దుకాణములో సరుకులు అరువుగా తీసుకోవద్దు. వివేకము లేనివానితో స్నేహము చెయ్యవద్దు.

బాలప్రభ

పొడుపు కథ

చెట్టుకు కాయని కాయ
కరకరలాడే కాయ?

దేవతలు - గడ్డిపరక

కృష్ణానదీ తీరంలోని విజయపురి అనేపట్టణం ఆ పట్టణంలో రత్నాకరుడనే పండితుండేవాడు. ఆయన తన శిష్యులకు అన్నీ ఇన్నీ అని చెప్పలేనన్ని సందేహాలు తీర్చాడు. ఆయన ఒక రోజు జగత్తులో పరబ్రహ్మతత్వాన్ని మించినది మరొకటిలేదు అంటూ చెప్పనారంభించాడు. జయాపజయాలు కష్టసుఖాలు వంటివన్నీ ఆ పరమేశ్వరుని లీలలని వివరించేందుకు ఈ కథ చెప్పాడు. ఒకప్పుడు దేవదానవులపోరు మహా భీకరంగా జరిగింది. ఆ యుద్ధంలో దేవతలే గెలిచారు. ఈ గెలుపు తమ స్వశక్తివల్లే సాధించామని గర్వంగా చెప్పుకున్నారు. అసలుదీనికి కారణమైన పరబ్రహ్మను విస్మరించారు. దానవులపై సాధించిన విజయానికి గుర్తుగా దేవతలు మహాసభ నిర్వహించారు. ఎవరికి వారు తమ ప్రతిభను గొప్పగా చెప్పుకున్నారు. తన అగ్నిజ్వాలల వల్లే రాక్షసులు మలమల మాడిపోయి పారిపోయారని అగ్నిదేవుడు చెప్పుకోగా వాయు దేవుడు లేచినిల్చుని తన గాలి వేగానికి తట్టుకోలేక రాక్షసులు పారిపోయారన్నాడు. ఇలా దేవతలు ఎవరిగొప్పను వారు చెప్పుకొని అహంకారంతో విర్రవీగుతుండటం పరమేశ్వరుడు గమనించాడు. వారి గర్వాన్ని పోగొట్టేనిమిత్తం బ్రహ్మతత్వం భీకరమైన యక్షరూపంలో ప్రత్యక్షమయ్యింది. ఆ ఆకారాన్ని చూసి దేవతలు భయపడ్డారు.
యక్షరూపంలోని ఎదురునిల్చున్న బ్రహ్మతత్వాన్ని విషయమేమిటో కనుక్కోవలసిందిగా మిగిలిన దేవతలు అగ్ని దేవుడిని ముందుకు పంపారు. యుద్ధంలో రాక్షసులను తన అగ్ని జ్వాలలలతో మాడ్చానన్న విజయగర్వంతో ఉన్న అగ్ని దేవుడు ధీమాగా అడుగులు వేస్తూ యక్షరూపాన్ని సమీపించాడు. తాను అగ్ని దేవుడనని చెప్పుకున్నాడు. యక్షరూపంలో బ్రహ్మతత్వం మరైతే నీ శక్తి సామర్థ్యాలేమిటో అని ప్రశ్నించింది. ఏమిటీ? నా శక్తిసామర్థ్యాలు నీకు తెలీదా? ప్రపంచంలోని ఏ వస్తువునైనా క్షణంలో కాల్చి బూడిదచేసి పారేస్తానని అగ్నిదేవుడు గర్వంగా చెప్పాడు. ఓహో అలాగా దేన్నయినా కాల్చేస్తావా? అయితే దీన్ని దగ్ధం చెయ్యి చూద్దాం అంటూ యక్షుడు గడ్డిపరకను అగ్నిదేవుడి ముందుంచాడు. ఏమిటేమిటి? ఈ గడ్డిపరకను కాల్చాలా? ఇంతేనాఅంటూ అగ్నిదేవుడు మంటలు పుట్టించాడు. కానీ గడ్డిపరక కాలలేదు. దాంతో అగ్నిదేవుడు తలదించుకున్నాడు. అక్కడే ఉన్న వాయుదేవుడు తన ప్రచండగాలులు పుట్టించాడు. కానీ ఏం లాభం? ఆ గాలులు పనిచెయ్యలేదు గడ్డిపరక అక్కడే ఉంది. ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు. ఇక లాభం లేదనుకున్న దేవతలందరు తమ ప్రభువైన ఇంద్రుడి దగ్గరకు వెళ్లి గడ్డిపరక విషయం చెప్పి ప్రశ్నార్థకంగా చూశారు. అంతట ఇంద్రుడు వజ్రాయుధంతో వెళ్లాడు. అయితే వెంటనే ఆ శక్తి మటుమాయమైపోయింది. దానిస్థానంలో ఒక స్త్రీ రూపం సాక్షాత్కరించింది. ఆమె ఎవరో కాదు. హిమవంతుని కుమార్తె అయిన ఉమాదేవి. దేవతలను భయభ్రాంతులతో ముంచేసిన ఆ యక్షుడెవరో చెప్పవలసిందిగా ఇంద్రుడు అడిగాడు. అదా ఆ శక్తే కదా బ్రహ్మం. దానివల్లే కదా మీరు దానవులపై జరిగిన పోరులో గెలిచింది. మీ అందరి గొప్పదనానికి కారణభూతమైన బ్రహ్మమనే విషయాన్ని గుర్తుచేసేందుకే యక్షుడు గడ్డిపరక పరీక్ష పెట్టాడు. కనుక యిప్పటికైనా అసలు విషయం తెలుసుకోమని, మీ దేవతలకు చెప్పమని ఉమాదేవి అదృశ్యమైంది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిదేవుడితో సహా దేవతలందరూ తమ విజయం వెనుకున్న శక్తిని గుర్తించారు.




కథ

- ఉలాపు బాలకేశవులు

జూరాసిక్ యుగం నాటిమొసలి



చూస్తుంటే ఏదో పురాణ గాథల్లోని రాక్షసి మన ముందుకు వచ్చినట్టు ఉందే అనుకుంటున్నారా? అదేం లేదు. నేనో మొసలిని. మీకు నా ముచ్చట్లంటే చాలా ఇష్టం కదా. కొత్తగా నా సంగతుల్ని మీ శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. అవి చెప్పాలనే ఇలా వచ్చా. మరి మొదలెట్టనా?



★ పొడవైన పళ్లతో, వింతరూపంతో భలేగాఉన్నా కదూ. నేను జురాసిక్ యుగంనాటి మొసలిని. అప్పట్లో నేను నడిచివస్తుంటే ఓ భారీ కొండే కదులున్నట్టు ఉండేది.

★ఎప్పుడో 160 మిలియన్ ఏళ్లక్రితం నేలపై తిరిగేవాళ్లం. అంటే దాదాపు కోటి అరవై లక్షల ఏళ్ల క్రితమన్నమాట. జురాసిక్ యుగంలోని మా జాతి అతి భయంకరంగా ఉండేది. అమ్మో.. రూపంతోనే బెదరగొడుతోంది ఇతర జీవుల్ని కరకరా నమిలిపడేసే ఉంటుందని అర్థం చేసుకోండి.

★నా అసలు పేరు చెప్పలేదు ఇంకానూ. నా పేరు రజానా. 23 ఫీట్ల పొడవుతో ఉంటాను. 1,760 నుంచి 2,200 పౌండ్ల బరువు ఉంటాను. శక్తివంతమైన కండరాలు ఉంటాయి. పెద్ద దవడలు, బలమైన పళ్లు నా ఆయుధాలు. నీటిలోకి వచ్చిన ప్రతీజీవి ఎముకలను సైతం నమిలి తినేస్తాను. అంతేకాదు కొద్దిసేపట్లోనే అరిగించుకుంటాను.

★ఇంతకీ మా విషయాలు ఎలా బయటికి వచ్చాయంటే అంటే ఇటలీ, ఫ్రెంచ్ శాస్త్రవేత్తలకు మా శిలాజాలు దొరికాయట. ఏవోలే అని పట్టించుకోలేదు. ఓ మ్యూజియంలో పెట్టి ఉంచారు. కొత్తగా ఇప్పుడు కొంతమంది పరిశోధకులు పరిశీలించి ఈ నా విషయాలు రాబట్టారు.

సీతాకోక చిలుక

ఏమర్రా పిల్లలూ..! గణతంత్ర దినోత్సవంకు అందరూ హాజరయ్యారు కదూ?! మరి మన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భాన్ని ఇలా పండగ చేసుకోవడం మన విధుల్లో ఒకటి. సరే మరి మీరంతా మీ విధులు నిర్వహించే మంచివాళ్లు అని నాకు తెలుసు. ఇక ఈ వారం పుస్తకాలతోటలోకి మన ప్రయాణం సాగిద్దాం ఈ వారం. సిరిసిల్లకు చెందిన అత్తమ్మ డాక్టర్ కందేపి రాణీప్రసాద్ వ్రాసిన "సీతాకోకచిలుక" బాలగేయాల పుస్తకం గురించి తెలుసుకుందామే!! దీనిలోని గేయాలు చదివితే కవితలు, పాడితే గేయాలవుతాయి. మొత్తం 105 విషయాలను తీసుకుని చక్కగా లయబద్ధమైన గేయాల కవితలు అల్లారు రాణి అత్తమ్మ. సరదాగా వుంటేనే కదా మనం ఆనందం అనుభవించేది. మరి అదిలేని ఆనందం కూడా శూన్యం అనే విషయాన్ని "రైలు సరదా" గేయంలో ఎంత చక్కగా చెప్పారో! ఇక మల్లెపూల సొగసును అవిపూసే కాలాన్ని గమ్మత్తుగా వివరించారు. "పాపల్లారా! రండి రండి" అంటూ పిలుస్తూనే అంతేకాదుర్రా రాణి అత్తమ్మ స్వయంగా పిల్లల ఆసుపత్రి నిర్వాహకురాలు కావడంతో బోలెడు వైద్య విజ్ఞాన విషయాలు సరళమైన శైలిలో భలే భలే చెప్పారు ఇందులో. వెయిటింగ్ హాల్, వెంటిలేటర్, ఎక్స్‌రే, ఇంజక్షన్, రక్తం, ఇంక్యుబేటర్ వంటి ఆసుపత్రి వస్తువుల గురించి ఎంత సరళంగా చెప్పారో చదివితే అబ్బా! అంటారు మీరే!!



పుస్తకాల తోట

అల్లిబిల్లిగా అల్లుకున్న కరెంట్ తీగలు, సమాచారాన్ని చేరవేసే నాడులు, నరాలు అంటూ నాడీ వ్యవస్థ గురించి, తగ్గని దగ్గు, మానవుని పుండు, ఆగనిస్రావం అంటూ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు జాగ్రత్తల గురించి చెప్పారు ఇలా కొన్ని వైజ్ఞానిక విషయాలు మరికొన్ని భౌగోళిక అంశాలు. జంతువులు, పక్షులు, ఆకుకూరలు, ఇలా దేన్ని వదలకుండా ప్రతి విషయాన్ని వస్తువులుగా ఎంచుకుని చిట్టిపొట్టి గేయాలు మీకు సిద్ధం చేశారు. ఇవి చదవడం వల్ల కఠినమైన విషయాలను ఎలా వ్రాసి చెప్పవచ్చో అందరికీ అర్థమవుతుంది. చివర్లో మీకు ఎంతో ఇష్టమైన పదంలో పదం దాచిపెట్టి దండ గుచ్చి ఉంచారు. రాయికానీ రాయి, కర్రకాని కర్ర, టూరుగాని టూరు, పాలు కాని పాలు, సిటీగాని సిటీ, గ్రామంకాని గ్రామం. దేహం కాని దేహం, హారంకాని హారం ఏంటో తెలుసుకోవాలంటే ఈ సీతాకోక చిలుకలను పట్టుకొని బుద్ధిగా అడగాల్సిందేమరి.


పేజీలు: 106, వెల: 70/ రూ , ప్రతులకు: డాక్టర్ కందేపి రాణిప్రసాద్.
సృజన పిల్లల ఆసుపత్రి, పాత బస్టాండ్ వద్ద, సిరిసిల్ల 505301
తెలంగాణ రాష్ట్రం, 9866160378

పరిచయకర్త: డాక్టర్ అమ్మిన

రహస్యాలమయం మహాబలిపురం

పల్లవరాజులు నిర్మించిన మహాబలిపురం తీర దేవాలయంలో అనేక రహస్యాలు దాగిఉన్నాయి. 1200 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ దేవాలయంలో ఎన్నో వింతలు దర్శనమిస్తాయి. అందులోని శిల్పాలను చూస్తే పురాతన కాలంలోనే రాకెట్ ప్రయోగాలకు నాందిపలికారని అనిపిస్తుంది.. మహాబలిపురం చెన్నయ్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. పూర్వం దీన్ని మామల్లపురం పేరుతో పిలిచేవారు. క్రీస్తుశకం 7 నుంచి 10వ శతాబ్దం వరరకు పల్లవరాజుల కాలంలో ఓడరేవుగా ప్రసిద్ధి చెందింది. బలిచక్రవర్తి ఈ ప్రాంతాన్ని పాలించడం వల్ల ఈ ప్రాంతానికి మహాబలిపురమనే పేరు వచ్చిందని స్థానికులు అంటారు. రాక్షసుడైన మహాబలిని శ్రీ మహావిష్ణువు సంహరించడంతో ఈ పేరు వచ్చిందని స్థలపురాణాలు పేర్కొంటున్నాయి. కాంచిపురాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించిన పల్లవులు స్వదేశీ కళాకారులతో సాగరతీరంలో పెద్ద రాతి కట్టడాన్ని నిర్మించారు. మహాదేవుని ఆలయంతోపాటు పంచపాండవరథాలు ఇందులో ఉన్నాయి. వీటిలో ప్రధానమైన కృష్ణుని రాయి. దీన్ని కృష్ణుడి వెన్నముద్దగా పిలుస్తారు. దాదాపు 20 అడుగుల పొడవు. వెడల్పు ఎత్తు కలిగిన ఈ రాయి కేవలం రెండు చదరపు గజాలస్థలంలో ఉంటుంది. 250 టన్నుల బరువుండే ఈ రాయిని తొలగించడానికి చాలామంది ప్రయత్నించి కనీసం అంగుళం కూడా కదిలించలేకపోయారు. 1908లో ఈ ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్థర్ అలీ అనే బ్రిటీష్ అధికారి ఏడు ఏనుగులను తెప్పించి పెద్ద గొలుసులతో దాన్ని కదలించడానికి శతవిధాలుగా ప్రయత్నించాడు. కానీ కొంచెం కూడా కదలలేక నిరాశతో వెనుదిరిగారు. ప్రఖ్యాత గాంచిన ఈ శిలను పల్లవరాజు నరసింహవర్మ ఆకాశదేవుని రాయిగా పేర్కొని, దీనిని ఏ శిల్పి ముట్టకూడదని శాసించాడు. కొందరు మాత్రం గుడికోసం తెచ్చిన ఈ రాయిని మధ్యలోనే వదిలేసారని వాదిస్తారు. ఇంకొందరు ఇది గ్రహాంతవాసులు ఎగిరే పళ్లెం అని అంటారు. దాదాపు 250 టన్నులు బరువు ఉండే ఈ రాయిని కొండపైకి తీసుకురావాలంటే ఆ రోజుల్లో సాధ్యమయ్యే పనికాదు. అందుకే ఇది ఎలియన్స్‌కి సంబంధించింది అంటారు. ఈ రాయిని పోలిన రాళ్లు ప్రపంచంలో కొన్ని చోట్ల ఉన్నాయి.





నీటి ఆటలు ఎన్నెన్నో...

ఫ్రెండ్స్... మన రాష్ట్రంలోనే కాదు, మన దేశంలో కూడా పిల్లల విషయంలో ఎవరూ అంతగా శ్రద్ధపెట్టడంలేదేమోనని అనిపిస్తుంది. ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారా? విదేశాల్లో పిల్లల కోసం ఎన్ని సౌకర్యాలో చూస్తుంటే నాకు మాత్రం ఈ ప్రశ్న తలెత్తింది. అసలు పిల్లలు ఆడుకోవడానికి మనకు ఏ సౌకర్యాలు ఉన్నాయి. బండెడు పుస్తకాలు మోయాలి. తీరిక లేకుండా హోంవర్క్‌తో అలసిపోవాలి. మార్కులు రావడం లేదని, లేదా ర్యాంకు రావడం లేదని అమ్మ, నాన్న అడగడం. కొత్తవారి ముందే ఇతరులతో మనలను పోల్చడం మామూలైపోయింది. కానీ మనకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో? ఒక్క సారైనా ఆలోచించారా? న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో పిల్లల కోసం ప్రతి వీధిలో ఒక అందమైన పార్కు ఉంటుంది. అక్కడికి పిల్లలంతా ఇష్టం ఉన్నప్పుడు వచ్చి, ఓపిక ఉన్నంతవరకు ఆడుకుని వెళతారు.



అవేకాకుండా అక్కడక్కడా ప్రత్యేకంగా రకరకాల ఆటస్థలాలు ఉంటాయి. అందులో ఎన్నెన్నో సృజనాత్మక క్రీడలు ఏర్పాటు చేస్తారు. సుమారు పది ఎకరాల్లో ఇలాంటి ఆటలు ఏర్పాటు చేసారు. మన రాష్ట్రంలో పిల్లలకోసం ఏర్పాటు చేసిన ఏ ఒక్క పార్కులో ఆట వస్తువులు ఉండవు. మరికొన్ని చోట్లలో పిల్లల పార్కులను ఆక్రమించుకుని పెద్ద భవనాలు కూడా నిర్మించుకున్న సంఘటనలు ఉన్నాయి. సరే. అవన్నీ పక్కన పెట్టి కనీసం మనలను పట్టించుకుంటేనే మన భవిష్యత్తేకాకుండా దేశభవిష్యత్తు కూడా బాగుంటుంది.ఇక్కడ మీకు కనిపించు ఫోటో పిల్లలకోసం ఏర్పాటు చేసిన వాటర్ గేమ్స్.. ఇందులో పదేళ్ల పిల్లలే ఎక్కువగా వచ్చి ఆడుకుంటారు. సుమారు ప్రతిరోజు సాయంకాలాలు ఇక్కడికి పిల్లలు వస్తారు. ప్రత్యేకంగా శని, ఆదివారాల్లో ఎక్కువగా రద్దీగా ఉంటుంది. పైగా ఎలాంటి ఫీజు ఉండదు. ఎంతో శుభ్రంగా ఉంటుంది. కనీసం భవిష్యత్తులోనైనా ఇలాంటి ఏర్పాట్లు చేయాలి. లేదా మీరు పెద్దయ్యాక ఇలాంటి వాటిపై దృష్టిపెట్టాలి.సరేనా..

టి. వేదాంతసూరి

నక్షత్రమండలం

ఏ సాధనం లేకుండా మన కంటితో మాత్రమే చూడగల ఖగోళలోకం అండ్రోమెడా గెలాక్సీ (నక్షత్రమండలం). ఇది భూమి నుంచి ఒక మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీనివ్యాసం 220వేల కాంతి సంవత్సరాలు. ఈ నక్షత్రాల దీవి మన భూమి ఉండే పాలపుంత కన్నా రెండింతలు ఉంటుంది. దీనిలో సుమారు ఒక ట్రిలియన్ నక్షత్రాలుంటాయి. ఇది మన పాలపుంతలాగా సర్పిలాకారంలో ఉంటుంది.
ఒక కాంతి సంవత్సరం అంటే కాంతి సెకనుకు 30,00,000 కిలోమీటర్ల వేగంతో ఒక సంవత్సరంలో ప్రయాణించే దూరం. అంటే 10 ట్రిలియన్ కిలోమీటర్లు.
ఈ మధ్యకాలంలో శాస్త్రవేత్తలు అతి ప్రతిభావంతమైన టెలిస్కోపుల్ని రూపొందించారు. వాటి సాయంతో 13 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉండే గెలాక్సీలను చూడగలుగుతున్నారు. కానీ ఈ దూరంలో వారికి ఇప్పటి విశ్వం కనిపించదు. భూతకాలంలో ఉన్న విశ్వం కనిపిస్తుంది. అంటే 13 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో భూతకాలంలో ఉన్న గెలాక్సీల స్థితిని చూడగలుగుతున్నాం.



పకపక



మెదడు లేదన్నమాట

రాము: నీ మెదడు చూసుకున్నావా?
సోము: లేదు
రాము: నీ మెదడును కనీసం తాకావా?
సోము: లేదు
రాము: ఓకే, నీకు మెదడు లేదన్నమాట!





యస్ కరెక్ట్

టీచర్: స్టీమ్ ఇంజిన్‌ని ఎవరు కనిపెట్టారు?
విద్యార్థి: వాట్సార్ (చెప్పండిసార్) ...
టీచర్: యస్ కరెక్ట్. ఇట్స్ జేమ్స్ వాట్


మార్చండి

కూతురు: మమ్మీ ప్లీజ్ ట్యూషన్ టీచర్‌ని మార్చండి
తల్లి: ఎందుకు డార్లింగ్
కూతురు: మా టీచర్ మాట మీద నిలబడటం లేదు
మొన 5 ప్లస్ 4 అయితే 9 అంది. నిన్న 2 ప్లస్ 7 అయితే 9 అంది. ఇవ్వాళేమో 3 ప్లస్ 6 కలిపితే 9 అంటోంది.




జైలుకెళ్తారు

టీచర్: "నేను ఓ వ్యక్తిని చంపాను" అనే వాక్యాన్ని భవిష్యత్తుకాలంలో చెప్పండి
విద్యార్థులు: మీరు భవిష్యత్తులో జైలుకెళ్తారు



5 డైడ్

టీచర్: సున్నా నుంచి 10 వరకు చెప్పాలి.
విద్యార్థి: 0, 1,2,3,4,6,7,8,9,10
టీచర్: 5 ఎక్కడ?
విద్యార్థి: నిన్న వార్తల్లో కారు ప్రమాదంలో "5 డైడ్" అని విన్నాను.



బంగారు పలుకు

ప్రతిరోజు మీతో మీరు మాట్లాడండి. లేనిపక్షంలో నైపుణ్యం ఉన్న వ్యక్తిని కోల్పోతారు
- స్వామి వివేకానంద





అల్లు అర్జున్

సేవకా ఓ సైనికా...

సరిహద్దున నువ్వు లేకుంటే...ఏ కనుపాప కంటినిండుగా నిదర పోదురా..నిదరపోదురా...అంటూ సాగే నా పేరు సూర్య చిత్రంలోని పాటను రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేశారు. ఈ పల్లవికి కొనసాగింపుగా ఇల్లే ఇండియా..దిల్లే ఇండియా..నీ తల్లే ఇండియా..తన భరోసా నువ్వే దేశం కొడకా.. సెలవే లేని సేవకా ఓ సైనికా..పనిలో పరుగే తీరికా ఓ సైనికా.. ప్రాణం అంత తేలికా ఓ సైనికా..పోరాటం నీకో వేడుకా ఓ సైనికా... అని పేర్కొంటూ భావోద్వేగంగా సాగే ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి సాహిత్యాన్ని అందించగా, విశాల్-శేఖర్ సంగీతాన్ని సమకూర్చారు. ఆదిత్యా మ్యూజిక్ ద్వారా ఈ పాట విడుదలైంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా వక్కంతం వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష లగడపాటి, శ్రీధర్ లగడపాటి, బన్నివాసు నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ ఇప్పటికే మూడొంతులు పూర్తయింది. రేయి అనక పగలనక దేశ రక్షణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతున్న సైనికులను ఉద్దేశించి రాసిన ఈ పాటను రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేస్తూ... సైనికులకే అంకితమిచ్చారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ అందరికీ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ చిత్రంలో అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటిస్తోంది. ఏప్రిల్ నెలాఖరులో ఈ చిత్రాన్ని విడుదల చేయాలన్న లక్ష్యంతో చిత్రబృందం ముందుకు సాగుతోంది.



భరత్ అనే నేను..

మహేష్‌బాబు తాజాగా రాజకీయ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డి.పార్వతి సమర్పణలో డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ అధికారికంగా నిర్ణయించకపోయినప్పటికీ భరత్ అనే నేను పేరు విస్తృత ప్రచారంలో ఉన్న విషయం వేరుగా చెప్పనక్కరలేదు. ఇందులో మహేష్‌బాబు ముఖ్యమంత్రి పాత్రలో మెరవనున్నట్లు చాలారోజులుగా వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ దశలోనే ఈ చిత్రం అంచనాలు మిన్నంటుతున్న నేపథ్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా భరత్ అనే నేను పేరిట ఆడియో బిట్‌ను, అలాగే టైటిల్ లోగోతో పాటు మహేష్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదలచేశారు. బ్యాగ్ పట్టుకుని నడుచుకుంటూ వెళ్తున్నట్లు ఉన్న మహేష్ లుక్ ప్రేక్షకాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం చిత్రీకరణ చాలామటుకు పూర్తికావడంతో ఇక ప్రమోషన్ల పర్వం మొదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందు జరిగే ఫిక్షనల్ పొలిటికల్ డ్రామా ఇది. ఈ సినిమా ప్రమోషన్‌కు జనవరి 26 మంచి సందర్భం అని మేమంతా భావించి భరత్ అనే నేను ఫస్ట్ ఓత్ పేరుతో ఉదయం 7 గంటలకు ఆడియో బిట్‌ను విడుదలచేశాం. ఇలాంటి కంటెంట్‌కి వీడియో కంటే ఆడియోను విడుదలచేస్తే మంచి ఇంపాక్ట్ ఉంటుందని మేమంతా భావించాం. అందుకే మహేష్‌బాబు వాయిస్‌తో ఫస్ట్ ఓత్‌ని విడుదల చేయడంతో ప్రమోషన్ మొదలుపెట్టాం అని చెప్పారు.

నిర్మాత దానయ్య మాట్లాడుతూ, ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌కి విశేషమైన స్పందన లభిస్తోంది. ప్రస్తుతం రామ్, లక్ష్మణ్ నేతృత్వంలో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. మహేష్, కొరటాల కాంబినేషన్‌లో ఇంత భారీ చిత్రం చేయడం చాలా ఆనందంగా ఉంది. మా బేనర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం చేస్తున్నాం అని చెప్పారు.

ఇందులో మహేష్ సరసన బాలీవుడ్ భామ కైరాఅద్వాని నాయికగా నటిస్తుండగా, ఇతర పాత్రల్లో శరత్‌కుమార్, ప్రకాష్‌రాజ్, దేవరాజ్, పోసాని తదితరులు తారాగణం. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, రవి కె.చందన్, ఎస్.తిరునవుక్కరసు ఛాయాగ్రహణం, ఎడిటింగ్ శ్రీకర్‌ప్రసాద్ అందిస్తున్నారు.

రవితేజను ఆటపట్టించాను...

- సీరత్ కపూర్

రన్ రాజా రన్ చిత్రంతో తెలుగు తెరకొచ్చిన ముంబై భామ సీరత్ కపూర్. గతేడాది రాజుగారి గది 2, ఒక్కక్షణం సినిమాలతో విజయాలు అందుకుని క్రేజ్ పెంచుకుంది. ప్రస్తుతం రవితేజ సరసన సీరత్ నటిస్తున్న తాజా చిత్రం టచ్ చేసి చూడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా టచ్ చేసి చూడు సినిమా విశేషాలతో పాటు తన పాత్ర గురించి సీరత్ వివరించింది. ఆమె మాట్లాడుతూ.. ఇప్పటిదాకా చేయని పాత్రను టచ్ చేసి చూడులో చేశాను. గతంలో నేను నటించిన పాత్రలన్నీ చాలా సున్నితమైన మనసు గల అమ్మాయి క్యారెక్టర్‌లు. కానీ ఇందులో దూకుడుగా ఉంటాను. ప్రతి ఒక్కరిపై నాదే పైచేయిలా ఉండాలనుకుంటాను. కథానాయకుడిని కూడా ఆట పట్టిస్తుంటాను. సాధారణంగా మన చిత్రాల్లో హీరోలే హీరోయిన్‌లను ఏడిపిస్తుంటారు. కానీ నేను ఇందులో రవితేజను అల్లరి పెడుతుంటాను. నిజ జీవితంలో ఇలా ఉండను కాబట్టి నటించేప్పుడు పాత్రను ఆస్వాదించాను. నేనూ రాశీ ఖన్నా నాయికలుగా నటించాం. మా ఇద్దరి మధ్యా సన్నివేశాలు ఉండవు. రవితేజ లాంటి పెద్ద కథానాయకుడితో సినిమా అవకాశం వచ్చినప్పుడు ఇద్దరు నాయికలు ఉన్నారా అని ఆలోచించలేదు. సోలోగా నటించాలని ఉంటుంది. కానీ అన్ని రకాలుగా అవకాశాలు వస్తుంటాయి. నేను నటిగా సుదీర్ఘ ప్రయాణాన్ని కోరుకుంటున్నాను కాబట్టి ఇవన్నీ పట్టించుకోను. నాది కూడా కథలో ప్రాముఖ్యన పాత్రే. ద్వితీయార్థం నుంచి చిత్రంలో ఉంటాను. రవితేజతో మాస్ పాట చేశాను. నాకిదే తొలి మాస్ పాట. రవితేజ తానొక స్టార్ అనుకోకుండా వినయంగా ఉంటాడు. ఆయనను ఆట పట్టించే పాత్ర చేస్తున్నప్పుడు సవాలులా అనిపించింది. మనమంతా గుండె మీద చేతులు వేసుకుని హాయిగా ఉంటున్నామంటే పోలీసుల కష్టమే కారణం. వాళ్లు నిరంతరం మనకు రక్షణ ఇస్తుంటారు. పోలీసు కథల ఇతివృత్తాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ రవితేజ కథానాయకుడిగా నటిస్తున్నాడు కాబట్టి...ఆ యాక్షన్‌తో పాటు వినోదాన్ని జోడించారు. పోలీస్ కథైనా కుటుంబ కథా చిత్రంగా మలిచారు దర్శకుడు. అని చెప్పింది.









గణతంత్ర దినోత్సవంలో తారలు

రిపబ్లిక్ డే సందర్భంగా కొన్ని చిత్రాల షూటింగ్ లొకేషన్లల్లో కూడా జెండా వందనం జరిగింది. ఒక్కసారి ఆ వివరాల్లోకి వెళితే...రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రంగస్థలం చిత్రం తెరకెక్కుతున్న సంగతి విదితమే. ఇటీవల విడుదలైన టీజర్‌కు విశేషమైన స్పందన లభించడంతో చిత్రంపై ఇప్పటికే నెలకొన్న అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం చిత్రీకరణ చివరిదశకు చేరుకున్న దశలో ఈ చిత్రబృందం రాజమండ్రికి సమీపంలోని గోదావరి పరిసరాల్లో చిత్రీకరణ జరుపుతోంది. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రబృందం జాతీయ జెండాను ఎగురవేసింది. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్, ఇతర బృందం పాల్గొని జాతీయ జెండాకు వందనం సమర్పించింది. ఇదిలావుండగా...రామ్‌చరణ్ నటించబోయే 12వ చిత్రం కూడా సెట్స్‌పైకి వచ్చింది. దీనికి దర్శకత్వం వహిస్తున్న బోయపాటి శ్రీను రిపబ్లిక్ డే సందర్భంగా ఇదే సెట్స్‌లో జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అలాగే పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ కూడా జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి, సెల్యూట్ చేశారు. వీరితో పాటు ఇంకా కొందరు రిపబ్లిక్ డే వేడుకలలో పాల్గొన్నారు.



మనసిస్తే మాటివ్వు...

అరుణ్ రాహుల్, అంజనా జంటగా కెజె రాకేష్ నిర్మిస్తున్న చిత్రం చేతిలో చెయ్యేసి చెప్పు బావ. సుమన్, భానుచందర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కట్ల రాజేంద్రప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. చేతిలో చెయ్యేసి చెప్పు బావ చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగింది. అనంతరం సంగీత దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ...గాయకుడిగా నేను మీకు తెలుసు. మణిశర్మ దగ్గర అనేక చిత్రాలకు పనిచేశాను. ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ కథ విన్నాక మంచి ప్రేమ కథ అనిపించింది. సంగీతానికి ప్రాధాన్యత ఉంటుంది. మంచి పాటలు చేయాలని అనుకుంటున్నాను. అన్నారు. దర్శకుడు కట్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ...నిర్మాత రాజేష్ మంచి కథను అందించారు. దానికి తగినట్లు టైటిల్ కుదిరింది. ఈ జన్మలో ప్రేమను దక్కించుకోలేని జంట...మరుజన్మలో ఎలా కలిశారు. వాళ్ల పగను ఎలా తీర్చుకున్నారన్నది కథాంశం. ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభించి...ఏప్రిల్‌లో పూర్తిచేస్తాం. వేసవి విడుదలకు రావాలని అనుకుంటున్నాం. అన్నారు. ఈ చిత్రానికి కెమెరా - వేణు మురళీధరన్, ఆర్ట్ - శ్రీను